ఒకే కుటుంబంలోని 8మంది మృతి



2

ఆర్బీఐ డివిడెండ్‌లో వాటా పంచండి!




2


# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

గుంటూరు - సోమవారం 25 మే 2026 ‖ సంపుటి: 10 ‖ సంచిక: 140 ‖ పేజీలు: 8+4 ‖ వెల రూ.5

GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA | HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM |

శ్రమకు గుర్తింపు. శ్రామికులకు గౌరవం


# లేబర్ అడ్డాలతో నూతన అధ్యాయం

- కార్మికుల నైపుణ్యాలకు పదును పెట్టేలా స్కిల్ ట్రైనింగ్
- వివాహం నుంచి ప్రసూతి వరకు... కార్మిక కుటుంబాలకు ఆర్థిక రక్ష
- సేఫ్టీ ఫస్ట్ నినాదంతో పారిశ్రామిక భద్రతలో నూతన ప్రమాణాలు
- భవన నిర్మాణ కార్మికులకు కూటమి భరోసా
- ఈఎస్ఐ ఆస్పత్రులలో సరికొత్త డిజిటల్ విప్లవం

2


## రైతాంగానికి అండగా కూటమి ప్రభుత్వం

- వ్యవసాయం నుంచి ఆక్వా వరకు ప్రతి రంగంపై ప్రత్యేక దృష్టి
- ఎండలు, మార్కెట్ సంక్షోభాలపై హై అలర్ట్
- ప్రతి సమస్యకు తక్షణ పరిష్కారంపై మంత్రి అచ్చెన్నాయుడు ఫోకస్
- ప్రకృతి సవాళ్లను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సిద్ధం
- రైతులకు సాంకేతిక సహాయం, సబ్సిడీలు, మార్కెట్ మద్దతు
- రైతులు ఆందోళన చెందవద్దు
- రైతు ప్రయోజనాల పరిరక్షణలో రాజీ లేదు
- వైసీపీ అసత్య ప్రచారాలపై మంత్రి అచ్చెన్నాయుడు ఫైర్
- గత ఐదేళ్లు రైతులు అగాధంలోకి వెళ్లారు.. కూటమి ప్రభుత్వంలోనే మంచి ధరలు లభిస్తున్నాయన్న మంత్రి అచ్చెన్న



అమరావతి, మే 24,(మనం న్యూస్): రాష్ట్రంలో రైతులు, పౌల్ట్రీ, ఉద్యాన, ఆక్వా రంగాలు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యపై కూటమి ప్రభుత్వం అత్యంత అప్రమత్తంగా పనిచేస్తోందని, రైతాంగ ప్రయోజనాల పరిరక్షణే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర వ్యవసాయ,అనుబంధ శాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. యూరియా లభ్యత నుంచి మొక్కజొన్న ధరలు, రొయ్యల మార్కెట్ పరిస్థితులు, కొబ్బరి రైతుల సమస్యలు, ...మిగతా 2లో

## శ్వేత సౌధం సమీపంలో కాల్పుల కలకలం



2

## 'లేపాక్షి'కి సాంకేతిక హంగులు

హస్త కళారూపాల అమ్మకాల పెంపే లక్ష్యం

- తరంగా ఏఐ ఆధారిత డిజిటల్ వ్యవస్థ రూపకల్పన
- ఏ రోజుకారోజు స్టాక్, అమ్మకాల వివరాల నమోదు
- ఇంటికే హస్త కళారూపాలు అందించేలా
- కళాక్షి వాట్సాప్ లింక్ రూపకల్పన
- ఏఐ టూల్ తో లింక్ లో హస్త కళల సమాచారం
- వాట్సాప్ లోనే హస్త కళలకు ఆర్డర్లు... డోర్ డెలివరీ
- హస్త కళాకారులకు గౌరవ ప్రద జీవనమే లక్ష్యం : మంత్రి సవిత



అమరావతి,మే,24,(మనం ప్రతినిధి): హస్త కళారూపాలు కేవలం వస్తువులే కాదు ఆయా ప్రాంతాల సాంస్కృతి, సంప్రదాయాలకు చిహ్నాలు. వారసత్వ ప్రదాతలు హస్త కళాకారులు. చరిత్రకు ఆనవాలుగా నిలిచే హస్త కళలకు, ...మిగతా 2లో

## ప్రతిపక్షానివి పసలేని ఆరోపణలు




2

- నెల్లూరులో విద్యపై మంత్రి నారాయణ ప్రత్యేక దృష్టి
- 20 కోట్లతో అంతర్జాతీయ స్థాయి పాఠశాల నిర్మాణం
- 15 వేల మంది పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యే లక్ష్యంగా అడుగులు
- టీచర్ పోస్టుల భర్తీలో ప్రతిపక్షాల ఆరోపణలపై మండిపడ్డ మంత్రి నారాయణ

## హర్మూజ్‌ను తెరవనున్న ఇరాన్


ఇరాన్ అధికారిక మీడియా వెల్లడి

టెహ్రాన్, మే 24 : ఇరాన్-అమెరికా మధ్య యుద్ధం ముగింపు చర్చలు వేగవంతమయ్యాయి. ఏ క్షణంలో అయినా ఈ విషయంపై ప్రకటన వెలువడే అవకాశం ఉంది. ఇరుదేశాలు 60 రోజుల పాటు కాల్పుల విరమణ ఒప్పందంపై చర్చలు జరుపుతున్నట్లు ఇరాన్ అధికారిక మీడియా వెల్లడించింది. ఇందులో హర్మూజ్‌ను 60 రోజులపాటు తెరవడం, ఇరాన్ అణు కార్యక్రమాలను నిలిపివేయడం వంటి అంశాలు ఉన్నట్లు పేర్కొంది. ఒప్పందంలో భాగంగా జలసంధిలో అమర్చిన మందుపాతరలను తొలగించడానికి ఇరాన్ అంగీకరించినట్లు తెలిపింది. ఇరాన్ ఓడరేవులపై అమెరికా తన దిగ్బంధనాన్ని ఎత్తివేస్తుందని దీంతో ఇరాన్ సైతం స్వేచ్ఛగా ప్రపంచ దేశాలకు చమురును విక్రయించుకోగలదని పేర్కొంది. ఈ ముసాయిదా ఒప్పందంలో అమెరికా దాని మిత్ర దేశాలు ఇరాన్‌పై దాడి చేయకూడదని.. దానికి ప్రతిగా ఇరాన్ కూడా అమెరికాపై గానీ, దాని మిత్రదేశాలపై గానీ ఎలాంటి ముందస్తు దాడులు చేయకూడదనే ప్రతిపాదన ఉన్నట్లు ఇరాన్ మీడియా పేర్కొంది. ఖతార్ బ్యాంకుల్లో స్తంభింపజేసిన 6 బిలియన్ డాలర్ల (సుమారు రూ.55 వేల కోట్లు) టెహ్రాన్ ఆస్తులను విడుదల చేసేందుకు ట్రంప్ యంత్రాంగం అంగీకరించినట్లు తెలిపింది. దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. లెబనాన్‌లో కాల్పుల విరమణ అంశం కూడా ఈ ఒప్పందంలో ఉన్నట్లు ఇరాన్ మీడియా వెల్లడించింది. మరోవైపు ఇరుదేశాల మధ్య తుది ఒప్పందం కుదిరితేనే ఇరాన్‌ను మోహరించి ఉన్న తమ దళాలు వెనక్కు వెళుతాయని అమెరికా అధికారిక వర్గాలు వెల్లడించాయి.



## చిన్నశేషుడిపై వెలసిన శ్రీ గోవిందుడి దివ్యమహిమ

గోవింద నామస్మరణలతో మారుమోగిన తిరుపతి మాడవీధులు



3

## రాష్ట్ర ఎపీఎస్ఎఫ్టీవీటీడీసీ చైర్మన్‌గా పి. భరత్ భూషణ్ ప్రమాణ స్వీకారం

విజయవాడ సెంట్రల్ మే 24( మనం న్యూస్): స్థానిక ఎన్టీఆర్ పరిపాలనా భవనంలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చలనచిత్ర, టెలివిజన్, నాటకరంగ అభివృద్ధి సంస్థ చైర్మన్ గా పి. భరత్ భూషణ్, వైస్ చైర్మన్ గా సీహెచ్ మెహర్ రమేష్ లు ఆ సంస్థ కార్యాలయంలో ఆదివారం సాయంత్రం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ పి. భరత్ భూషణ్ మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రంలో సినిమా, కళలు, నాటకరంగ అభివృద్ధికి నా వంతు కృషి చేస్తానన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చలనచిత్ర, టెలివిజన్ మరియు నాటక రంగ అభివృద్ధి సంస్థ చైర్మన్ పి. భరత్ భూషణ్ మాట్లాడుతూ తనకు ఈ పదవి ద్వారా సేవచేసే అవకాశం ఇచ్చినందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి కందుల దుర్గేష్, శాసనసభ్యులు నందమూరి బాలకృష్ణ లకు కృతజ్ఞతలు తెలిపారు. 1984లో నందమూరి తారకరామారావు డి.వి.యస్. రాజు అధ్యక్షతన ఇలాంటి పూర్తిస్థాయి కమిటీని వేశారని, మళ్లీ ఇన్నేళ్ల తర్వాత కూటమి ప్రభుత్వం సినిమా రంగానికి సంబంధించి కొత్త కమిటీని ఏర్పాటు చేసిందని గుర్తుచేశారు. శాసనసభ్యులు నందమూరి బాలకృష్ణ ఎంతో బిజీగా ఉన్నప్పటికీ, సినీ రంగంపై ఉన్న ప్రేమతో, ఆంధ్రప్రదేశ్లో పరిశ్రమ అభివృద్ధి చెందాలనే ఆకాంక్షతో తనకు పూర్తి సహకారం అందించారని, అందుకు వారికి జీవితకాలం రుణపడి ఉంటానని పేర్కొన్నారు. పవన్ కళ్యాణ్, కందుల ...మిగతా 2లో



# ఎబోలా గుబులు..

కాంగో, ఉగాండా, దక్షిణ సూడాన్‌లకు హెల్త్ అడ్వైజరీ జారీ

- అధికంగా నమోదవుతున్న మరణాలు
- పబ్లిక్ హెల్త్ ఎమర్జెన్సీగా ప్రకటించిన డబ్ల్యూహెచ్వో

జెనీవా, మే 24 : ఈశాన్య కాంగోలోని ఇటూరి ప్రావిన్స్‌లో ఎబోలా వేగంగా వ్యాపిస్తోంది. రోజు రోజుకూ మృతుల సంఖ్య పెరుగుతుండటంతో ప్రపంచ ఆరోగ్య సంస్థ బుండిబుగ్యో ఎబోలాను అంతర్జాతీయ స్థాయిలో ఆందోళనకరమైన పబ్లిక్ హెల్త్ ఎమర్జెన్సీగా ప్రకటించింది. ప్రస్తుతం కాంగో, ఉగాండ, దక్షిణ సూడాన్లలో వ్యాప్తి తీవ్రత ఎక్కువగా ఉన్నట్లు వెల్లడించింది. మరోవైపు భారత ప్రభుత్వం కూడా బుండిబుగ్యో ఎబోలాపై అప్రమత్తమైంది. ప్రజలు అత్యవసరమైతే తప్ప కాంగో, ఉగాండా, దక్షిణ సూడాన్ దేశాలకు ప్రయాణించవద్దని హెల్త్ అడ్వైజరీ జారీ చేసింది. శనివారం నాటికి కాంగోలో మొత్తం 867 మందికి ఈ వ్యాధి వ్యాపించగా.. 204 మరణాలు నమోదయ్యాయి. కేవలం వారాల వ్యవధిలోనే మూడు దేశాలకు పాకిన ఎబోలా వందల మందికి సోకింది. భౌగోళికంగా కూడా ఈ వ్యాధి వ్యాపించిన ప్రదేశంలో కట్టడి చేయడం చాలా కష్టమని అంతర్జాతీయ ఆరోగ్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఈశాన్య కాంగోలోని యుద్ధ ప్రభావిత ప్రాంతమైన ఉగాండా సరిహద్దుల్లో తొలి ఎబోలా కేసు



నమోదైంది. అక్కడ ఒక హెల్త్ వర్కర్ వాంతులు, జ్వరంతో చికిత్స తీసుకొని కొన్ని రోజుల్లోనే మరణించారు. ఆ తర్వాత ఆ మృతదేహాన్ని అంత్యక్రియల కోసం ఇంటికి తరలించారు. దానిని తాకిన చాలా మందికి కొన్నాళ్లకే ఎబోలా లక్షణాలు బయటపడ్డాయి. వైరస్ సోకిన వారికి కొన్ని వారాలపాటు వ్యాధి లక్షణాలు బయటపడకపోవడంతో ఎక్కువ మందికి సోకే అవకాశం కలుగుతోంది. వ్యాధి వ్యాపించిన ప్రదేశం కాంగోలో ప్రధాన మైనింగ్ కేంద్రం కావడంతో జనాభా రద్దీ అధికంగా ఉంటుంది. దీంతో 2018లో ఎబోలా వ్యాపించిన సమయంలో దానిని కట్టడి చేయడానికి ఏకంగా రెండేళ్ల సమయం పట్టింది.

మనుషులకు సోకే నాలుగు రకాల ఎబోలా వైరస్‌లో బుండిబుగ్యో ఒకటి. దీనిని ఉగాండాలోని ఓ పర్వత ప్రాంతంలో తొలిసారి కనుగొన్నారు. గతంలో రెండుసార్లు మాత్రమే వ్యాపించడంతో అధికారులు పెద్దగా దృష్టిపెట్టలేదు. ఫలితంగా తాజాగా వ్యాపించిన ప్రదేశంలోని ల్యాబ్ పరీక్షల్లో దీనిని గుర్తించే సౌకర్యం లేకపోవడంతో.. గుర్తించేందుకు జాప్యం జరిగింది. మొదటి దీనిని గుర్తించేందుకు నమూనాను వేల మైళ్ల దూరంలో ఉన్న గవర్నమెంట్ రీసెర్చ్ ల్యాబ్‌కు పంపాల్సి వచ్చింది.

ఎబోలాలో జైర్ అనే స్ట్రెయిన్ అత్యంత వేగంగా వ్యాపిస్తుంది. దీంతో పోలిస్తే బుండిబుగ్యో ఎబోలా వైరస్ కొంచెం నెమ్మదిగానే ...మిగతా 2లో

## ఆత్మాహుతి దాడి 24 మంది మృతి


- మేమే దాడి చేశాం
- బలోచ్ లిబరేషన్ ఆర్మీ

ఇస్లామాబాద్, మే 24 : పాకిస్థాన్‌లో జాఫర్ ఎక్స్‌ప్రెస్‌కు అనుబంధంగా ఉన్న షటిల్ ప్యాసింజర్ రైలుపై ఆత్మాహుతిదాడి చోటుచేసుకుంది. క్వెట్టా ప్రాంతంలోని చమన్ ఫాటక్ రైల్వేస్టేషన్ సమీపంలో నేటి ఉదయం 8.00 గంటల సమయంలో భారీ పేలుడు సంభవించింది. ఈ ఘటనలో 24 మంది ప్రాణాలు కోల్పోగా.. 80మందికి పైగా గాయపడ్డారు. ఆర్మీ జవాన్లు, వారి కుటుంబ సభ్యులతో ప్రయాణిస్తున్న రైలు స్టేషన్ సమీపంలోని సిగ్నల్ దాటుతుండగా.. పేలుడు పదార్థాలతో ఉన్న వాహనం రైలు బోగీని ఢీకొట్టినట్లు అధికారులు వెల్లడించారు. దీంతో పేలుడు సంభవించిందన్నారు. మృతుల్లో ఎక్కువమంది సైనికులే ఉన్నారన్నారు.

పేలుడు దాటికి రైలు పాక్షకంగా దెబ్బతిందని.. 10కి పైగా వాహనాలు దగ్ధమయ్యాయని తెలిపారు. ఘటనా స్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయన్నారు. రైల్వే స్టేషన్ సమీపంలో పేలుడు చోటుచేసుకోవడంతో రైళ్ల రాకపోకల్లో అంతరాయం కలిగినట్లు అధికారులు వెల్లడించారు. క్వెట్టా నుంచి పెషావర్ వెళ్లే జాఫర్ ఎక్స్‌ప్రెస్‌ను స్టేషన్లో నిలిపివేసినట్లు తెలిపారు. పేలుడు తీవ్రతకు జాఫర్ ఎక్స్‌ప్రెస్‌లోని ఒక బోగీకి మంటలు అంటుకొన్నట్లు కూడా వార్తలు వెలువడ్డాయి. పేలుడు జరిగిన ప్రాంతానికి ...మిగతా 2లో

## కీవ్‌పై.. రష్యా దాడి!

అత్యాధునిక 'ఒరెష్నిక్' ప్రయోగం



మాస్కో, మే 24 : ఉక్రెయిన్ రాజధాని కీవ్ రీజియన్‌పై డ్రోన్లు, క్షిపణితో రష్యా మరోసారి విరుచుకుపడింది. బిలా సెర్క్వా నగరంపై ఆదివారం ఉదయం జరిపిన దాడిలో ఇద్దరు పౌరులు ప్రాణాలు కోల్పోగా.. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. దాడి కారణంగా నగరంలోని ప్రభుత్వ కార్యాలయాలు, నివాస సముదాయాలు, పాఠశాలలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. గడిచిన నాలుగేళ్లుగా కొనసాగుతున్న ఈ యుద్ధంలో ఈ ఆయుధాన్ని ఉపయోగించడం ఇది మూడోసారి మాత్రమే కావడం గమనార్హం.

దీనిపై ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ తీవ్రంగా మండిపడ్డారు. సాధారణ పౌరులే లక్ష్యంగా రష్యా భారీ డ్రోన్, క్షిపణి దాడులకు తెగబడిందని.. అందులో శక్తిమంతమైన హైపర్ సోనిక్ 'ఒరెష్నిక్' క్షిపణులను ప్రయోగిస్తోందని ఆరోపించారు. అయితే, దీనిపై ఇప్పటి వరకు రష్యా స్పందించలేదు. ఒరెష్నిక్ అనేది హైపర్ సోనిక్ బాలిస్టిక్ క్షిపణి. రష్యా అత్యాధునిక క్షిపణుల్లో ఒకటైన ఈ మిస్సైల్ గంటకు 13,000 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించగలదు. అంటే ధ్వని వేగం కంటే 10 రెట్లు వేగంగా దూసుకెళ్తుంది. ఈ క్షిపణి అణు వార్‌హెడ్‌లను మోసుకెళ్లగలదు.

యూరప్‌లోని అన్ని దేశాలు ఈ క్షిపణి పరిధిలోకి వస్తాయని, దీన్ని అడ్డుకునే సామర్థ్యం గల ఆయుధమేదీ లేదని రష్యా గతంలో ప్రకటించింది. తొలిసారిగా దీనిని 2024 నవంబరులో ఉక్రెయిన్ నగరమైన డినిప్రోలోని ఓ ఫ్యాక్టరీ మీద రష్యా ప్రయోగించింది. అప్పట్లో అది అభివృద్ధి దశలోనే ఉంది. ఇటీవలే దీన్ని పూర్తిస్థాయిలో సిద్ధం చేసినట్లు సమాచారం. ఉక్రెయిన్లోని పశ్చిమ లీవ్ ప్రాంతంలో రష్యా రెండోసారి ఈ క్షిపణి ఉపయోగించగా.. తాజాగా కీవ్ రీజియన్‌పై మూడోసారి ప్రయోగించింది.

# లేబర్ అడ్డాలతో నూతన అధ్యాయం

(మొదటి పేజీ తరువాయి)

**అమరావతి, మే 24,(మనం ప్రతినిధి):** రాష్ట్ర నిర్మాణంలో అహర్నిశలు శ్రమిస్తూ, సమాజానికి వెన్నెముకలా నిలిచే సంఘటిత, అసంఘటిత రంగాల కార్మికులకు సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం గత రెండేళ్లలో విప్లవాత్మక అడుగులు వేసింది. గత ప్రభుత్వ హయాంలో ఇసుక విధాన లోపాలు, నిధుల దారి మళ్లింపుతో కుదేలైన నిర్మాణ రంగాన్ని, కార్మిక వ్యవస్థలను పునరుద్ధరిస్తూ కొత్త ఆశలు చిగురింపజేసింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దార్శనికతతో, అటు పారిశ్రామిక అభివృద్ధిని, ఇటు కార్మికుల సంక్షేమం, ప్రాణ భద్రతను సమానంగా ముందుకు తీసుకెళ్తూ కార్మిక శాఖలో సరికొత్త ప్రగతి ఆవిష్కృతమవుతోంది. కార్మికుల సంక్షేమం, అభివృద్ధి, ఆరోగ్యం, రక్షణే ధ్యేయంగా అనేక కీలక నిర్ణయాలు తీసుకుంది. వివిధ రంగాల్లోని కార్మికులకు స్కిల్ అప్ గ్రేడ్ అయ్యేలా వారికి ట్రైనింగ్ ఇప్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. సంఘటిత, అసంఘటిత రంగ కార్మికులకు నైపుణ్య శిక్షణ ఇప్పించడంపై ప్రత్యేక చొరవ తీసుకుంటోంది. ఇదే సమయంలో వారి గౌరవాన్ని మరింత పెంచేలా లేబర్ అడ్డాలను నిర్మించడం.. వారి సంక్షేమం కోసం నిధులు కేటాయించడం.. వారి ఆరోగ్య సంరక్షణలో భాగంగా ఆస్పత్రుల నిర్మాణం వంటివి చేపట్టడం వంటి చర్యలు తీసుకుని కార్మికులకు అండగా కూటమి ప్రభుత్వం నిలుస్తోందని ఈ రెండేళ్ల పాలనలో జరిగిన పరిణామాలు బట్టి కచ్చితంగా చెప్పొచ్చు.

**లేబర్ అడ్డాలతో కార్మికులకు సరికొత్త వైభవం**

రోజువారీ ఉపాధి కోసం ఉదయాన్నే రోడ్ల పక్కన, కూడళ్లలో ఎండనక, వాననక నిలబడి ఎదురుచూసే దినసరి కూలీల కష్టాలకు పరిష్కారం చూపే దిశగా ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని ప్రధాన నగరాలైన విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, రాజమండ్రి, గుంటూరు, నెల్లూరు వంటి ప్రాంతాలతోపాటు... ఉమ్మడి జిల్లాల కేంద్రంగా లేబర్ అడ్డాల నిర్మాణాలు చేపట్టాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఆధునిక ఇంటిగ్రేటెడ్ లేబర్ అమెనిటీస్ సెంటర్స్ ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ లేబర్ అడ్డాల ద్వారా కార్మికులకు ఒకే చోట స్వచ్ఛమైన తాగునీరు, విశ్రాంతి గదులు, మరుగుదొడ్ల వంటి మౌలిక వసతులతో పాటు ఉద్యోగ సమాచారం, ప్రభుత్వ సంక్షేమ పథకాల వివరాలను అందిస్తున్నారు. పని ఉన్నప్పుడు అక్కడి నుంచి పనులకు వెళ్తారు.. పనులు లేనప్పుడు ఆ సమయాన్ని స్కిల్ అప్ గ్రేడ్ చేసుకునేలా కార్యాచరణను రూపొందిస్తున్నారు. ప్రస్తుతం వివిధ రంగాల్లోని కార్మికులకు ఉన్న అనుభవానికి టెక్నాలజీని జోడిస్తే.. వారికి మరింత మెరుగైన ఉపాధి కల్పించే ఉద్దేశ్యంతో నైపుణ్యాలు కల్పించేలా కటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. కార్మికులను కేవలం ఓటర్లుగా కాకుండా రాష్ట్ర నిర్మాణంలో వారిని కీలక భాగస్వాములను చేసేలా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటోంది.

**నిలిచిన పథకాలకు జీవం పోస్తూ...**
**శ్రామిక లోకానికి అండ నిలుస్తూ...**

రాష్ట్రంలో దాదాపు 88 లక్షల మందికి పైగా నమోదైన అసంఘటిత కార్మికులు ఉండగా, అందులో 18 లక్షలకు పైగా భవన నిర్మాణ కార్మికులు ఉన్నారు. గత ఐదేళ్ల కాలంలో డూప్లికేషన్ సాకుల పేరిట, నిధుల దారి మళ్లింపుతో నిలిచిపోయిన సంక్షేమ పథకాలను కూటమి ప్రభుత్వం పునరుద్ధరించింది. ప్రస్తుతం కార్మిక కుటుంబాలకు ధీమా కల్పిస్తూ ప్రసూతి సహాయం కింద రూ. 20 వేలు, వివాహ కానుకగా రూ. 40 వేలు అందిస్తోంది. అలాగే ప్రమాదవశాత్తు లేదా సహజ మరణం సంభవిస్తే రూ. 20 వేల సహాయం, అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం రూ. 60 వేలు అందించడంతో పాటు ఉచిత వైద్య పరీక్షలు అందిస్తోంది.

**ఫ్యాక్టరీల భద్రతకు పెద్ద పీట**

పారదర్శకత, బాధ్యత, భద్రత అనే మూడు సూత్రాలతో ఫ్యాక్టరీల శాఖను ప్రభుత్వం బలోపేతం చేసింది. ప్లాంట్లలో ప్రమాదాల నివారణకు జులై-2024 లో ప్రత్యేక భద్రతా తనిఖీలు చేపట్టి, నిబంధనలు ఉల్లంఘించిన 23 ఫ్యాక్టరీలపై కఠిన చర్యలు తీసుకుంది. కార్మికుల ప్రాణాలకు రక్షణగా సేఫ్టీ అలర్ట్, ఇన్సిడెంట్ అలర్ట్ వంటి వినూత్న కార్యక్రమాలను ప్రారంభించడమే కాకుండా, ప్రమాదకర రసాయన కర్మాగారాల పర్యవేక్షణకు కెమికల్ ఇన్స్పెక్టర్ల పోస్టుల సృష్టికి ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. జేఎన్టీయూ, ఎస్వీయూ వంటి ప్రతిష్టాత్మక యూనివర్శిటీలతో ఒప్పందాలు కుదుర్చుకుని, 360 పరిశ్రమల్లో థర్డ్ పార్టీ సేఫ్టీ ఆడిట్లు, వందలాది మాక్ డ్రిల్స్ నిర్వహించడం ద్వారా పారిశ్రామిక భద్రతలో ఏపీ దేశానికే రోల్ మోడల్గా నిలిచింది.

**ఈఎస్ఐ వైద్య సేవల్లో చారిత్రాత్మక మార్పులు**

రాష్ట్రంలోని 15 లక్షల మంది ఇన్సూర్డ్ పర్సన్స్ ఆరోగ్య రక్షణే ధ్యేయంగా భీమా వైద్య సేవల శాఖను ప్రభుత్వం పూర్తిగా ఆధునీకరించింది. అచ్యుతాపురంలో కొత్త ఈఎస్ఐ ఆసుపత్రి భవన నిర్మాణానికి శంకుస్థాపన జరగగా, తిరుపతి ఆసుపత్రి పడకల సామర్థ్యాన్ని 100కు పెంచింది. గుంటూరు, కర్నూలు, శ్రీసిటీ, నెల్లూరు ప్రాంతాలలో కొత్త ఆసుపత్రుల కోసం భూములను కేటాయించారు.

విశాఖపట్నంలో 50 సీట్లతో కూడిన ఉఖిఐఇ మెడికల్ కాలేజీ మంజూరు కావడం, అమరావతిలో 500 పడకల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, మెడికల్ కాలేజీ ఏర్పాటుకు ప్రతిపాదనలతో భవిష్యత్ వైద్య అవసరాలకు ఇప్పటి నుంచే కార్మిక శాఖ సన్నద్ధమవుతోంది. ఐదేళ్లుగా పెండింగులో ఉన్న శస్త్రచికిత్స సామగ్రి కొనుగోళ్లను రూ. 78 లక్షలతో పునరుద్ధరించి, సరికొత్త మొబైల్ యాప్ల (ఇఎప్బుజ్బాజి, ఛ-అఱజ్ప్చీఛీజిజీ) ద్వారా ఔషధాల పంపిణీలో కూటమి ప్రభుత్వం పూర్తి పారదర్శకతను తెచ్చింది. పెట్టుబడుల రాకతో పరిశ్రమలు వృద్ధి చెందడమే కాకుండా, కార్మికుల ప్రాణాలకు, ఆరోగ్యానికి ఢోకా ఉండకూడదనే ఆలోచనతో కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన సాగింది.

# రైతాంగానికి అండగా కూటమి ప్రభుత్వం

(మొదటి పేజీ తరువాయి)

అనంతపురం నీటి ఎద్దడి వరకు ప్రతి అంశంపై వ్యవసాయ, అనుబంధ శాఖల డైరెక్టర్స్ తో మంత్రి జూమ్ సమావేశం నిర్వహించి ప్రతి అంశంపై లోతైన చర్చ జరిపారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. రైతు సంక్షేమం విషయంలో కూటమి ప్రభుత్వం ఎప్పుడూ రాజీ పడదు. ప్రజా సమస్యలను పరిష్కరించడం మా లక్ష్యం. కానీ వైసీపీ నాయకులు మాత్రం సమస్యల పరిష్కారంపై కాకుండా రాజకీయ లాభాల కోసం అబద్ధాల ప్రచారం చేస్తున్నారు. రాష్ట్ర ప్రజలు వాస్తవాలను బాగా అర్థం చేసుకుంటున్నారు అని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎక్కడా యూరియా కొరత లేకుండా సరఫరా వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని అధికారులు వివరించారు. అవసరమైన నిల్వలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రైతులకు గిట్టుబాటు ధరలు అందేలా మార్కెట్ పరిస్థితులను ప్రభుత్వం నిరంతరం పరిశీలిస్తోంది. మధ్యవర్తుల దోపిడీని అరికట్టేందుకు చర్యలు కొనసాగుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్ ప్రభావం కారణంగా వచ్చిన తాత్కాలిక పరిస్థితులను అధిగమించేందుకు మత్స్యశాఖ ద్వారా ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు సమావేశంలో చర్చించారు. కొబ్బరి రైతులకు మద్దతుగా మార్కెటింగ్ అవకాశాలు పెంచడం, సహాయక చర్యలు చేపట్టడం పై ఉద్యానవన శాఖకు మంత్రి దిశానిర్దేశం చేశారు. నీటి ఎద్దడిపై ప్రభుత్వం అప్రమత్తంగా ఉందని, సాగు, తాగునీటి అవసరాల కోసం ప్రత్యామ్నాయ చర్యలు అమలు చేస్తున్నట్లు అధికారులు వివరించారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో అసాధారణ ఎండలు, వాతావరణ మార్పులు, అంతర్జాతీయ మార్కెట్ పరిస్థితులు వంటి సవాళ్ల మధ్య కూడా రైతులు, పౌల్ట్రీ, ఆక్వా, ఉద్యాన రైతులను ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం పూర్తి స్థాయిలో చర్యలు చేపడుతోందని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో 45 డిగ్రీల సెల్సియస్కు పైగా నమోదవుతున్న భీకర ఉష్ణోగ్రతల కారణంగా పౌల్ట్రీ రంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోందని, గత నాలుగు రోజులుగా నమోదైన వడగాల్పుల ప్రభావంతో రాష్ట్రంలోని సుమారు 5.5 కోట్ల కమర్షియల్ లేయర్ కోళ్లలో 2.5 శాతం నుంచి 3.5 శాతం వరకు మరణాలు సంభవించినట్లు ప్రాథమిక అంచనా అని వెల్లడించారు. ఈ అంశాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లామని, పౌల్ట్రీ రంగాన్ని ఆదుకునేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఒక్క కోడికి రూ.100 చొప్పున గరిష్టంగా 100 కోళ్ల వరకు, ఒక్క లబ్ధిదారునికి గరిష్టంగా రూ.10,000 వరకు పరిహారం అందించవచ్చని పేర్కొన్నారు. అయితే నష్టం అంచనా రూ.10,000 కంటే అధికంగా ఉన్న సందర్భాల్లో ముఖ్యమంత్రి సహాయ నిధి (ఇఖఊ) ద్వారా ప్రత్యేక సహాయం అందించే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోందని తెలిపారు. గతం ప్రభుత్వంలో 2020-21 ఖరీఫ్లో 1,98,092 మెట్రిక్ టన్నుల కొనుగోళ్లతో రూ.95.62 కోట్ల నష్టం, అదే ఏడాది రబీలో 2,98,391 మెట్రిక్ టన్నుల కొనుగోళ్లతో రూ.91.50 కోట్ల నష్టం, 2021-22 రబీలో 2,762 మెట్రిక్ టన్నుల కొనుగోళ్లతో రూ.0.19 కోట్ల నష్టం, 2022-23 రబీలో 71,064 మెట్రిక్ టన్నుల కొనుగోళ్లతో రూ.2.44 కోట్ల నష్టం సంభవించినప్పటికీ ప్రస్తుతం రైతులకు నష్టం లేకుండా సమర్థవంతమైన విధానంతో ముందుకు వెళ్తున్నామని పేర్కొన్నారు. రైతులను కాపాడేందుకు మార్క్ ఫెడ్ ద్వారా 2.04 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్నను ఙఖీ వద్ద కొనుగోలు చేయాలని నిర్ణయించి, Price Stabilization Fund (PSF) నుంచి రూ.630 కోట్ల అడ్వాన్స్ మంజూరు చేయాలని కేంద్రానికి ప్రతిపాదనలు సమర్పించామని తెలిపారు. అనంతపురం జిల్లాలో గార్లదిన్నె, సింగనమల, బుక్కరాయసముద్రం, కంబదూరు, సెట్టూరు, ఆత్మకూరు, యాడికి మండలాల్లోని సుమారు 37 వేల హెక్టార్ల బత్తాయి, నిమ్మ విస్తీర్ణంలో దాదాపు 2,260 హెక్టార్లు నీటి ఎద్దడికి గురైనట్లు వివరించారు. రెండు నెలల క్రితమే జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేశామని, డ్రిప్ ఇరిగేషన్ ఆటోమేషన్ పథకానికి హెక్టారుకు రూ.40 వేల వ్యయంపై రూ.22 వేల రాయితీ, డబుల్ లేటరల్ డ్రిప్ వ్యవస్థకు హెక్టారుకు రూ.41,850 వరకు సబ్సిడీ, 20203 మీటర్ల రైతు నీటి కుంటలకు రూ.90 వేల రాయితీతో పాటు ఫెన్సింగ్కు అదనంగా రూ.15 వేల సబ్సిడీ అందిస్తున్నామని తెలిపారు. వీడ్ మ్యాట్ వినియోగాన్ని కూడా ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో సుమారు 1.10 లక్షల ఎకరాల్లో సాగవుతున్న కొబ్బరి పంటలో గత ఏడాది జూన్ నుంచి ఆగస్టు వరకు నమోదైన భారీ వర్షాలు, అధిక తేమ, తగినంత సూర్యరశ్మి లేకపోవడం వల్ల పువ్వులు, పిందెలు రాలిపోవడంతో దిగుబడులు తగ్గాయని తెలిపారు. సాధారణంగా ఎకరాకు 1,000 నుంచి 1,200 కాయల దిగుబడి రావాల్సి ఉండగా ప్రస్తుతం కొన్ని ప్రాంతాల్లో 600 నుంచి 800 కాయలకే పరిమితమైందన్నారు. అయితే ఇది పూర్తిగా తాత్కాలిక పరిస్థితి మాత్రమేనని స్పష్టం చేశారు. ప్రస్తుతం కొత్త కొబ్బరి కురిడి వెయ్యింటికి రూ.15,000, పాతకాయ గండేరా రూ.30,000, గుటుగుటు రూ.25,000, కొత్తకాయ గండేరా రూ.28,000, కొత్తకాయ గుటుగుటు రూ.24,000, పాత ముక్కుడు కాయ రూ.15,000-16,000, కొత్త సచ్చి కాయ రూ.15,000-16,000 మధ్య ధర పలుకుతోందని, కొబ్బరి నూనె 15 కిలోల టిన్ రూ.5,000, కిలో ధర సుమారు రూ.350గా ఉందని తెలిపారు. జ్యేష్ఠ మాసం ముగిసిన వెంటనే ఉత్తరాది రాష్ట్రాల నుంచి డిమాండ్ పెరిగే అవకాశం ఉందన్నారు.

మరోవైపు రొయ్యల రైతులకు SEAI AP Region పూర్తి భరోసా ఇచ్చిందని, అంతర్జాతీయంగా ఈక్వడార్ తదితర దేశాల్లో ధరలు తగ్గినా, ఒడిశా , పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో ధరల పతనం ఉన్నప్పటికీ ఆంధ్రప్రదేశ్ రైతుల ప్రయోజనాల కోసం 100 కౌంట్ రొయ్యలకు కిలోకు రూ.230, 40 కౌంట్కు రూ.330, 30 కౌంట్కు రూ.430 ధరలను ఈ నెలాఖరు వరకు కొనసాగిస్తున్నట్లు ప్రకటించిందన్నారు. చిన్న సైజు రొయ్యలను తొందరపడి హార్వెస్ట్ చేయవద్దని, ప్రకటించిన ధరల కంటే తక్కువకు అమ్మవద్దని రైతులకు సూచించారు. ఈ జూమ్ సమావేశంలో వ్యవసాయ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ బి.రాజశేఖర్, వ్యవసాయ, మత్స్య, ఉద్యానవన, పశుసంవర్ధక, మార్కెటింగ్ శాఖల డైరెక్టర్స్ పాల్గొన్నారు.

## శ్వేత సౌధం సమీపంలో కాల్పుల కలకలం

**వాషింగ్టన్, మే 24 :** అమెరికా అధ్యక్ష భవనం శ్వేత సౌధం సమీపంలో కాల్పుల కలకలం చోటుచేసుకుంది. సీక్రెట్ సర్వీస్ చెక్పాయింట్ వద్దకు దూసుకొచ్చిన ఓ దుండగుడు బలగాలపై కాల్పులకు దిగాడు. వెంటనే అప్రమత్తమైన భద్రతా సిబ్బంది వైట్హౌస్ కాంప్లెను లాక్డౌన్ చేశారు. సీక్రెట్ సర్వీస్ అధికారులు ఎదురు కాల్పులు జరపగా నిందితుడు తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని ఆసుపత్రికి తరలించగా మృతి చెందినట్లు సీక్రెట్ సర్వీస్ అధికారులు తెలిపారు. దాదాపు 15 నుంచి 30 రౌండ్లు కాల్పులు జరిగాయని పేర్కొన్నారు. కాల్పుల సమయంలో నిందితుడికి సమీపంలో ఉన్న వ్యక్తికి గాయాలయ్యాయి. నిందితుడిపై కాల్పుల తర్వాత ఆ ప్రాంతాన్ని భద్రతాబలగాలు పూర్తిగా తనిఖీ చేశాయి. అంతా సద్దుమణగడంతో 45 నిమిషాల తర్వాత లాక్డౌన్ ఎత్తివేశారు. శ్వేతసౌధం సమీపంలో వరుస కాల్పుల శబ్దాలు విన్నట్లు జర్నలిస్టులు తెలిపారు. జర్నలిస్టులు శ్వేతసౌధం నుంచి బయటకు వెళ్లకుండా అడ్డుకున్న సీక్రెట్ సర్వీసెస్ అధికారులు వారిని ప్రెస్ బ్రీఫింగ్ రూమ్లోకి వెళ్లాలని ఆదేశించారు. కాల్పుల సమయంలో అధ్యక్షుడు ట్రంప్ శ్వేతసౌధంలోనే ఉన్నారు. దీంతో పోలీసులు, భద్రతా బలగాలు వైట్హౌస్ వద్ద భారీగా మోహరించాయి. శ్వేతసౌధం సమీపంలో 17వ స్ట్రీట్, పెన్సిల్వేనియా ఎవెన్యూ సమీపంలో ఘటన జరిగింది. కాల్పుల ఘటనను ఎఫ్బీఐ డైరెక్టర్ కాష్ పటేల్ ఎక్స్ వేదికగా వెల్లడించారు. సీక్రెట్ సర్వీసెస్ అధికారులకు ఈ ఘటనలో ఎలాంటి గాయాలు కాలేదని పేర్కొన్నారు.

## ఎబోలా గుబులు..

(మొదటి పేజీ తరువాయి)

తన సంఖ్యను పెంచుతుందని పరిశోధనలు చెబుతున్నాయి. పశ్చిమాఫ్రికా ప్రాంతంలో 2014లో 11,300 మంది ప్రాణాలు తీసింది జైర్ వేరియంట్. ఇది చరిత్రలోనే అతిపెద్ద ఎబోలా వ్యాప్తి. దీంతో పోలిస్తే బుండిబుగ్యో వేరియంట్ సోకిన వారిలో 30% మంది మాత్రమే ప్రాణాలు కోల్పోయారు. కాకపోతే దీనికి ఇప్పటి వరకు ఎటువంటి వ్యాక్సిన్, చికిత్స లేకపోవడం ఇబ్బందికరంగా మారింది.

## ఒకే కుటుంబంలోని 8మంది మృతి

**బెంగళూరు,మే 24:** కర్ణాటకలోని తత్తెహక్కలు నదిలో వేటకు దిగిన ఒకే కుటుంబానికి చెందిన 11 మంది గల్లంతయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని.. జాలర్ల సాయంతో 8మంది మృతదేహాలను వెలికితీశారు. మృతుల్లో 7మంది మహిళలు, ఒకరు పురుషుడు ఉన్నట్లు గుర్తించారు. మిగిలిన వారి ఆచూకీ కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం రాత్రి భారీ వర్షం కురిసింది. ఈ సమయంలో నదిలో ఆల్చిప్పలు విరివిగా దొరుకుతాయి. దీంతో భత్కళ తాలూకా సిరాలి గ్రామానికి చెందిన ఓ కుటుంబం (14మంది) ఉదయం 10గంటల సమయంలో ఆల్చిప్పల కోసం నదిలోకి దిగారు. అదే సమయంలో నది ప్రవాహం పెరగడంతో వారిలో ముగ్గురు కొట్టుకుపోయారు. వారిని రక్షించడానికి ప్రయత్నిస్తుండగా మిగిలిన వారు కూడా ప్రవాహంలో కొట్టుకుపోయారు. వెంటనే స్థానిక జాలర్లు నదిలోకి దిగి ముగ్గురిని రక్షించారు. అప్పటికే మిగిలిన వారు గల్లంతయ్యారు. ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

### రాష్ట్ర ఎపీఎస్ఎఫ్టీవీటీడీసీ చైర్మన్గా

# పి. భరత్ భూషణ్ ప్రమాణ స్వీకారం

(మొదటి పేజీ తరువాయి)

దుర్గేష్ ల సహకారంతో ఆంధ్ర రాష్ట్రంలో తెలుగు చలన చిత్ర రంగ అభివృద్ధికి, సినీ పరిశ్రమ విస్తరణకు తన వంతు బాధ్యతగా పూర్తి కృషి చేస్తానని సభాముఖంగా తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చలనచిత్ర, టెలివిజన్ మరియు నాటక రంగ అభివృద్ధి సంస్థ డైరెక్టర్ చిక్కాల మెహర్ రమేష్ కుమార్ మాట్లాడుతూ. కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో సినిమా పరిశ్రమ పురోగతి సాధిస్తుందన్నారు. ఒకప్పుడు తమిళనాడు, ఆ తర్వాత హైదరాబాద్కు తరలివెళ్లిన చిత్ర పరిశ్రమను, మళ్లీ ఆంధ్రప్రదేశ్లో ఒక మంచి 'ఫిలిం ఫ్రెండ్లీ' వాతావరణం కల్పించేందుకు ఈ బోర్డుని ఎంపిక చేశారని తెలిపారు. రాష్ట్రంలో సినిమా మౌలిక వసతుల అభివృద్ధి చేయడంతో పాటు, ఉపాధి అవకాశాలను మెరుగుపరచడమే తమ లక్ష్యమని చెప్పారు. ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆశీస్సులతోనే తాను ఈ బోర్డులోకి వచ్చానన్నారు.

రాష్ట్ర సినిమాటోగ్రఫీ మరియు సాంస్కృతిక వ్యవహారాలు, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.2019 నుండి 2024 వరకు రాష్ట్రంలో కళలు, సినిమా, నాటకం మరియు టీవీ రంగాలకు ఎలాంటి ప్రోత్సాహం లభించలేదని, ఈ రంగాలు పూర్తిగా నిర్లక్ష్యం చేయబడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ప్రధాని నరేంద్ర మోదీల నాయకత్వంలో రాష్ట్రంలో కళల పునరుద్ధరణకు శ్రీకారం చుట్టారని తెలిపారు.

గతంలో నిలిచిపోయిన నంది అవార్డుల ప్రకటన, నంది నాటకోత్సవాలను మళ్లీ ప్రారంభించడానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్ బలోపేతం చేసే విధంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన చైర్మన్ పి. భరత్ భూషణ్, వైస్ చైర్మన్ చిక్కాల మెహర్ రమేష్, బోర్డు డైరెక్టర్ల ఆధ్వర్యంలో తెలుగు సినీ, నాటక, టీవీ రంగాల అభివృద్ధికి సరికొత్త కార్యాచరణ రూపొందిస్తున్నట్లు పేర్కొన్నారు. అరకు వ్యాలీ, మారేడుమిల్లి, తిరుపతి, అమరావతి వంటి అద్భుతమైన లొకేషన్లు ఏపీలో ఉన్నాయని, కేవలం తెలుగు చిత్రాలే కాకుండా తమిళ్, బెంగాలీ చిత్రాలు కూడా ఇక్కడ షూటింగ్స్ జరుపుకుంటున్నాయని చెప్పారు. రాష్ట్రంలో షూటింగ్ లొకేషన్లకు కొదవలేదని, అయితే సినిమా స్టూడియోలు, డబ్బింగ్ థియేటర్లు, రికార్డింగ్ థియేటర్లు వంటి మౌలిక సదుపాయాలను నిర్మించడానికి నిర్మాతలు, సినీ పెద్దలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఒకప్పుడు సినిమా పరిశ్రమకు కీలక కేంద్రంగా ఉన్న విజయవాడకు, అలాగే ఆంధ్రప్రదేశ్ ప్రాంతానికి చలన చిత్ర రంగంలో మళ్లీ పూర్వవైభవం తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు.

ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ మాట్లాడుతూ. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చలనచిత్ర, టెలివిజన్, నాటకరంగ అభివృద్ధి సంస్థ నూతన చైర్మన్గా నియమితులైన పి. భరత్ భూషణ్, వైఎస్ చైర్మన్ గా చిక్కాల మెహర్ రమేష్, సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కేఎస్. విశ్వనాథన్, కమిటీ డైరెక్టర్లకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ 1975లో ప్రారంభమైన ఫిల్మ్ డెవలప్మెంట్ కార్పొరేషన్, రాష్ట్ర విభజన అనంతరం 2017లో నవ్యాంధ్రలో అంబికా కృష్ణ చైర్మన్షిప్లో తిరిగి ఏర్పాటైన విషయాన్ని గుర్తుచేశారు. గతంలో ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు కూడా చిత్ర పరిశ్రమకు విజయవాడ ఒక రాజధానిగా, ప్రధాన కేంద్రంగా విలసిల్లిందని, ఇప్పటికీ సినిమాల ఆదాయంలో 65% నుండి 70% వరకు ఆంధ్రప్రదేశ్ నుంచే వస్తుందని పేర్కొన్నారు.

చలనచిత్ర పరిశ్రమ అభివృద్ధి కోసం, షూటింగులకు ఎలాంటి ఆటంకాలు లేకుండా అనుమతుల నుండి పోలీస్ ప్రొటెక్షన్ వరకు అన్ని ఒకే చోట లభించేలా 'సింగిల్ విండో సిస్టమ్' ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. గతంలో ఉన్న నంది పురస్కారాలు, కందుకూరి పురస్కారాల వంటి వాటిని పునరుద్ధరించాలని, చలనచిత్ర రంగానికి మరిన్ని రాయితీలు కల్పించేలా ప్రభుత్వం ఆలోచన చేస్తుందన్నారు. పరిశ్రమను బతికించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ప్రస్తుతం థియేటర్ల యజమానులు, పంపిణీదారులు (డిస్ట్రిబ్యూటర్లు), సినీ కార్మికులు కష్టాల్లో ఉన్నారన్నారు. సినిమాను ఎలా తీయాలో ఆలోచించడం పక్కన పెట్టి, చిత్ర పరిశ్రమను ఎలా బతికించుకోవాలి అనేదానిపై దృష్టి నిలపాలన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం చిత్ర పరిశ్రమకు పూర్తి లాభదాయకంగా ఉండేలా కొత్త ప్రణాళికలతో ముందుకు వస్తున్నామన్నారు. అలాగే తెలంగాణ ప్రభుత్వం కూడా తమ వంతు సహకారాన్ని అందించి ఉభయ రాష్ట్రాలు పరిశ్రమను ఆదుకోవాలని నందమూరి బాలకృష్ణ విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చలనచిత్ర, టెలివిజన్, నాటకరంగ అభివృద్ధి సంస్థ జనరల్ మేనేజర్ ముడావత్ శ్రీనివాస్ నాయక్ వందన సమర్పణ చేస్తూ ఈ రోజు ప్రమాణ స్వీకారం చేసిన చైర్మన్, బోర్డు డైరెక్టర్లకు హృదయ పూర్వ అభినంధనలు తెలియజేశారు. కార్యక్రమానికి విచ్చేసిన అందరికీ ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో నాటక రంగ అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాల కృష్ణ, తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు, తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు, నవ్యంధ్ర ఛాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు, ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ ఛాంబర్ సభ్యులు, తెలుగు మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్, ఇంఫా ముంబాయికి చెందిన సభ్యులు, టీవీ, నాటక రంగానికి చెందిన ప్రముఖులు.

# ప్రతిపక్షానివి పసలేని ఆరోపణలు

**నెల్లూరు, మే, 24,(మనం న్యూస్)** విద్యావ్యవస్థలో రాష్ట్రాన్ని అగ్రభాగాన నిలవాలన్నది యువనేత నారా లోకేశ్ సంకల్పమని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖా మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ పేర్కొన్నారు.ఆయన ఆలోచనలకు అనుగుణంగా ప్రభుత్వ పాఠశాలల్లో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టామన్నారు.నెల్లూరు సిటీలో 15 వేల మంది నిరుపేద విద్యార్థులకు కార్పొరేట్ విద్యను ఉచితంగా అందించే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామన్నారు. నెల్లూరులోని పరమేశ్వరి నగర్లో మంత్రి నారాయణ పర్యటించారు . వక్ఫ్ బోర్డు స్థలంలో 20 కోట్ల వ్యయంతో స్విమ్మింగ్ పూల్తో కూడిన అబ్దుల్ కలాం ఇంటర్నేషనల్ స్కూల్ నిర్మాణ పనులను మంత్రి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యాశాఖ మంత్రి లోకేష్ ఆశయాలకు అనుగుణంగా విఆర్సీ తరహాలోనే మరో 14 పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో సిద్ధం చేస్తున్నామన్నారు.అవన్నీ పూర్తయితే 15 వేల మంది పేద విద్యార్థులకు ఉచితంగా నాణ్యమైన విద్య అందుతుందని తెలిపారు. డిసెంబర్ నాటికి ఎండ్ టు ఎండ్ రోడ్లు,అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు,అమృత్ పనులు పూర్తి చేసి, నగరాన్ని దుమ్ములేని నగరంగా మారుస్తామని హామీ ఇచ్చారు. గత పాలనపై తీవ్ర విమర్శలు గుప్పించారు.పరిపాలన చేతకాక వ్యవస్థలను నిర్వీర్యం చేశారనిఆరోపించారు.ప్రస్తుతం చంద్రబాబు పాలనలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక అసత్య ఆరోపణలతో పబ్బం గడుపుతోందని మండిపడ్డారు. పారదర్శకంగా జరుగుతున్న ఉపాధ్యాయుల నియామక ప్రక్రియను చూసి ప్రతిపక్షాలు అక్కసు వెళ్లగక్కుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.పేద విద్యార్థుల పట్ల మంత్రి నారాయణ చూపుతున్న ప్రత్యేక చొరవను డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ ప్రశంసించారు. సొంత నిధులు, సీఎస్ఆర్ నిధులతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారుస్తున్న తీరు అభినందనీయమన్నారు.

వక్ఫ్ బోర్డు స్థలంలో స్కూల్ నిర్మాణం దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని వారు పేర్కొన్నారు. అనంతరం మంత్రి ఇరుగాళ్లమ్మ సంఘం లోని మండలపరిషత్ పాఠశాలను పరిశీలించారు.అక్కడ నుంచి 14 వ డివిజన్ బాలాజీనగర్ చేరుకొని గ్రీనరీ,బ్యూటిఫికేషన్ పనులను పరిశీలించారు.ప్రత్యేక శ్రద్ధతో పనిచేస్తున్న స్థానిక కార్పొరేటర్ కర్తం ప్రతాపరెడ్డిని అభినందించారు. ఈ కార్యక్రమంలో కమీషనర్ నందన్, మేయర్ దేవరకొండ సుజాత అశోక్ డిప్యూటీ మేయర్ తహసీన్ ఇంతియాజ్ ,రాష్ట్ర బీసీసెల్ ఉపాధ్యక్షుడు ధర్మవరపు సుబ్బారావు, మాజీ జెడ్పిటిసి విజేతా రెడ్డి,42వ డివిజన్ ప్రెసిడెంట్ షేక్ ఖలీల్ అహ్మద్, డివిజన్ ప్రధాన కార్యదర్శి షేక్ రఫీ అహ్మద్, పార్లమెంట్ మైనారిటీ కార్యదర్శి షేక్ కాలేషా, డివిజన్ కోఆర్డినేటర్ షేక్ ఉమర్, నెల్లూరు పార్లమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఇంతియాజ్,రాష్ట్ర మైనారిటీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ నౌషాద్,రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ ఉచ్చి భువనేశ్వరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ‘లేపాక్షి’కి సాంకేతిక హంగులు

(మొదటి పేజీ తరువాయి)

హస్త కళాకారులకు కూటమి ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలుస్తోంది. హస్త కళాకారులకు గౌరవప్రదమైన జీవనం అందిస్తూనే, హస్త కళారూపాలకు విస్తృత మార్కెటింగ్ అవకాశాలు కల్పించాలని నిర్ణయించింది. ఇందుకు సాంకేతికతను సాధనంగా వినియోగిస్తోంది. లేపాక్షి షో రూమ్ ల నిర్వహణతో పాటు కళాకారుల గుర్తింపు, సృజనాత్మకతతో వారు రూపొందించే కళా రూపాలను సామాన్య ప్రజలకు సైతం సకాలంలో అందించేలా ఏఐ ఆధారిత కమాండ్ కంట్రోల్ వ్యవస్థను రూపొందించింది. ఆయా కళారూపాల విశిష్టత, సాంస్కృతి సంప్రదాయలను తెలిపేలా ఏఐ టూల్ ను వినియోగిస్తూ మరో ప్రత్యేక యాప్ ను తీసుకొచ్చింది. ప్రస్తుత పోటీ ప్రపంచంలో మారుతున్న వినియోగదారుల అభిరుచులకు ప్రాధాన్యమిస్తూ రాష్ట్రంలో హస్త కళలకు ప్రాచుర్యం కల్పించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ప్రాచీన భారతీయ సాంస్కృతి, సంప్రదాయాలను హస్త కళారూపాల్లో ప్రస్తుత తరానికి హస్త కళాకారులు అందిస్తూ వస్తున్నారు. సరైన ప్రాచుర్యం, మార్కెటింగ్ సౌకర్యం లేకపోవడంతో హస్త కళాకారుల జీవనం భారంగా గడుస్తోంది. లేపాక్షి షో రూమ్ ల నిర్వహణతో ప్రభుత్వాలు హస్త కళలకు ప్రోత్సహిస్తూ వస్తున్నాయి. అవి పూర్తిస్థాయిలో హస్త కళాకారులకు భరోసా కల్పించలేకపోతు న్నాయి. ఈ నేపథ్యంలో సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అటు కళలను ప్రోత్సాహిస్తూనే, ఇటు హస్త కళాకారులకు మెరుగైన జీవనం అందించాలని నిర్ణయించింది. దీనిలో భాగంగా ఆంధ్రప్రదేశ్ హ్యాండీ క్రాఫట్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్(ఏపీహెచ్డీసీ) ఆధ్వర్యంలో వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. ఒకవైపు నేటితరం అభిరుచులను దృష్టిలో పెట్టుకుని ఆహ్లాదకర వాతావరణం కల్పిస్తూ, లేపాక్షి షో రూమ్ లకు నూతన హంగులు కల్పిస్తోంది. మరో వైపు హస్త కళాకారులకు నూతన ఆవిష్కరణలు చేసేలా శిక్షణ అందజేస్తోంది. అదే సమయంలో హస్త కళాకారులు రూపొందించిన కళారూపాలను వినియోగదారుల చెంతకు చేర్చేలా ప్రణాళికలు రూపొందించింది.

**‘తరంగా’తో లేపాక్షి నిర్వహణ**

ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ హ్యాండీ క్రాఫట్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్(ఏపీహెచ్డీసీ) ఆధ్వర్యంలో 19 లేపాక్షి షో రూమ్ లున్నాయి. వాటిలో ఢిల్లీ, కోల్ కత్తా, హైదరాబాద్ మినహా మిగిలిన 16 షో రూమ్ లూ ఏపీలోనే ఉన్నాయి. ప్రస్తుతం ఆయా షో రూమ్ ల నిర్వహణలో జిల్లా స్థాయి అధికారుల నేతృత్వంలో సాగుతోంది. ఇకపై అన్ని షో రూమ్ ల నిర్వహణకు రాష్ట్ర స్థాయి అధికారుల పర్యవేక్షణలో జరిగేలా తరంగా పేరుతో ఏఐ ఆధారిత కమాండ్ కంట్రోల్ వ్యవస్థను రూపొందించారు. రియల్ టైమ్ లో షో రూమ్ ల నిర్వహణ, స్టాక్ వివరాలు, సిబ్బంది పనితీరు, రోజు వారీ అమ్మకాలు వంటి అంశాలను నేరుగా కమాండ్ కంట్రోల్ ద్వారా ఇకపై పర్యవేక్షించనున్నారు. ఏపీహెచ్డీసీ పరిధిలో అన్ని షో రూమ్ ల్లో హస్త కళారూపాల స్టాక్ తో పాటు వాటి అమ్మకాల తీరుతెన్నులను ఎప్పటికప్పుడు నమోదు చేస్తుంటారు. ఏయే ప్రాంతాల్లో ఏయే కళారూపాలకు డిమాండ్ ఉందో గుర్తించి, అందుకనుగుణంగా సప్లయ్ చేస్తుంటారు. ఏ షో రూమ్ ల్లో అమ్మకాలు ఎక్కువగా ఉన్నాయి... ఎక్కడ తక్కువగా ఉన్నాయో గుర్తించి అందుకు తగట్లు చర్యలు తీసుకోడానికి తరంగా కమాండ్ కంట్రోల్ వ్యవస్థ ఉపయోగపడనుంది. ముఖ్యంగా సిబ్బంది పనితీరును ఏ రోజుకారోజు తెలుసుకునే అవకాశం కలుగుతుంది.


**హస్త కళాకారులకు గౌరవ ప్రద జీవనమే లక్ష్యం : మంత్రి సవిత**

ఏపీలో ఆయా ప్రాంతాల సాంస్కృతీ సంప్రదాయాలను తెలిపే హస్త కళలకు విస్తృత ప్రాచుర్యం కల్పించాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. తద్వారా హస్త కళాకారులకు ఏడాది పాటు ఉపాధి కల్పించే అవకాశం కలుగుతుందన్నారు. ఇందుకోసం తరంగా రియల్ టైమ్ వ్యవస్థ తో పాటు కళాక్షి అనే వాట్సాప్ లింక్ ను కూడా లేపాక్షి ఎండీ విశ్వ, ఆయన బృందం రూపొందించినట్లు తెలిపారు. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ హ్యాండీ క్రాఫట్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్(ఏపీహెచ్డీసీ) పేరు మీద వెబ్ సైట్ ఉందన్నారు. నేరుగా వినియోగదారుల ఇళ్లకే వారు కోరిన కళారూపాలను అందించా లన్న ఉద్దేశంతో ఏఐ టూల్ కళాక్షి వాట్సాప్ లింక్ ను రూపొందించారన్నారు. మొత్తం అన్ని లేపాక్షి షో రూమ్ లను రాష్ట్ర స్థాయి నుంచే పర్యవేక్షించడానికి తరంగా ఏఐ ఆధారిత రియల్ టైమ్ వ్యవస్థ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. హస్త కళలకు ప్రాచుర్యం కల్పిస్తూ, హస్త కళాకారులకు గౌరవ ప్రదజీవనం అందించాలన్నది సీఎం చంద్రబాబు సంకల్పమన్నారు. సీఎం చంద్రబాబు ఆశయాన్ని తరంగా రియల్ టైమ్ వ్యవస్థతో పాటు కళాక్షి వాట్సాప్ లింక్డ్ ద్వారా నెరవేర్చే అవకాశం కలుగుతుందని మంత్రి సవిత తెలిపారు.

# ఆత్మాహుతి దాడి.. 24 మంది మృతి

(మొదటి పేజీ తరువాయి)

సమీపంలో ప్రజలు గుమిగూడవద్దని పాక్ హోం మంత్రి ఆదేశాలు జారీ చేశారు. రైల్వే స్టేషన్ సమీపంలో పేలుడు ఘటన తమ పనేనని బలోచ్ లిబరేషన్ ఆర్మీ ప్రకటించింది. క్వెట్టా కంటోన్మెంట్ నుంచి పాక్ దళాల సిబ్బందిని తీసుకువెళ్తున్న రైలును లక్ష్యంగా చేసుకున్నామని బలోచ్ ఆర్మీ ప్రతినిధి జీయాండ్ బలోచ్ వెల్లడించారు. బలోచ్ ఆర్మీలోని మహిళా షైనాజ్ బలోచ్ ఓ వీడియోలో మాట్లాడుతూ పాక్ నేతలు తమ ప్రజలను అణచివేస్తున్నారని అన్నారు. తమ సంస్కృతి, గుర్తింపు, హక్కులను కాలరాస్తున్నారని ఆరోపించారు. అణచివేతకు గురైన ప్రతి బలోచ్ బిడ్డ తన మాతృభూమి విముక్తి కోసం ప్రాణాలను సైతం త్యాగం చేయడానికి సిద్ధంగా ఉన్నాడని ఆమె పేర్కొన్నారు. జాఫర్ ఎక్స్ప్రెస్కు కొన్నేళ్లుగా ముప్పు పొంచిఉంది. బలోచ్ రెబల్స్, తెహ్రీకే తాలిబన్ పాకిస్థాన్ (టీటీపీ) గ్రూప్ ఈ రైలును పలుమార్లు లక్ష్యంగా చేసుకొన్నాయి. దీనికి చాలా వ్యూహాత్మక కారణాలున్నాయి. ఈ రైల్లో తరచూ సైనిక దళాలను క్వెట్టా నుంచి పంజాబ్కు తరలిస్తుంటారు. దీంతో మిలిటెంట్ గ్రూప్లకు ఇది హాట్ టార్గెట్. 2018, 2023లో పలుమార్లు దీనిని లక్ష్యంగా చేసుకొని దాడులు చేశారు. తాజాగా



కూడా సైనిక కుటుంబాలు ప్రయాణిస్తుండగానే దాడి చోటు చేసుకొంది. 2018లో పంజాబ్ వెళుతున్న రైలుకు అత్యంత సమీపంలో రెండు బాంబులు పేలాయి. బలోచ్ రెబల్స్ రిమోట్ కంట్రోల్ సాయంతో ఈ దాడికి పాల్పడ్డారు. నాడు ప్రమాదం నుంచి ఇది బయటపడింది. 2023 జనవరి 19న రైల్లో బాంబుపేలి 13 మంది గాయపడ్డారు. క్వెట్టాకు 150 కిలోమీటర్ల దూరంలోని బొలాన్ జిల్లాలో ఈ ఘటన జరిగింది. నెల రోజుల తర్వాత అదే రైలు క్వెట్టా నుంచి పెషావర్కు వెళుతుండగా బాంబుపేలుడు జరిగింది. దీనిలో ఒకరు మరణించారు. ఇక 2024లో క్వెట్టా రైల్వేస్టేషన్లో పేలుడు జరిగి 26మంది ప్రాణాలు కోల్పోయారు. 2025లో కూడా పాక్లోని బోలన్ జిల్లాలో హైజాక్కు గురైన జాఫర్ ఎక్స్ప్రెస్ నుంచి వందల మంది బందీలను భద్రతా దళాలు సురక్షితంగా కాపాడాయి

# ఆర్బీఐ డివిడెండ్లో రాష్ట్రాలకూ వాటా పంచండి!

**చండీగడ్, మే 24:** కేంద్ర ప్రభుత్వానికి రిజర్వ్ బ్యాంక్ ఇండియా ప్రకటించిన డివిడెండ్లో రాష్ట్రాలకు కూడా వాటా ఇవ్వాలని పంజాబ్ ఆర్థిక మంత్రి హర్పాల్ సింగ్ చీమా డిమాండ్ చేశారు. గడిచిన ఆర్థిక సంవత్సరానికి గానూ రూ.2.87 లక్షల కోట్లను డివిడెండ్ రూపంలో కేంద్ర ప్రభుత్వానికి చెల్లించనున్నట్లు ఆర్బీఐ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో చీమా స్పందించారు. అంతర్జాతీయ అనిశ్చితులు, ఆర్థిక ఒత్తిళ్లను కేంద్రంతో పాటు రాష్ట్రాలు కూడా ఎదుర్కొంటున్నాయని చీమా పేర్కొన్నారు.

అందువల్ల ఈ అదనపు లాభాలను కేవలం కేంద్రమే తన దగ్గర పెట్టుకోకుండా.. సహకార సమాఖ్య స్ఫూర్తితో రాష్ట్రాలకు కూడా పంచాలని డిమాండ్ చేశారు. కేంద్రం తన ఆర్థిక లోటును తగ్గించుకోవడానికి ఆర్బీఐ నిల్వలను విపరీతంగా వాడటం వల్ల, భవిష్యత్తులో దేశ ఆర్థిక స్థిరత్వానికి రక్షణగా నిలిచే ఆర్బీఐ ఆర్థిక బలం, స్వయంప్రతిపత్తి దెబ్బతినే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తంచేశారు. ప్రస్తుత అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా ఆర్బీఐ వద్ద తగినన్ని నిల్వలు ఉండటం దేశ ఆర్థిక భద్రతకు ఎంతో అవసరమన్నారు.

## ఎన్సీసీ విద్యార్థినులకు విస్తృత అవగాహన కార్యక్రమం



- **మహిళలపై నేరాలు, సైబర్ క్రైమ్లు, బాల్య వివాహాల నివారణపై విద్యార్థినులకు సూచనలు**

**తిరుపతి మే24 మనం న్యూస్‌:** తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు, మహిళా పోలీస్ స్టేషన్ డిఎస్పీ శ్రీలత ఆధ్వర్యంలో సీఐ తమీమ్ అహ్మద్ ,నాల్గవ అదనపు ఏజేసీజే కోర్టు తిరుపతి ఏపీపీ శ్రీమతి సుజాత శక్తి టీమ్ సభ్యులతో కలిసి తిరుపతిలోని ఎస్వీ వెటర్నరీ యూనివర్సిటీ క్యాంపస్లో నిర్వహిస్తున్న 5 ఆంధ్ర గరల్స్ బెటాలియన్ ఎన్సీసీ శిబిరంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న సుమారు 600 మంది విద్యార్థినులకు పోక్సో చట్టం, మహిళల హక్కులు, లీగల్ లిటరసీ అంశాలపై సమగ్రంగా అవగాహన కల్పించారు. ముఖ్యంగా మహిళలపై జరుగుతున్న నేరాలు, చైల్డ్ పోర్నోగ్రఫీ, బాల్య వివాహాలు, సైబర్ నేరాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సోషల్ మీడియా వినియోగంలో అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద ఘటనలు ఎదురైన వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచించారు.అదేవిధంగా విద్యార్థినులు స్పష్టమైన లక్ష్యంతో చదువులు కొనసాగించి, భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ప్రోత్సహించారు. ప్రభుత్వ ఉద్యోగాల ప్రాధాన్యత, ప్రస్తుతం మరియు భవిష్యత్తులో అందుబాటులో ఉన్న వివిధ ఉపాధి అవకాశాల గురించి వివరించి, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం చట్టాలపై అవగాహన ప్రతి మహిళకు రక్షణ కవచంగా నిలుస్తాయని తెలియజేశారు.

# చిన్నశేషుడిపై వెలసిన శ్రీ గోవిందుడి దివ్యమహిమ

## గోవింద నామస్మరణలతో మారుమోగిన తిరుపతి మాడవీధులు



**తిరుపతి మే24 మనం న్యూస్‌:** తిరుపతిలోని శ్రీ గోవిందరాజస్వామి ఆలయం బ్రహ్మోత్సవాల్లో రెండో రోజైన ఆదివారం శ్రీగోవిందరాజ స్వామివారు చిన్నశేష వాహనంపై భక్తులకు దివ్య దర్శనం ఇచ్చి అనుగ్రహించారు. ఉదయం 7 గంటల నుండి 9 గంటల వరకు జరిగిన వాహనసేవ అత్యంత వైభవంగా సాగింది. ముందుగా గజరాజులు ఠీవిగా నడుస్తుండగా, భక్తబృందాలు చెక్కభజనలు, కోలాటాలు, గోవింద నామసంకీర్తనలతో మాడవీధులను భక్తిరసమయం చేశాయి. మంగళవాయిద్యాల నడుమ స్వామివారి చిన్నశేష వాహనం దివ్యశోభను సంతరించుకుంది. అడుగడుగునా భక్తులు కర్పూరహారతులు సమర్పించి గోవిందుడిని దర్శించుకొని పరవశించారు.శ్రీవైష్ణవ సంప్రదాయంలో భగవంతుడు శేషి, జగత్తు శేషభూతంగా భావించబడుతుంది. ఈ శేషశేషి తత్వానికి ప్రతీకగా చిన్నశేష వాహనం నిలుస్తుంది. చిన్నశేష వాహనసేవను దర్శించిన భక్తులకు కుండలినీ యోగసిద్ధి ఫలం లభిస్తుందని ఆధ్యాత్మిక విశ్వాసం. అనంతరం ఉదయం 10 గంటల నుండి కల్యాణమండపంలో స్నపన తిరుమంజనం వేడుకగా నిర్వహించారు. పాలు, పెరుగు, తేనె, చందనం, వివిధ రకాల పండ్లరసాలతో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు విశేష అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం 5.30 గంటల నుండి 6 గంటల వరకు స్వామి, అమ్మవార్లకు ఊంజల్సేవ జరగనుండగా, రాత్రి 7 గంటల నుండి 9 గంటల వరకు హంస వాహనంపై స్వామివారు భక్తులకు దర్శనమివ్వనున్నారు. వాహనసేవలో శ్రీశ్రీశ్రీ పెద్ద జీయర్ స్వామి, శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్ స్వామి, ఆలయ డిప్యూటీ ఈవో శాంతి, ఏఈఓ నారాయణ చౌదరి, ఇతర అధికారులు, ప్రముఖులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



## యుపిఎస్ సి సివిల్స్ ప్రిలిమినరీ పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్

### ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహించాలని అధికారులకు సూచనలు

**తిరుపతి మే24 మనం న్యూస్:** తిరుపతి జిల్లాలో యుపిఎస్ సి సివిల్స్ ప్రిలిమినరీ పరీక్షలు-2026 సందర్భంగా తిరుపతి జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు, పరీక్ష కేంద్రాలను సందర్శించి తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ ఇంజనీరింగ్ విభాగం, శ్రీ పద్మావతి మహిళా కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. పరీక్షల నిర్వహణ విధానం, అభ్యర్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు, హాల్లో అమలు చేస్తున్న నిబంధనలను అధికారులు పరిశీలించారు. జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు, కేంద్రాల వద్ద చేపట్టిన భద్రతా ఏర్పాట్లను పరిశీలించి, పరీక్షలు ఎలాంటి అంతరాయం లేకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులకు సూచించారు. అలాగే మధ్యాహ్నం నుండి నిర్వహించనున్న రెండవ పేపర్కు సంబంధించి అభ్యర్థులు సమయానికి కేంద్రాలకు చేరుకునేలా ట్రాఫిక్ నియంత్రణ, ప్రత్యేక పోలీసు బందోబస్తు, సీసీ కెమెరా పర్యవేక్షణ తదితర ఏర్పాట్లను సమీక్షించారు. పరీక్షల నిర్వహణలో పాల్గొంటున్న అధికారులతో మాట్లాడి సమన్వయంతో విధులు నిర్వహించాలని ఆదేశించారు.

# బాలాజీ రైల్వే డివిజన్ ఏర్పాటులో ముఖ్యమంత్రి కలుగ చేసుకోవాలి

- **పాకాల లో వక్తల డిమాండ్**

**పాకాల మే24 మనం న్యూస్:** బాలాజీ రైల్వే డివిజన్ ఏర్పాటుకు రాష్ట్ర ముఖ్యమంత్రి బాలాజీ రైల్వే డివిజన్ సాధన సమితి డిమాండ్ చేశారు.ఆదివారం రైల్వే డివిజన్ సాధన సమితి సభ్యులు పాకాల రైల్వే స్టేషన్ నుండి బస్టాండ్ వరకు గొప్ప ర్యాలీని నిర్వహించారు. రైల్వే ఇన్స్టు ట్ నందు సభను ఏర్పాటు చేసి రాయలసీమ ప్రాంతానికి రైల్వేల పరంగా జరుగుతున్న అన్యాయాలను గురించి బాలాజి డివిజన్ సాధన సమితి కన్వీనర్ కుప్పాలగిరిధర్ కుమార్ మాట్లాడుతూ నాయ్యం జరగని పక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేయవలసి వస్తుందని హెచ్చరించారు.శాంతియుతంగా నాయకులను కలసి విన్నవిస్తుంటే ఏమాత్రం స్పందనరావడం లేదని, బాలాజీ రైల్వే డివిజన్ ఏర్పాటులో ముఖ్యమంత్రి కలుగ చేసుకొని కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని కోరారు బాలాజీ రైల్వే డివిజన్ ను సీఎం గారి సొంతనియోజకవర్గమైన చంద్రగిరి నియోజకవర్గంలో ఏర్పాటు చేయాలని కోరారుదక్షిణ కోస్తా రైల్వే విశాఖ జోన్ లో అయిదో డివిజన్ గా బాలాజీ రైల్వే డివిజన్ ను ఏర్పాటు చేయాలని కోరారు.లేనిపక్షంలో గుంటూరు డివిజన్ ను ఇక్కడకు తరలించాలని కోరారు. గుంటూరు విజయవాడ డివిజన్లు పక్కపక్కనే 30 కి.మీదూరంలో వున్నవి2003 లో తిరుపతి నుండి డివిజన్ గుంటూరు కి తరలి వెళ్ళింది తిరుపతి నుండి పాకాల వరకు రైల్వే హబ్ గా తీర్చిదిద్దేందుకు ఇది మంచి అవకాశమని చెప్పారు. ఎలక్ట్రిక్ లోకో షెడ్, సిబ్బంది జోనల్ ట్రైనింగు సెంటర్స్ మరియు పిట్ లైన్స్ నీ పాకాల లో ఏర్పాటు చేయాలని కోరారు.బ్రిటిష్ కాలం నుండికూడా చాల ప్రాముఖ్యత కల్గిన ప్రాంతమని గుంతకల్ తరువాత అంతటి గుర్తింపు కల్గిన స్టేషన్ అని ఇక్కడ వందల



ఎకరాలు రైల్వే భూమి ఉందని దానిని సద్వినియోగం చేసుకొనుటకు ఎన్నో అవకాశాలు ఉన్నా పట్టించుకోవడం లేదని తిరుపతి లోని పిట్ లైన్ లు ఇక్కడికి మారుస్తున్నామని చెప్పి ఇప్పుడు ఆ ఊసే ఎత్తడం లేదన్నారు.చైర్మన్ యం.వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ డి.ఆర్.మహల్ బ్రిడ్జి ఆర్.సి.రోడ్ బ్రిడ్జి గాని చెన్నయ్ వెళుతున్న గరుడాద్రి ఎక్స్ప్రెస్ రైలును ఉద్యమాలు చేసి పోరాడితే ఈ రోజు వీటినిసాదించుకొన్నామని ఈ ప్రాంతానికి డివిజన్ అవసరమని ఆంధ్రరాష్ట్ర ముఖ్యమంత్రి కి వినతిపత్రం ఇచ్చి చెప్పడం జరిగిందని తెలిపారు.కే.వి.చౌదరి మాట్లాడుతూ ఈ ప్రాంతంలో విరివిగా మామిడి, అరటి, టమోట,నిమ్మ,బొప్పాయి లాంటి వాణిజ్య పంటలను ఎగుమతులు చేసుకునేఅవకాశం ఉంటుందని వీటి ద్వార వ్యాపారులకు,రైతులకు మేలుజరుగుతుందని తెలిపారు.అధ్యక్షులు బుజ్జి బాబు నాయుడు మాట్లాడుతూ ఒకప్పుడు స్టీమ్ లోకో ఇంజిన్ లతో అతి పెద్ద షెడ్ కలిగి వేలమంది ఉద్యోగులతో వందలసంఖ్యలో రైల్వే కాలనీఇండ్లు బ్రిటిష్ కాలం నాటి పెద్ద పెద్ద బంగాళాలతో ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెంది ఉండేదని నేడు కళా విహీనంగా థట్టమైన ముళ్లపొదలతో అడవి వాతవరణాన్ని తలపిస్తున్నదని తెలిపారు.మరియు చుట్టుప్రక్కల ప్రతి గ్రామంలోను పదుల సంఖ్యలో లైల్వేలో ఉద్యోగాలు చేసిన కుటుంబాలు ఉన్నాయని, ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చెయ్యాలని అంతవరకు పోరాటం చేస్తామని చెప్పారు.ఈ కార్యక్రమంలో పుష్పరాజ్, వై యస్ బాబు, శేషగిరి రావు, రాధాకృష్ణ, నిఖిల్, అఖిల్, శ్రీహరి, అనిల్ నీలాద్రి, నీలేష్ కృష్ణమూర్తి, రాజేంద్ర నాయుడు వెంకటేష్ , దొరస్వామి నాయుడు పాల్గొన్నారు.

## ప్రత్యామ్నాయ రాజకీయ వ్యవస్థకు స్వాగతం




- **సీపీఐ నేత డాక్టర్ నారాయణ**

**తిరుపతి మే24 మనం న్యూస్‌:** దేశంలో నెలకొన్న ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ రాజకీయ వ్యవస్థ వచ్చి తీరుతుందనే విశ్వాసం తమకు ఉందని సీపీఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ నారాయణ అన్నారు. అది కాక్రోచ్ రూపంలో లేదా మరో రూపంలో వచ్చినా స్వాగతం పలుకుతున్నామన్నారు.

తిరుపతిలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పెట్టుబడిదారులు రెండు వర్గాలుగా విడిపోయి, వారికి వారే పోటీగా మారారని అన్నారు.

యువత తలుచుకుంటే ఏదైనా సాధ్యమే అని శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్ పరిణామాలు నిరూపించాయన్నారు. తాజాగా తమిళనాడు లో సైతం వ్యవస్థీకృత పార్టీలను కాదని, కొత్తవారిని ఎన్నుకున్నారని గుర్తుచేశారు. యువత ఆవేశపూరిత రాజకీయ, సాంఘిక, ప్రత్యామ్నాయ ఆలోచనలు రాజకీయ స్వరూపం తీసుకుంటుందని పేర్కొన్నారు. అలాంటి ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొనేందుకు వామపక్ష వాదులు ముఖ్యంగా సీపీఐ సిద్ధంగా ఉండాలని కోరుతున్నట్లు తెలిపారు.

మన రాష్ట్రంలో కూడా అవినీతికి, అవినీతికి మధ్యే పోటీ ఉందని, నీతికి, అవినీతికి మధ్య కాదన్నారు. ఈ పరిస్థితుల్లో రాజకీయ పరిణామాలు నివురు కప్పిన నిప్పులా ఉన్నాయన్నారు.

ఉద్యమించే వారిని తుదముట్టిస్తే ఉద్యమాలు ఆగవని గుర్తు చేశారు. వ్యవస్థ లో లోపాలను సరిదిద్దుకోవాలని అన్నారు. ప్రొఫెసర్ నాగేశ్వర్ జనసేన నేతలపై చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ కీలక రాజకీయ అంశాలపై మాట్లాడినప్పుడు ఆధారం ఏమిటో నిర్దిష్టంగా చెప్పి ఉండాల్సింది కాదన్నారు.

తర్వాత ఆయన తన వ్యాఖ్యలను ఉపసంహరించుకున్నప్ప టికీ కేసులు నమోదు చేయడం సరికాదని, ఆయన వ్యాఖ్యలను ఖండించేందుకు వివిధ ప్రత్యామ్నాయాలను ఉపయోగించుకోవచ్చునని అభిప్రాయం వ్యక్తం చేశారు. మన రాష్ట్రంలో అవినీతి పెరిగిపోయింద న్నారు. ఇటీవల గంగాధర నెల్లూరు ఎమ్మెల్యే థామస్ వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ ఇతర వర్గాల మాదిరిగా అవినీతిలో కూడా తమకు హక్కు ఉందన్నట్టు కులాన్ని వాడుకోవడం మంచిది కాదని అన్నారు. ఎవరు అవినీతికి పాల్పడినా తప్పేనని పేర్కొన్నారు.

# జనసేన పార్టీ బలలోపేతానికి కృషి చేయాలి

- **ఉయ్యాల ప్రవీణ్**

**నాయుడుపేట మే24 మనం న్యూస్‌:** తిరుపతి జిల్లా సూళ్ళూరుపేట నియోజకవర్గంలో క్షేత్రస్థాయిలో జనసేన పార్టీని బలోపేతం చేయడానికి నాయకులు కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని జనసేన పార్టీ సూళ్లూరుపేట నియోజకవర్గ ఇన్చార్జి,నాయుడుపేట ఏఎంసి చైర్మన్ ఉయ్యాల ప్రవీణ్ అన్నారు. పెళ్లకూరు మండలం రోసనూరు గ్రామంలో యువత సారథ్యంలో ఉత్సాహంగా ఏర్పాటుచేసిన జనసేన పార్టీ జెండాను ఉయ్యాల ప్రవీణ్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పదవులు,స్వార్థం కోసం కాకుండా ప్రజా సేవే పరమావధిగా రాజకీయాల్లోకి వచ్చిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆశయాలకు ఆకర్షితులై యువత రాజకీయాల వైపు అడుగులు వేస్తున్నారనడానికి ఈ కార్యక్రమం ఒక నిదర్శనం అన్నారు.ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి అహర్నిశలుశ్రమించినసుధీర్,రేవంత్,శివ తదితర రోసనూరుయువకులను ఉయ్యాల ప్రవీణ్ గారు వేదికపై నుండి పేరు పేరునా అభినందించారు. జనసేన పార్టీ ఆవిర్భవించింది కోట్లు సంపాదించుకోవడానికి లేదా కాంట్రాక్టులు చేసుకోవడానికి కాదని, ప్రజల కష్టాల్లో అండగా



నిలబడటానికేనని ప్రవీణ్ స్పష్టం చేశారు.రాజధాని లేని రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించడానికి, యువతకు ఉపాధి కల్పించడానికి,ఒకటవ తేదీనే పింఛన్లు అందించడానికి, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం లాంటి హామీలను నెరవేరుస్తూ కూటమి ప్రభుత్వం చేస్తున్న కృషిని ఆయన ప్రజలకు, మహిళలకు వివరించారు. అనంతరం సుమారు 250 మందికి పైగా గ్రామస్తులకు, అభిమానులకు యువత ఆధ్వర్యంలో భోజన సదుపాయం కల్పించారు.నిజాయితీకి మారుపేరైన జనసేనను,కూటమి ప్రభుత్వాన్ని ఆదరించాలని కోరుతూ రాబోయే తరాల భవిష్యత్తు కోసం నిలబడే ఏకైక పార్టీ జనసేన అని సగర్వంగా చాటి చెబుతూ ఈ కార్యక్రమం విజయవంతం చేసారు.ఈ కార్యక్రమంలో సీనియర్ జనసేన పార్టీ నాయకులు అట్ల కృష్ణారావు, మల్లాం విజయ్,ఆవుల రమణ, తొప్పాని బాబు,శంకు సురేష్, శశిధర్, కామిరెడ్డి కేశవులురెడ్డి,నరే భాస్కర్, సుమతిరావు, తాళ్ల రెడ్డి శ్రీనివాస్,జ్యోతిష్,కుంపటి శ్రీను, సుధీర్, మోహన్, నవీన్, రేవంత్, జమ్మల శ్రీను,నీలం మోహిత్,తాళ్ళ సురేంద్ర, బానుప్రకాష్,రొండా సోమశేఖర్, సందీప్ బూదురు నాగరాజు, తొండ సూర్య, కుప్పంపాటి వంశీకృష్ణ, వేమబోయినరాము, సాగిహరి,వినయ్, శివ, సూర్య, భూపతి రాజా,నితీష్,చరణ్, సిద్దు, శ్రీను, రామారావు, కార్తీక్, మనోజ్, హర్ష, వెంకీ, కృష్ణ, తరుణ్, మురళి,సీతారామయ్య, చెన్నయ్య, సోము, కిషోర్,ప్రభు, శ్రీనాథ్, మనోజ్, ఉదయ్, వీర మహిళలు రోహిణి,హేమలత పాల్గొన్నారు.

## వాల్మీకిపురం సిడిసిఏ – జీవీఎస్‌సిఎస్ గ్రౌండ్స్ నందు 14వ రోజు

**వాల్మీకిపురం, మే 24 (మనం న్యూస్):** వాల్మీకిపురం సి డి సి ఏ - జీ వీ ఎస్ సి ఎస్ గ్రౌండ్స్ నందు 14వ రోజు ఉదయం హైపెరియన్, ఆదిత్య బిఆర్ జట్ల మధ్య ప్రారంభం కాగా ఆదిత్య బిఆర్ జట్టు మొదట టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. మొదట బ్యాటింగ్ చేసిన జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లకు 225 పరుగులు చేసింది ఇందులో సోహన్ రెడ్డి 27 బాల్స్ లో 54 పరుగులు సాధించాడు.ఆదిత్య బిఆర్ జట్టు 226 పరుగుల టార్గెట్ తో బరిలో దిగి 6 వికెట్లు కోల్పోయి 206 పరుగులు మాత్రమే చేసి 20 పరుగులతో పరాజయం పొందింది. ఇందులో తేజ రెడ్డి 54 బాల్స్ లో 97 పరుగులు చేయగా రెడ్డి రుషీల్ 35 బాల్స్ లో 50 పరుగులు చేసి పోరాడారు.20 పరుగులు తేడాతో హైపేరియన్ జట్టు విజయం సాధించింది. ఈ మ్యాచ్ లో మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డ్, ట్రోఫీని వీసిసి జీవీఎస్సిఎస్ సీనియర్ ప్లేయర్ భరత్,సిడిసిఏ గ్రౌండ్ ఇంచార్జీ ప్రసాద్ లు ఇచ్చారు. మధ్యాహ్నం జరిగిన పాయ్ వైస్రాయ్ స్పార్టన్ వారియర్స్ జట్ల మధ్య మ్యాచ్ జరగగా ముందుగా బ్యాటింగ్ చేసిన స్పార్టన్ వారియర్స్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లు కు 211 పరుగులు చేశారు.శేషాద్రి నాయుడు 32 బాల్స్ లో 62 పరుగులు, దినేష్ వర్మ 29 బాల్స్ లో 43




పరుగులు చేశారు.పాయ్ వైస్రాయ్ బౌలర్ శశాంక్ శ్రీవాస్త 3 వికెట్లు తీశారు.తరువాత బ్యాటింగ్ చేసిన పాయ్ వైస్రాయ్ జట్టు బ్యాట్స్ మెన్ 19.2 ఓవర్ లలో 212 పరుగులు చేసి విజయం సాధించారు.జహీర్ అబ్బాస్ 48 బాల్స్ లో 112 పరుగులతో సెంచరీ చేసి మ్యాచ్ ను గెలిపించారు. ఈ మ్యాచ్ లో సెంచరీ సాధించిన జహీర్ అబ్బాస్ కు మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డ్ ను ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ప్యానెల్ అంపైర్స్ హసన్ షా వల్లీ కిరణ్ లు అందించారు.ఈ కార్యక్రమంలో ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ క్రికెట్ విజయ్ వైస్ ప్రెసిడెంట్ శ్రీధర్,సెక్రటరీ సతీష్ యాదవ్,చీఫ్ కోచ్ సునీల్ కుమార్,జీ వీఎస్సిఎస్ సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

# పరిపూర్ణుడు ఏటుకూరి ప్రసాద్



- **సీపీఐ జాతీయ నేత నారాయణ**

**తిరుపతి మే24 మనం న్యూస్:** ప్రముఖ రచయిత, అభ్యుదయ రచయితల సంఘం (అరసం) అగ్రనేత, డాక్టర్ ఏటుకూరి ప్రసాద్ సంపూర్ణ జీవితాన్ని ఆవిష్కరించిన మహావ్యక్తి అని సీపీఐ జాతీయ కంట్రోల్ మిషన్ ఛైర్మన్ డాక్టర్ కె.నారాయణ కొనియాడారు. తిరుపతి నగరం బైరాగపట్టెడలోని గంధమనేని శివయ్య, కృష్ణారెడ్డి భవన్ లో జరుగుతున్న అరసం 20వ రాష్ట్ర మహాసభల ముగింపు రోజైన ఆదివారం డాక్టర్ ఏటుకూరి ప్రసాద్కు రచయితలు, పలువురు ప్రముఖులు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ కె.నారాయణ మాట్లాడుతూ... ఏటుకూరి ప్రసాద్ మరణం సాహితీ లోకానికి తీరని లోటన్నారు. అరసం రాష్ట్ర మహాసభలు జరుగుతున్న తరుణంలోనే ఏటుకూరి తుదిశ్వాస విడవడం అత్యంత బాధాకరమని, ఇది చాలా విషాదకరమైన విషయమని పేర్కొన్నారు. అయితే, ఎంతో మంది రచయితలు, మేధావులు ఒకేచోట చేరిన సమయంలో ఆయనకు నివాళులు అర్పించే అవకాశం రావడం ఒక అదృష్టంగా భావించవచ్చన్నారు. ఏటుకూరి ప్రసాద్ చివరి శ్వాస వరకు తాను నమ్మిన సిద్ధాంతం కోసమే పని చేశారని నారాయణ గుర్తుచేశారు. మనిషిగా జన్మించాక జీవితానికి ఒక సార్థకత ఉండాలని, ఆ సార్థకతను ఏటుకూరి పూర్తిగాసాధించారన్నారు. ఆయన జీవితం పరిపూర్ణమైనదని, సమాజ శ్రేయస్సు కోసం నిత్యం పరితపించిన ఒక గొప్ప వ్యక్తి ఆయన అని శ్లాఘించారు. ఏటుకూరి జీవితం నీతి, నిజాయితీ, క్రమశిక్షణకు మారుపేరుగా నిలిచిందని నారాయణ స్పష్టం చేశారు.

**అనారోగ్యంలోనూ నిరంతర సాహిత్య సేవ: వల్లూరి శివప్రసాద్**

అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరి శివప్రసాద్ మాట్లాడుతూ... ఏటుకూరి ప్రసాద్ ఒక విజ్ఞానగని అని అభివర్ణించారు. పుస్తకాల ప్రచురణ కోసం ఆయన తన సొంత డబ్బును వెచ్చించేవారని గుర్తుచేశారు. చివరి దశలో ఆరోగ్యం సహకరించకపోయినా సాహిత్య సేవను మాత్రం ఆపలేదని చెప్పారు. అరసం సంస్థకు ఆర్థికంగా ఎంతో అండగా నిలిచారని, ఆయన మరణం అరసం సంస్థకు కోలుకోలేని దెబ్బ అని ఆవేదన వ్యక్తం చేశారు.

**ఆధునిక భారతీయుడు ఏటుకూరి: రాచపాళెం**

అరసం రాష్ట్ర అధ్యక్షులు రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ... ఏటుకూరి ప్రసాద్ నిజమైన ఆధునిక భారతీయుడు అనిపించుకున్నారని అన్నారు. సమాజంలో వేళ్లూనుకున్న డీ-క్లాసిఫికేషన్, డీ-క్యాస్టియిజం, మతతత్వం వంటి రుగ్మతలను పూర్తిగా జయించిన మహావ్యక్తి ఏటుకూరి అని ప్రశంసించారు.

**సమర్థవంతమైన సంపాదకుడు, గేయ రచయిత: పెనుగొండ**

ఈ నివాళి కార్యక్రమంలో మొదటగా అరసం జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ మాట్లాడారు. ఏటుకూరి ఎంతో గొప్ప రచయిత అని కొనియాడారు. తన జన్మభూమిపై ఉన్న మక్కువతో 'ఏటుకూరు' పేరుతో ఒక ప్రత్యేక సంకలనాన్ని తీసుకువచ్చి, ఆ ప్రాంతానికే అంకితమిచ్చిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. పూర్వం యువజన పత్రికను ఆయన ఎంతో సమర్థవంతంగా నిర్వహించారని, ఆయన ఒక గొప్ప గేయ రచయితగా, అద్భుతమైన సంకలనకర్తగా గుర్తింపు పొందారని వివరించారు. అరసం రచయిత శరత్ మాట్లాడుతూ.. ఏటుకూరి ప్రసాద్తో తనకున్న వ్యక్తిగత, సాహిత్య అనుబంధాలను భావోద్వేగంతో నెమరువేసుకున్నారు. ఈ నివాళి కార్యక్రమంలో అరసం నాయకులు సాకం నాగరాజు, యువశ్రీ మురళి, గంటా మోహన్, నెమిలేటి కిట్టన్నలతో పాటు సీపీఐ నేతలు రామానాయుడు, మురళి, ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచలయ్య, వలిపి శ్రీరాములు, పెద్ద సంఖ్యలో రచయితలు, మేధావులు పాల్గొని ఏటుకూరి ప్రసాద్కు అక్షర నివాళులు అర్పించారు.

## కేబుల్ చోరీ కేసులో నలుగురు అరెస్ట్

**నర్సీపట్నం మే 24 మనం న్యూస్‌:** నర్సీపట్నం మున్సిపాలిటీ షణ్ముఖ నగర్ లో జరిగిన 1000 మీటర్ల కేబుల్ చోరీ కేసును పోలీసులు చేదించారు. మెయిన్ సోలార్ ఆఫీసులో వెయ్యి మీటర్ల కేబుల్ వైర్ దొంగిలించారన్న ఫిర్యాదు మేరకు టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు. సిసి ఫుటేజ్ ఆధారంగా విచారణ ప్రారంభించిన పోలీసులు ముద్దాయిలను గాజువాకలో పట్టుకుని చోరీ సొత్తును రికవరీ చేశారు. ఈ కేసులో పాత నేరస్థుడు రౌతు మల్లేష్, వెంపాల సంతోష్ కుమార్, గుంటూరు కృష్ణమూర్తి, చొప్ప పవన్, చేతన నవీన్, సిన్నిబోదుల మహేష్ లపై కేసు నమోదు చేశారు. వీరిలో నవీన్ అనారోగ్య కారణంగా హాస్పటల్ కు తరలించగా, మహేష్ పరారీలో ఉన్నట్లు డిఎస్పి తెలిపారు. చోరీ కాబడిన సొత్తు మూడు లక్షల యాభై వేలు విలువ ఉంటుందని తెలిపారు. నేరస్తులను పట్టుకోవడంలో చురుకైన పాత్ర పోషించిన సిబ్బందిని ఎస్పి తుహిన్ సిన్హా ప్రత్యేకంగా అభినందించినట్లు తెలిపారు. నలుగురు ముద్దాయిలను రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరిచామన్నారు. ఈ సమావేశంలో టౌన్ సిఐ షేక్ గఫూర్, ఎస్ఐలు ఉమామహేశ్వరరావు, రమేష్ లు పాల్గొన్నారు.





## ధర్మమెరుగని కాలం!

కాలానికి
కామన్ సెన్సుండదు
జాలి దయాదులు గిట్టవు!

ఎవరితోనైనా చేతులు కలిపి
అవకాశ రాజకీయ నేతలకు
కొత్త కొత్త పాఠాలు నేర్పుతది!

మొలకలెల్లుతున్నప్పుడు
వానా కాలాన్ని వెంటేసుకుని
ముఖం చాటేస్తుంది!

చలికాలమొస్తే
గాలిని వాటేసుకుని
కనిపించని కత్తితో గాయాలు చేస్తుంది!

ఎండాకాలమా
వేడిగాడుపులు వడగండ్ల వానలు
పంటల నెత్తిపై వేలాడే కత్తి!

ధర్మమెరుగని కాలానికి
నేలరాలిన మామిడిపళ్ళ రుచి
ఒకసారి మనమే చూపాలి!!

**- కోట్ల వెంకటేశ్వర రెడ్డి**
9440233261

ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు
manamlekhalu@ gmail.com
మెయిల్ అడ్రస్‌కు పంపగలరు.


ఈ పేపర్ కోసం
https://www.manamepaper.com/
వెబ్‌సైట్‌లో చూడండి- ఎడిటర్

# నానీల కవి బుడుగు కవితలు



వృత్తిరీత్యా ఉపాధ్యాయుడు, ప్రవృత్తి రీత్యా కవి అయిన సుంకరి కృష్ణ ప్రసాద్ తాజాగా 'పొట్టి పోయమ్స్' అన్న లఘు కవిత్వం.. ముఖ్యంగా బడి పిల్లల కోసం వాళ్ల చేత కవిత్వం రాయించడం కోసం ఈ పుస్తకాన్ని ప్రచురించారు. ఇందులోని కవితలను సరళంగా నాలుగు పాదాలతో కవిత్వం ఎట్లా రాయవచ్చో ఉదాహరణ పూర్వకంగా ఈ సంపుటినే వెలువరించారు. గతంలో నా 'చిన్ని హృదయం' 'నా లోపలి తీరాలు' అన్న రెండు నాని సంపుటాలు, 'నా జీవన గీతం' పేరుతో వచ్చిన కవితల సంపుటిని తీసుకురాగా, వీరి హైకూ కవితలు ఇంకా పుస్తకంగా రావాల్సి ఉంది. ప్రభుత్వ పాఠశాల పిల్లలకు కవిత్వాన్ని పరిచయం చేస్తున్నప్పుడు వాళ్ల లోని సృజనాత్మక శక్తులకు కవిత్వ నియమాలు, పద్ధతులు కొంత అవరోధంగా ఉన్నట్లు గమనించి దానిని అధిగమింప చేసే ఉద్దేశంతో కవితా రీతులు గురించి చెప్పకుండా చిట్టి చిట్టి కవితలను వాళ్లకు తోచిన విధంగా రాసేలా ప్రోత్సహించే ఉద్దేశ్యంతో ఈ పొట్టి పోయెమ్స్ అనే భావనను వారికి పరిచయం చేశారు.ఈ పుస్తకాన్ని ఆయన ప్రభుత్వ బడి పిల్లలకే అంకితం ఇవ్వడం ముదావహం.

ఇక ఇందులోని కవిత్వాన్ని పరిశీలిస్తే కొన్ని 'పొట్టి పోయమ్స్' గట్టి పోయెమ్స్‌గా కనిపిస్తాయి. నాలుగు వాక్యాల కవితలో కూడా అనుభూతి ఆర్ద్రత ఎలా నింపవచ్చో.. వాటికి ఉదాహరణలుగా కొన్ని మీ ముందు ఉంచుతాను. 'నడిరోడ్డు మీద/ ఆకలి పేగులు /జారిపడిన విద్యార్థి లంచ్ బాక్స్/. నా ఆహ్వానాన్ని/ జీవితం మన్నించలేదు/ మరో లేఖను/ అందంగా రాస్తున్నాను/ జీవితాన్ని ఎప్పటికప్పుడు కొత్తగా ప్రారంభించవచ్చును అనే ఆశాభావం ఇందులో కనిపిస్తుంది. 'అనేక విధాలుగా/ భాగించబడ్డాను/ కానీ నేను నిశ్శేషం కాదు/ జీవితంలో ఎన్నో తరుగులు ఉన్నప్పటికీ వాటి వల్ల నిరుత్సాహ పడకుండా ఎప్పటికప్పుడు తనను తాను గుదిగుచుకుంటూ ఉంటే ఎన్నిసార్లు భాగించబడ్డా ఆ వ్యక్తి నిశ్శేషం' కాడు. వాళ్లు పేదరికం చూపమన్నారు/ నేను మా ఇంటి/ పాత గోడను చూపాను/ బయటకు కనిపించే ఇంటిని కాకుండా, లోపల చూసినప్పుడే ఆ ఇంటిలోని పేదరికం దారిద్యం కొట్టొచ్చినట్టు కనపడతాయి. అలా ఏమాత్రపు ఆచ్ఛాదన లేకుండా ఇంటి నగ్న గోడ తన బీదరికాన్ని చూపిస్తుంది, అన్న భావం చక్కగా వ్యక్తం అయింది ఈ పొట్టి పోయెమ్‌లో. పాపాయికి ఓ పువ్వును కొనిచ్చా/ బదులుగా చిన్న నవ్వును నాకిచ్చింది/ పిల్లలు పువ్వులు పూల రంగులను చాలా ఇష్టపడతారు అనే విషయం మనందరికీ తెలుసు. పాపాయి ప్రతిగా ఇచ్చే చిన్న నవ్వు వెలకట్టలేనిది. 'నేనిక నిద్రలేవాల్సిందే/ నాకోసం/ ఓ సూర్యుడు ఉన్నాడు/ రాత్రి చీకటి మనసులో ఎంత నైరాశ్యాన్ని గుప్పించినా తెల్లవారేసరికి ఉదయించే సూర్యుడు తనకోసం ఎదురు చూస్తున్నాడు' అనుకుంటే, తిరిగి కర్తవ్య నిర్వహణలో నిమగ్నం కావచ్చు. కాలం గిర్రును తిరిగింది/ కలగా/ అప్పటి ఫోటో మిగిలింది/ ఫోటో ఎంత బాధ పెడితే జ్ఞాపకాలు అంత పాతవి తిరిగి గుర్తుకొస్తాయి. ఆమె జ్ఞాపకాలతో/ తడిచిపోయా ను/ తీరా చూస్తే/ బయట అంతా వర్షం/ కురిసే వర్షం బయటనే కాదు మనసులో కూడా! ఆ వర్షాన్ని చూస్తూ ఆమె జ్ఞాపకాలతో తడిచిపోవడం, హృదయం ఉన్న మనుషులకు అనుభవమే. బడికి సెలవులు/ పెట్టలేను/ పసి మనసుల/ ప్రేమలను వదలలేను/ పిల్లలను ప్రేమించేవారు పాఠశాలను తరగతులను బోధనను విడిచి పెట్టాలంటే.. స్వల్పకాలమే అయినా, ఆ ఎడబాటు ఎంతగానో మనసుకు కష్టం కలిగిస్తుంది. నేనేదో హెచ్‌ఎం/ అనుకుంటాను గానీ/ పెత్తనమంతా/ మా బడిగంటదే!/ బడి గంట, క్రమశిక్షణకు టైం మేనేజ్మెంట్ కు పెట్టింది పేరు. అందుకే పెత్తనం అంతా బడిగంటదే అని కవి చతురోక్తి ఈ కవితలో ఉంది. సెలవు రోజున/ బడిలో గడిపాను/ తన బాధను/ తీరిగ్గా పంచుకుంది/ ఎప్పుడూ పసిపిల్లలతో కళకళలాడే పాఠశాల సెలవుల్లో తన మూగ బాధను పట్టించుకున్న వారికి అది స్పష్టంగా కనిపిస్తుంది. నేను బడిలో/ ఓ మొక్కను నాటాను/ లెక్కేసి చూస్తే/ పిల్లల సంఖ్య ఒకటి పెరిగింది/ లేత మొగ్గలాంటి పిల్లలు,ఆకులు తొడిగిన లేత మొక్కా, ఒక్కటే/ రెండింటిలోనూ తాజాదనం ఆశావాహం పచ్చదనంతో చూపరులను మురిపిస్తాయి. సూర్యుడికి ఎదురుగా/ నిలుచున్న వాడు/ నీడలను అస్సలు/ పట్టించుకోడు/.. నీడ ఎప్పుడూ వెనుకనే ఉంటుంది' అన్న సాధారణ సత్యానికి 'నీడలను పట్టించుకోవద్దు' అనే బలమైన హితబోధ కనిపిస్తుంది. చీకట్లు నన్ను/ చుట్టు ముట్టినప్పుడే/ వెలుగు జాడలు/ తెలిసి వస్తున్నాయి/ చీకటి అంటూ లేదు. వెలుతురు లేకపోవ డమే చీకటి- అనుకున్నప్పుడు చీకట్లో వెలుగు జాడలు ఎవరికైనా తప్పకుండా కనిపిస్తాయి. దేశం/ గాయపడినట్లుంది/ జెండా/ రెపరెపలాడ డం లేదు/.. ఎగిరే జెండా ఉన్నతా శయాలకు కర్తవ్య దీక్షకు మంచి స్ఫూరణ కలిగిస్తుంది.ఆ ఎగరకపో వడం గాలి లేకపోవడం వల్ల కాదు, దేశంలో జరిగే సంఘటనల వల్ల గాయపడి ముడుచుకున్నట్లు ఉంది' అని కవి భావన. అలా చూడటమే, చూడగలిగినవాడిదే కవి హృదయం. ఇలా స్పందించినప్పుడే కవి నిత్యం ఎదుగుతూ ఉంటాడు ఎగురుతూ ఉం టాడు. రాత్రి అయితే చాలు/ కలల వెంట నేను/ఉదయమైతే చాలు/ నా వెంటే కవితలన్నీ/ ప్రశాంతమైన రాత్రి వాతావరణం కవికి అత్యంత అనుకూలమైన సమయం. అలా రాయబడ్డ కవితలు ఉదయం అయినా వెంటాడుతూనే ఉంటాయి విడిచి పెట్టకుండా.. ప్రకృతి గీసిన/ తైలవర్ణ చిత్రం/ వానలో/ తడిచిన సాయంత్రం/.. వాతావరణానికి అనుకూలంగా ప్రకృతిలోని దృశ్యాలు మారుతూ ఉంటాయి. అలా వానలో తడిచిన సాయంత్రం, కవి, తన మదిలో ఒక తైలవర్ణ చిత్రం గీస్తే, అది పొట్టి పోయంగా మనకు చేరింది. ఎటు చూసినా/ విధ్వంసమే కనిపిస్తోంది/ నేనేం చేయలేక/ ఓ మొక్కను నాటాను/ పరిస్థితులు మనిషిని ఎంత వివశుడిని చేసినా చేతులకుండే శక్తితో సంకల్పంతో చిన్న పని మొదలు పెడితే, అదే వృక్ష శాఖలుగా విస్తరిస్తాయి... చెట్టు నాకొక స్వేచ్ఛా గీతం/ మనిషి ఆవిష్కరించలేని/ ఒక నూతన రాగం/.. చెట్టు ఎక్కడికి కదలకపోయినా ఆ చెట్టు ఆలపించే పచ్చని స్వేచ్ఛా గీతం చూపరుల మనసులో ఒక నూతన కదలికను, రాగాన్ని ఆలపిస్తుంది. అందుకే కవి అయిన వాడు ప్రకృతితో అనుబంధం పెంచుకుంటాడు. తాదాత్మ్యాన్ని పొందుతుంటాడు.



ఈ సంపుటిలో కొన్ని, నాన్న పైన రాసిన పద్యాలు కూడా ఉన్నాయి. నేను ఒంటరి/ ద్వీపమైనప్పుడు/ నా మనసును తాకే/ అలా నాన్న/ మనిషి ఏకాంతంలోనే తనకు ఇష్టమైన కష్టమైన జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటాడు. అలా మనసును తాకే అల నాన్న. 'నన్ను నదిని చేసి/ తను సముద్రమయిండు/ నేనెలా దారి తప్పుతా?!/ ఓ నాన్న/ తండ్రి పెంపకం పిల్లవాడికి మార్గదర్శకంగా పనిచేస్తుంది. చూపులకు అందని శిఖరం నాన్న నాన్న వ్యక్తిత్వం. ఒక ఉన్నత శిఖరంగా ఎదిగిన తర్వాతే ఎవరైనా గుర్తించగలిగి ఆశ్చర్యపడతారు, ఆనందిస్తారు.. పిల్లల పాదాలను/ హృదయం పై ఆడించుకుంది/ బడి మైదానం/.. మైదానం లేని పాఠశాల మెదడులేని తల వంటిది. అలాగే మైదానంలో పసిబిడ్డల పాదాలు తాకిడిని బడి మైదానం హృదయస్థం చేసుకుంటుంది. పచ్చని గడ్డి మీద/ మంచు ముత్యాలు/ నా రాత్రి కలలు/.. తెల్లవారేసరికి మంచు ముత్యాలు మెరుస్తూ ఎలా కనిపిస్తాయో రాత్రి కన్న కలలు కూడా అలా చమక్కుమంటూ మెరుస్తాయి. తలుపులను తెరవాలంటే/ భయమేస్తోంది/ నన్ను నేను/ ఎక్కడ కోల్పోతానోనని/.. ప్రపంచీకరణ నేపథ్యంలో మారిపోతున్న ప్రాపంచిక దృశ్యాలు సంబంధాలు అన్ని గడప దాటి బయట అడుగుపెడితే భయపెడుతుంటాయి. అయినా తన వ్యక్తిత్వాన్ని నమ్ముకున్న వాడికి భయం లేదు.. ప్రేమలు/ గాయపడొద్దనే/ పూల పక్కన/ ముళ్ళు మొలిచాయి/.. అమాయకులకు అసహాయులకు బలహీనులకు, ఒక బలమైన ఆసరా కావాలి. అప్పుడే వారు నిర్భయంగా ముందుకు పోగలుగుతారు. పూలకు ముళ్ళు రక్షణ. ఒక సాధారణమైన విషయాన్ని కవి అందమైన పొట్టి పోయంగా మలిచాడు.

ఇలా ఈ పొట్టి పోయెమ్స్ ఉసిరి కాయలంతా చిన్నవిగా కనిపించినా వాటిలోని తీపి పుల్లదనం ఆరోగ్యాన్ని ఇచ్చే సి విటమిన్ ఉన్నట్లే మనసును ఆహ్లాదపరిచే పొట్టి పోయెమ్స్ చదవడం కూడా మానసిక ఆనందాన్ని ఆరోగ్యాన్ని ఇస్తాయి.

బడి పిల్లలతో ఒక ఉపాధ్యాయుడుగానే కాక, పిల్లలను ప్రేమించే ఒక బడి ప్రేమికుడుగా తోట మాలి హృదయంతో ఉన్న సుంకర కృష్ణ ప్రసాద్ భవిష్యత్తులో మరిన్ని అందమైన కవితల్ని అలవోకగా రాసి మన ముందు ఉంచుతాడు' అన్న నమ్మకాన్ని కలిగిస్తుంది ఈ పొట్టి పోయెమ్స్ కవితా సంపుటి.

**- మల్లేశ్వర రావు ఆకుల**
7981872655

# నడిచే విజ్ఞాన సర్వస్వం 'కపిలవాయి'

కపిలవాయి లింగమూర్తి పాలమూరు జిల్లాకు చెందిన ప్రముఖ కవి, రచయిత, సాహితీ పరిశోధకుడు. పద్య రచనతో ఆయన ప్రస్థానం ఆరంభమైనా కథా రచన, విమర్శ ప్రక్రియతో వెలుగులోకి వచ్చారు. జానపద సాహిత్యం, పాలమూరు జిల్లాలోని దేవాలయాలపై విస్తృత పరిశోధనలు చేశాడు. 70కి పైగా పుస్తకాలు రచించాడు. ఈయనకు కవి కేసరి అనే బిరుదు ఉంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత తెలుగు విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేటు అందుకున్న తొలివ్యక్తి కపిలవాయి లింగమూర్తి.

ఆయన అచ్చంపేట తాలుకా, బల్మూర్ మండలం, జినుకుంటలో మాణిక్యమ్మ, వెంకటాచలం దంపతులకు మార్చి 31, 1928నజన్మించారు. ఆయనకు రెండున్నరేళ్ళ వయసులో తండ్రి మృతి చెందడంతో మేనమామ పెదలక్ష్మయ్య దగ్గర పెరిగారు. పాఠశాల విద్యను ఉర్దూ మాధ్యమంలో పూర్తి చేశారు. ఆంధ్ర సారస్వత పరిషత్ పరీక్షలు రాసి తెలుగులో విశారద ప్రమాణ పత్రాన్ని సంపాదించారు. అనంతరం ఉస్మానియా విశ్వ విద్యాలయం నుంచి ఎం.ఏ. (తెలుగు) పట్టా పొంది 1954లో నాగర్‌కర్నూల్ జాతీయోద్యమ పాఠశాలలో తెలుగు పండితునిగా చేరారు. ఆ తర్వాత 1972 లో పాలెం శ్రీవేంకటేశ్వర ప్రాచ్య డిగ్రీ కళాశాలలో ఉపన్యాసకుడుగా చేరి దశాబ్దం పాటు సేవలందించి 1983లో ఉద్యోగ విరమణ పొందారు. లింగమూర్తి నడిచే విజ్ఞాన సర్వస్వంగా పేరుపొందారు. పలుగ్రంథాలు, పరిశోధనలు రచించి సాహితీవేత్తగా పేరు పొందాడు. కపిలవాయికి తెలుగు విశ్వవిద్యాలయం 26.8.2014న గౌరవ డాక్టరేట్‌ను ప్రకటించి...30.08.2014 రోజున విశ్వవిద్యాలయం 13వ స్నాతకోత్సవంలో చాన్సలర్, రాష్ట్ర గవర్నర్ నరసింహన్ చేతుల మీదుగా గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. కపిలవాయి అనేక స్థలచరిత్రలు, దేవాలయాల కథలకు ఆయన



ప్రాణం పోశారు. మొత్తం 70 రచనలు ముద్రితమయ్యాయి. కపిలవాయి లింగమూర్తి కావ్యాలు, గీతాలు, శతకాలు, వచన సాహిత్యం,బాల సాహిత్యం మొదలగు వివిధ సాహిత్య ప్రక్రియలలో రచనలు చేశారు.

కపిలవాయి రచనలపై పలువురు విద్యార్థులు పరిశోధనలు చేస్తున్నారు. 1992లో కవితా కళానిధి, పరిశోధనా పంచానన, 1996లో కవికేసరి, 2005లో వేదాంత విశారద,2010లో గురు శిరోమణి, 2012లో సాహిత్య స్వర్ణ సౌరభ కేసరి, సాహితీ విరాణ్మూర్తి తదితర బిరుదులు, సత్కారాలు పొందారు.

కపిలవాయి లింగమూర్తికి సాహిత్య రంగంలో చేసిన విశేషకృషికి గుర్తింపుగా రాష్ట్ర స్థాయిలో అనేక సందర్భాలలో సన్మానాలు జరిగాయి. 1983లో అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు, తరువాత చంద్రబాబు నాయుడు, వై.యస్. రాజశేఖరరెడ్డి, తెలంగాణ రాష్ట్ర సమితి దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు ఆయనను సన్మానించారు. నలుగురు ముఖ్యమంత్రులచే సన్మానింపబడిన ఏకైక తెలుగు కవి, పరిశోధకులు కపిలవాయి లింగమూర్తి. ఇంకా తెలుగు విశ్వ విద్యాలయ ప్రతిభా పురస్కారం, బూర్గుల రామకృష్ణా రావు ప్రతిభా పురస్కారం, బ్రౌన్ సాహిత్య పురస్కారం, నోరి నరసింహ శాస్త్రి పురస్కారం, కందుకూరి రుద్రకవి పురస్కారం, పులికంటి సాహితీ పురస్కారం, బి.ఎన్.శాస్త్రి స్మారక పురస్కారం మొదలైన ఎన్నో సత్కారాలను పొందారు.

వెన్నెల సాహిత్య అకాడమీ కపిలవాయి లింగమూర్తి జీవితం, సాహిత్య సృజన, పరిశోధనలపై కవితా కళానిధి కపిలవాయి లింగమూర్తి పేరుతో ఓ డాక్యుమెంటరీని రూపొందించింది. దీనికి 2011లో అప్పటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉత్తమ రెండో డాక్యుమెంటరీ చిత్రంగా నంది అవార్డును ప్రకటించింది.

**- రామ కిష్టయ్య సంగన భట్ల**
9440595494

# సాహితీవేత్తలకు మార్గదర్శకుడు బంకించంద్రుడు

బంకిం చంద్ర చటోపాధ్యాయ పేరు తెలియని భారతీయుడు ఉండడు అంటే అతిశయోక్తి కాదు. వందేమాతరం గీత రచయితగా ఆయన యావత్భారతానికి సుపరిచితులే. ఆయన రచయిత, కవి, పాత్రికేయుడు. ఆయన వందే మాతరం మొదట సంస్కృత స్తోత్రంలో భారత దేశాన్ని మాతృ దేవతగా వ్యక్తీకరించారు. ఆ గీతం ద్వారా భారత స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో కార్య కర్తలను ప్రేరేపించారు.

బంగ్లాభాషలోని అగ్ర రచయితల్లో ఒకరుగా భావించే బంకిం చంద్ర చటోపాధ్యాయ తన రచనలతో కేవలం బంగాలీ సమాజాన్నే కాదు, మొత్తం దేశాన్నే ప్రభావితం చేశారు. ఆధునిక భారతీయ సాహిత్య చరిత్రలో బంకించంద్ర చటర్జీ అగ్రగణ్యులలో ఒకరు. ఒక్క బెంగాలీ సాహిత్యాన్నే కాక సమస్త భారతీయ సాహిత్యాలను ఆయన 19వ శతాబ్ది ఉత్తరార్ధంలో, ఇరవయ్యో పూర్వార్ధంలో అంటే సుమారు ఒక శతాబ్దం పాటు ప్రభావితం చేసారు. ప్రపంచ సాహిత్య చరిత్రలో జాతుల విముక్తి పోరాటాలలో, స్వాతంత్ర్య సమర చరిత్రలో ఒక మహా కవి రచించిన దేశభక్తి గీతం తన జాతి జనులను ఉత్తేజపరిచి, ఉద్యమింప చేసిన సంఘటన, బంకించంద్రుడి విషయంలోలాగ మరొక దేశంలో, మరొక దేశ చరిత్రలో చోటు చేసు కోలేదనేది వాస్తవం. బంకిం చంద్ర చేత ప్రచురితమైన ఆయన తొలి రచన బంగ్లా కాదని, ఆంగ్లమని చాలా తక్కువ మందికి మాత్రమే తెలుసు. దాని పేరు రాజ్‌మోహన్స్ వైఫ్. ఆయన మొదటి బంగాలీ రచన దుర్గేష్ నందిని. ఆయన ఆంగ్లేయుల పాలనకు వ్యతిరేకంగా భారత దేశంలో ప్రథమ స్వతంత్ర సంగ్రామం జరిగిన 1857లోనే బీఏ ఉత్తీర్ణులు అయ్యారు. బెంగాల్లో మొదటగా బి.ఏ డిగ్రీ పొందిన వ్యక్తి ఈయనే కావడం విశేషం. 1869లో ఆయన లా డిగ్రీ అందుకున్నారు.



స్వస్థాన వేష భాషల పట్ల గౌరవాభిమానాలు కలవాడు. ఇరవై ఏళ్ళు నిండకముందే 'లలిత ఓ మానస్' అనే కవితా సంపుటి రచించాడు. దుర్గేశ్ నందిని, కపాల కుండల, మృణాళిని, దేవీ చౌధురాణి మున్నగు15 నవలలు ఆయన రాశారు.

బంకించంద్ర ఛటర్జీ (27 జూన్, 1838 - 8 ఏప్రిల్, 1894) రచన వందేమాతరం గీతాన్ని ఆనంద్ మఠ్ అనే నవల నుండి సంగ్రహించారు. ఈ గీతం భారత స్వతంత్ర సంగ్రామంలో సమర శంఖంగా పనిచేసింది. దేశమంతటా ప్రతిధ్వనించిన నినాద మయింది.

దేశాన్ని మాతృమూర్తిగా సంబో ధిస్తూ, దేశభక్తిని ప్రబోధిస్తూ, 'వందేమాతరం' గీత రచన చేసిన తర్వాత దానిని 'ఆనంద్మఠ్'నవలలో పొందుపరిచారు. ఈ నవల వివిధ భారతీయ భాషలలోనికి అనువదించ బడడం వలన వందేమాతరం గేయం దేశవ్యాప్తంగా ప్రచారాన్ని పొందింది. ఈ గేయాన్ని బహిరంగంగా గానం చేయటాన్ని నాటి ప్రభుత్వం నిషేధించింది. రవీంద్రుడు బాణీకట్టి నిషేధాజ్ఞలను ఉల్లంఘించి 1896 కాంగ్రెస్ సభలలో గానం చేశాడని చెపుతారు.

భారతదేశస్వాతంత్ర్య ఆకాంక్ష ప్రజల్లో చైతన్యవంత మవుతున్నప్పుడు వందేమాతరం గీతం ఆ చైతన్యాన్ని వేగవంతం చేసింది. సమరోత్సాహాన్ని త్వరితం చేసింది. ఆయన సాహిత్య ప్రతిభ బహుముఖమైనది. నవలలు, వ్యాసరచన, సాహిత్య విమర్శ, వ్యాఖ్యాన రచనలో బంకించంద్ర చటర్జీ వంగ సాహిత్యంలో కొత్త వరవడి సృష్టించారు. నవలా రచనలో తక్కిన ఆధునిక భారతీయ సాహిత్యాలకు కూడా ఆయనే దారి చూపారు. అంతరాంతరాలలో ఆయనకు పూర్వ భారతీయ సంస్కృతి పట్ల, హిందూ మతాచార విశ్వాసాల పట్ల అభిమానం ఉండేదని సాహిత్యవేత్తల అభిప్రాయం.

మానవుడు చేరుకోగల ఉదాత్త శిఖరాలను బంకించంద్రుడి పాత్రలు అధిరోహిస్తాయి. అనూహ్యమైన, మానవాతీతమైన త్యాగాన్ని ఆయన పాత్రలు ప్రకటిస్తాయి. బంకించంద్రుడిలో మాతృ దేశాభిమానం, దేశ భక్తి అనంతం, అపూర్వం. ఆనంద మఠంలో ఆయన చిత్రించిన పాత్రలు ఎటువంటి త్యాగానికైన, సాహసానికైన ప్రతీకలుగా ఉన్నాయి. ఆయన చారిత్రిక పాత్రలను, పూర్వ చారిత్రిక వైభవ సన్నివేశాలను, సౌందర్య భావకతను, ఆలంబనం చేసుకొని రచనలు సాగించాడు అని కొందరు సాహితీవేత్తల భావన. ఆయన సృష్టించిన స్త్రీ పాత్రలు సాహసం, నిర్భీకత, ప్రణయోద్వేగం, మానవానుభూతుల మధ్య అవి జీవిస్తాయి. అటువంటి స్త్రీ పాత్రలు పురుషులకు ఏమాత్రం తీసిపోరు అని వంగ సాహిత్య విశ్లేషకులు, విమర్శకులు, బంకించంద్ర ఛటోపాధ్యాయను ప్రసంసించారు.

**- ఆర్‌కేఎస్**
9440595494

# జ్ఞానపీఠ అభ్యుదయ నవలకారుల త్రయం



ఖుర్రత్-ఉల్-ఐన్ హైదర్ ఉర్దూలో గొప్ప నవల 'అగ్ని నది' ('ఆగ్ కా దరియా') రాసిన ఖుర్రత్-ఉల్-ఐన్‌హైదర్ ఉర్దూ కాల్పనిక రచయితలలో అత్యంత ప్రసిద్ధి చెందినది. జనవరి 20,1927న ఉత్తరప్రదేశ్ లోని ఆలీగర్‌లో జన్మించిన ఆమెకు ప్రసిద్ధ ఇరానియన్ రచయిత 'ఖుర్రత్-ఉల్-అలిన్ తహీరా' పేరును పెట్టారు. ఖుర్రత్ ఐన్ అంటే సాహిత్యం పరంగా 'కళ్ళ ఓదార్పు'అని అర్థం. ఈ పదాన్ని 'ప్రియము' అనే పదానికి పర్యాయపదం కూడా. ఉర్దూ సాహితీ ప్రపంచంలో నవలా సాహిత్యం ఇంకా కాలుపెట్టని దశలో ఆమె నవలలు రాయడం ప్రారంభించింది. ఆమె ఉర్దూ సాహిత్యానికి 'గ్రాండే డేమ్'గా విస్తృతంగా భావించ బడుతుంది.

ఆమె తన కుటుంబ సభ్యులతో 1947లో పాకిస్థాన్‌కు వలస పోయింది. కానీ కొన్ని సంవత్సరాల తరువాత ఆమె మళ్లీ భారతదేశానికి రావాలని నిశ్చయించుకుంది. కొంతకాలం ఇంగ్లాండ్‌లో నివసించిన ఆమె జర్నలిస్టుగా కూడా పనిచేశారు. దాదాపు ముప్పై దాకా లఘు కథలను, సాహిత్య అనువాదాలు, నవలలను ప్రచురించింది. ఆమె1964-68 మధ్యకాలంలో బొంబాయికి చెందిన ఇంప్రింట్ పత్రికకు మేనేజింగ్ ఎడిటరుగా పనిచేసింది. 1968-75లో ఆమె ఇల్లస్ట్రేటెడ్ వీక్లీ ఆఫ్ ఇండియా పత్రికకు సంపాదక వర్గంలో సభ్యురాలిగా పనిచేసింది. తన 11వ యేట నుండి రచనా వ్యాసంగం ప్రారంభించిన ఆమె సాహితీ యానంలో 12 నవలలు నాలుగు కథా సంపుటిలను రాసింది. ఆమె రచనలు ఆంగ్లం, ఇతర భాషలలోనికి అనువాదం చేయబడ్డాయి.

అగ్నినది(ఆగ్ కాదరియా) ఆమె రాసిన గొప్ప నవల. అది భారత దేశ చరిత్రకు సంబంధించిన అంశాలతో రాసిన నవల. ఈ నవలలో భారతదేశం, పాకిస్థాన్‌లలో క్రీ.పూ.4వ శతాబ్దం నుండి భారత స్వాతంత్ర్యం దాకా అనేక కీలకమైన అంశాలను వివరంగా పొందుపరిచింది. ఆగ్‌కాదర్యా అనివార్యంగా పాకిస్తానీయుల విశ్వా సాల దృష్టికోణం నుండి రాసిన నవల. పాకిస్థానీయుల వేదనలను చిత్రీకరిస్తుంది.

ఆమె ఇతర రచనలలో 1949లోమేరే భీసనం ఖానే, 1952లో సఫిన-ఎ-గ్రామ్-ఎ-దిల్ 1965లో పత్థర్ కీ ఆవాజ్, 1982లో రాష్ణీకీ ఫతర్, 1965లో లఘు కథా నవల 'చాయేకె బాగ్', సీతా హరణ్, అగ్లే జనం మోహె బితియే నా కిజో, 1857లో గర్దిష్ ఎ రంగ్ ఎ చమన్ ( గౌరవ కుటుంబాలకు చెంచిన మహిళల విషాదానికి సంబంధించిన డాక్యుమెంటరీ నవల), 'ఆఖిర్ ఎ షాబ్ కె హమ్సఫర్' (బెంగాల్ అశాంతి, నక్సలైట్ ఉద్యమంపై నవల), 'చాందిని బేగం' మొదలైనవి ఉన్నాయి. ఆమె తన 19వ యేట రాసిన మొదటి నవల 'మ్రయాజ్ భీ సనమ్ ఖానే'. 1967లో ఆమె రాసిన కథా సంకలనం 'పత్థర్ కీ ఆవాజ్' (రాలిపోతున్న ఆకులశబ్దం)కు సాహిత్య అకాడమీ పురస్కారం వచ్చింది. 1989లో 'ఆఖిర్-ఎ-షాబ్ కె హమ్సఫర్' నవలా రచనకు ఆమె జ్ఞానపీఠ పురస్కారం పొందింది. 1985లో గాలిబ్ పురస్కారం అందుకున్నది. 2000 లో బహదూర్ షా జాఫర్ పురస్కారం లభించింది. భారత ప్రభుత్వంచే 1984లో పద్మశ్రీ పురస్కారం..2005లో పద్మభూషణ్ పురస్కారం అందుకున్నది.

కృష్ణ సోబ్తి హిందీ రచయిత్రి. భారతీయ సమాజంలో మార్పులకు లోనవుతున్న స్త్రీ పురుష సంబంధాలు, దిగజారుతున్న మానవీయ విలువలు మరెన్నో అంశాలు ఆమె రచనలలో ఇతివృత్తాలు. హిందీ,ఉర్దూ, పంజాబీ మిళిత సంస్కృతి ఆమె రచనల్లో, భాషలో కనిపిస్తుంది. వినూత్న పద్ధతులు, మార్గాలతో తన రచనలను రూపొందించిన సోబ్తి హిందీ సాహిత్యాన్ని సుసంపన్నం చేశాయని 2017 జ్ఞానపీఠ పురస్కార కమిటీ అధ్యక్షుడు,ప్రముఖ సాహిత్యవేత్త,రచయిత, పరిశోధకుడు,విమర్శకుడు నామ్ వార్ సింగ్ అన్నారు.

ఫిబ్రవరి 18,1925న పంజాబ్ ప్రావిన్స్, బ్రిటిష్ ఇండియా గుజరాత్‌లో జన్మించింది.దేశ విభజన అనంతరం ఢిల్లీకి వచ్చింది. ఉన్నత విద్యను లాహోర్ లో పూర్తిచేసింది. కృష్ణ సోబ్తి మొదట్లో ఈమె చిన్న కథలు రాసేది. అవి లామా, నఫీసా 1994లో ప్రచురితమయ్యాయి. అదే సంవత్సరంలో భారతదేశ విభజన అంశాల గురించి 'సిక్కా బాదల్ గయా'లో వివరించారు. ఆమె రాసిన ఈమె మొదటి కథ 'దాదీ అమ్మా' కానీ 'ఔర్ సిక్కా బదల్ గయా'నే తన మొదటి కథగా ఆమె చెప్పేవారు. 1979లో తనతొలి రచన 'జిందగీనామా'కు పొడిగింపుగా 'ఇంక్విలాబ్ జిందాబాద్' పేరిట ఇంకా చిన్న నవల రాసి ఈ రెండు కలిపి 'జిందారుఖ్'నవలగా ప్రకటించారు. ఈ నవలకు తన 92వ ఏట 2017లో జ్ఞానపీఠ్ అవార్డు వచ్చింది. 1966లో ఈమె రచించిన మిత్రో మరంజని నవల



వివాహిత స్త్రీలపై జరుగుతున్న లైంగికత అసమానతలపై వచ్చింది. ఆమె రచించిన బాదలోంకే ఘెరే, మిత్రో మార్జని, అలీ లడ్కీ, గుజరాత్ పాకిస్తాన్ సే గుజరాత్ హిందుస్తాన్, దార్ సే బిచేడీ వంటి రచనలు ప్రజాదరణ పొందాయి. హిందీ సాహితీ దిగ్గజాలు అయినటువంటి నామ్వర్సింగ్, శ్రీకాంత్‌వర్మ, నిర్మల్‌వర్మ, భీష్మసహాని ల యొక్క జీవిత విశేషాలను వ్యాసాలుగా రచించారు.

2010లో కేంద్రం ప్రకటించిన ప్రతిష్ఠాత్మక పద్మభూషణ్ పురస్కారాన్ని తిరస్కరించారు. కృష్ణ సోబ్తి హిందీ, ఉర్దూ, పంజాబీ బాషాసంస్కృతులని మేళవించి ఆమె రచించిన 'జిందారుఖ్' నవలకు సాహిత్య అకాడమీ పురస్కారం 1980లో పొందింది. 1996లో సాహిత్య అకాడెమీ ఫెలోషిప్ పురస్కారం,2017లో జ్ఞానపీఠ్ అవార్డుఅందుకున్నారు.1981లో శిరోమణి పురస్కారం 1982లోహిందీ అకాడమీ పురస్కారం అందుకున్నారు. 2010లో కేంద్రం ప్రకటించిన పద్మభూషణ్ పురస్కారాన్ని తిరస్కరించారు.

గోపీనాథ్ మొహంతి ప్రసిద్ధ ఒరిస్సా రచయిత. గోపీనాథ్ కుటుంబం రచయితల కుటుంబం. ఆయన పెద్ద అన్నయ్య కహాను చరణ్ మొహంతి, మేనల్లుడు గురుప్రసాద్ మొహంతీ కూడా ఒరియా సాహిత్యంలో విశేష కృషి చేశారు. 1938లో ఒరిస్సా అడ్మినిస్ట్రేటివ్ సర్వీసుకు ఎంపిక అయ్యాడు. ఇతని మొదటి నియామకం జాజూపూర్‌లో జరిగింది. ఆ సమయంలో ఆ ప్రాంతంలో పెద్ద వరద వచ్చింది. ప్రభుత్వోద్యోగిగా వరద సహాయ కార్యక్రమాలు చేపట్టే అనుభవంతో 'మాటీ మటాల్' రచించాడు. 1940లో ఒరిస్సా దక్షిణ ప్రాంతంలోని గిరిజన ప్రాంతానికి బదిలీ అయ్యాడు. ఈ బదిలీ ఒరియా సాహిత్యానికే కాక భారతీయ సాహిత్యానికే ఒక వరంగా మారిందని పలువురు భావిస్తారు. ఆదివాసులలో పరజా, కంధ్, గదబా, కోల్హ్, డంబ్ మొదలైన జాతుల ప్రజలతో ఇతడు మమైకమై పోయాడు. తన ఉద్యోగ కాలంలో ఆదివాసులతో ఇతడు ఎంతగా కలిసిపోయాడంటే కోరాపుట్ జిల్లాలోని జమీందారులు, వడ్డీ వ్యాపారులు 1953లో అప్పటి ప్రధానమంత్రికి ఇతనికి విరుద్ధంగా ఒక నివేదిక కూడా పంపారు. గోపీనాథ్ సాహిత్య జీవితం 1936 నుండే రాయడంతో మొదలయింది. 1930-38 మధ్యకాలాన్ని రచయితగా ఆయనకు అధ్యయన,అభ్యాస నిర్మాణకాలంగా ఉన్నది. ఆ కాలంలో మార్క్స్, రష్యావిప్లవం, ఫ్రాయిడ్ ప్రభావం,గాంధీజీ జాతీయోద్యమ ప్రభావం ఆయనను ప్రభావితం చేశాయి. ఇతని సాహిత్యంలో ప్రధానంగా మూడు ముఖాలుగా చూడవచ్చు. అందులో మొదటిది ఆదివాసులకు సంబంధించిన రచనలు, నగరవాసులకు సంబంధించిన రచనలు, 'మాటీ మటాల్' నవల. ఆయనకు ముఖ్యంగా ఈ మూడు రచనల వల్ల గొప్ప ఖ్యాతి లభించింది. ఆయన 1955లో 'అమృతర సంతాన' నవలకు మొదటి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డును గెలుచుకున్నారు. ఆయన రచించిన 'మతి మాతల' (సారవంతమైన నేల)ఇతిహాసానికి 1973లో జ్ఞానపీఠ అవార్డును పొందారు. 1981లో, సాహిత్యానికి ఆయన చేసిన విశిష్ట సేవకు గుర్తింపుగా భారత ప్రభుత్వం ఆయకు పద్మభూషణ్ ప్రదానంచేశారు. గోర్కీ రచన ఒడియా అనువాదానికి 1970లో సోవియట్ ల్యాండ్ నెహ్రూ అవార్డు అందుకున్నారు.

**- డా.టి. రాధాకృష్ణమాచార్యులు**
9849305871

# ఉపాధి పథకానికి ...పందికొక్కుల బెడద...!??

- ప్రభుత్వ ఎత్తులకు.. చిత్తు చేస్తున్న సిబ్బంది!!???
- వారానికి సుమారు ఐదు నుండి నెలకు 20 లక్షల అక్రమ వసూళ్లు...!!???
- నష్టపోతున్న వేతన దారులు... లబ్ధి పొందుతున్న ఉద్యోగులు!???
- మెట్లే వసూళ్ల ఏజెంట్లు!??
- వార్తలు రాసే విలేకరులకు బెదిరింపులు.!??
- కొంతమంది రైతులకు ఫోన్లు చేస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్న అధికారులు!??
- నిన్నటి తరువాయి..



**అనకాపల్లి/ చీడికాడ మే 24 మనం న్యూస్ :** వలస కూలీల కడుపు నింపేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేకంగా రూపొందించిన ఉపాధి హామీ పథకం లక్ష్యం అమోఘం అయినప్పటికీ క్షేత్రస్థాయి సిబ్బంది స్వార్థంతో లక్ష్యం నీరు గారుతుంది అనడానికి నిదర్శనాలు ఎన్నో. గతంలో రైతులు గాదెలు నిర్మించి ధాన్యం నిల్వలు పెట్టుకునేవారు. గాది కింద పందికొక్కు దూరితే దాన్యం మొత్తం అయిపోయినా సరే కనిపించేది కాదు. అలానే ఉపాధి పథకానికి క్షేత్రస్థాయి సిబ్బంది స్వార్థం తో పందికొక్కుల్లా మారి ఉపాధి నిధులను అక్రమంగా దోచుకుంటున్నారు అనే ఆరోపణలు అధికంగా వినిపిస్తున్నాయి. ఉపాధి పథకం నిర్వహణలో అక్రమాలు జరుగుతుండడంతో ప్రభుత్వం ప్రతి ఏడాది ప్రత్యేక చర్యలు తీసుకుంటూ కొత్త కొత్త నిబంధనలను అమలు చేస్తోంది. ఈసారి వేతన దారులు పనులకు వెళ్లిన వెంటనే ముఖ హాజరు తీయాలని, పని ముగించిన అనంతరం మరలా ముఖ హాజరు వేయాలని నిబంధనలను అమలు చేస్తూ కఠిన తరం చేశారు. అయితే దీన్ని తెలుసుకున్నవారు అక్రమాలు జరగవని భావిస్తున్నారు. కానీ అక్రమాలకు అలవాటు పడ్డ సిబ్బంది ప్రభుత్వ ఎత్తులకు పై ఎత్తులు వేస్తూ అక్రమ వసూలు ఆపకుండా నిర్విరామంగా జరుపుతున్నారనే ఆరోపణలు సైతం లేకపోలేదు. అనకాపల్లి జిల్లా మాడుగుల నియోజకవర్గంలోని కే కోటపాడు లో వేతన దారుల నుండి వసూలు చేయడం పురుడు పోసుకుంది. అక్కడినుండి ఏడాదికి ఏడాది పక్కపక్క మండలాలకు విస్తరిస్తూ దేవరాపల్లి మండలం అనంతరం చీడికాడ మండలానికి ప్రస్తుతానికి చేరింది. గ్రామాల్లో ఉన్న చోటామోటా నేతలు వేరువేరు పనులు చేసేవారు ఉదయం వచ్చి ముఖ హాజరు ఇచ్చి వెళ్లిపోయి మరల పనులు ముగించినప్పుడు ముఖ హాజరుకు హాజరవుతుంటారు. పనులు చేయకపోయినా వారికి వేతనం పడేలా, అది ప్రభుత్వం ఆదేశించిన 300 పూర్తిగా వేతన దారులకు చేరేలా చూసేందుకు సిబ్బంది జిమ్మిక్కులు చేస్తూ వేతన దారులకు వేతనం అందేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకుగాను ఒక్కొక్క వేతన దారుడు నుండి వారానికి 100 రూపాయలు వసూలు చేస్తున్నారని ఆరోపణలు బహిరంగంగా వినిపిస్తున్నాయి. ఎవరైనా 100 ఇవ్వకపోతే వారికి నిబంధనలు కఠిన తరం చేసి పూర్తి వేతనం అందకుండా చూస్తున్నారని, ఆరు రోజులు పనిచేస్తే నాలుగు రోజులు మస్టర్లు వేస్తున్నారని వేతనదారులే బహిరంగంగా గుసగుసలు వాడుతున్నారు. ఇలా మండలంలో పనిచేస్తున్న కూలీల నుండి వసూలు చేసింది సుమారు వారానికి ఐదు లక్షల నుండి 10 లక్షల వరకు, నెలకు 10 నుండి 30 లక్షల వరకు అక్రమంగా వసూలు చేసి జేబులు నింపుకుంటున్నారని ఆరోపణలు లేకపోలేదు. చీడికాడ మండలంలోని 23 పంచాయతీల్లో ప్రస్తుతం సుమారు 10 ,15 పంచాయతీల్లో ఈ అక్రమ వసూలు జరుగుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. వేతన దారులే గుసగుసలు ఆడుకుంటున్నారు. వాస్తవంగా ఉపాధి హామీలో ఉపాధి హామీ కూలీల వేతనాలు లేదా వారి ఖాతాల్లో పడిన డబ్బులను అధికారులు, ఫీల్ అసిస్టెంట్లు లేదా స్థానిక ప్రజా ప్రతినిధులు అక్రమంగా వసూలు చేస్తే అది చట్టరీత్యా నేరం.ఇలాంటి అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటారు. అక్రమంగా వసూలు చేసిన మొత్తాన్ని బాధ్యులైన వారి వేతనాలు లేదా ఆస్తుల నుండి వడ్డీతో సహ రికవరీ చేసి.ఉద్యోగం నుండి తొలగిస్తారు.అక్రమాలకు పాల్పడినట్లు విచారణలో తేలితే.. ఫీల్ అసిస్టెంట్లు, ఇతర అధికారులను ఉద్యోగం నుండి శాశ్వతంగా తొలగిస్తారు. బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, చట్టప్రకారం జైలు శిక్ష పడేలా చర్యలు తీసుకుంటారు.అవినీతికి సహకరించిన అధికారులను సస్పెండ్ చేయడంతో పాటు, స్థానిక ప్రజాప్రతినిధులైతే వారి పదవులను కోల్పోయేలా అనర్హత వేటు వేస్తారు.కూలీల నుండి ఎవరైనా డబ్బులు వసూలు చేసినట్లు గుర్తిస్తే. బాధితులు నేరుగా జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారులకు, జిల్లా కలెక్టర్కు లేదా మండల పరిషత్ అభివృద్ధి అధికారి కు ఫిర్యాదు చేయవచ్చు. టోల్-ఫ్రీ నంబర్ 1907 (సచివాలయ హెల్ప్లైన్) లేదా జాతీయ ఉపాధి హామీ అధికారిక వెబ్సైట్ ద్వారా కూడా ఫిర్యాదులు నమోదు చేయవచ్చు. అసలు ఈ అక్రమాలు జరగడానికి పర్యవేక్షణ లోపమే కారణంగా పలువురు అభిప్రాయాలు వ్యక్తపరుస్తున్నారు. ఉపాధి హామీ పథకంలో పని చేసే అసిస్టెంట్ ప్రోగ్రామ్ ఆఫీసర్ మండల స్థాయిలో ప్రాజెక్ట్ అధికారికి సహాయకుడిగా వ్యవహరిస్తారు. ఉపాధి కల్పన, వేతనాల చెల్లింపు, మరియు గ్రామీణ అభివృద్ధే ఈయన ప్రధాన బాధ్యత. ఏపీవో లేబర్ బడ్జెట్ తయారు చేయడం: గ్రామ పంచాయతీలు తయారు చేసే లేబర్ బడ్జెట్ మరియు ప్రాజెక్టులను సమీకరించి, సమగ్ర ప్రణాళికను తయారు చేయడంలో సహాయపడతారు. దరఖాస్తు చేసుకున్న 15 రోజుల్లోగా అర్హులైన పేదలకు ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకుంటారు.రిజిస్టర్ చేసుకున్న కుటుంబాలకు 15 రోజుల్లోగా జాబ్ కార్డులు అందేలా చూస్తారు. ఉపాధి కూలీలకు వారు పనిచేసిన 15 రోజులలోపు బ్యాంక్ లేదా పోస్టాఫీసు ఖాతాల ద్వారా వేతనాలు చెందేలా పర్యవేక్షిస్తారు. మండలంలో జరుగుతున్న ఉపాధి పనులను, రికార్డులను (కేస్ రికార్డులు, క్యాష్ బుక్, వోచర్లు) ప్రతి నెలా కనీసం 16 రోజులు క్షేత్రస్థాయిలో పర్యటించి తనిఖీ చేస్తారు.

సామాజిక తనిఖీ పథకంలో పారదర్శకత ఉండేలా సోషల్ ఆడిట్ మరియు ఇతర తనిఖీలలో అధికారులకు సహాయపడతారు. గ్రామ రోజ్ గార్ సహాయక్ , మేట్లకు వారి బాధ్యతలపై అవగాహన శిక్షణ ఇస్తారు. కానీ ఏపీవో శిక్షణ ఇవ్వడానికి ఏదో గ్రామం వెళ్లి పనులు జరుగుతున్నాయా లేదా చూసి రావడానికి పరిమితం అవుతున్నారే కానీ క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ జరపడం లేదని ఆరోపణలు లేకపోలేదు. దీనిపై అధికారులు ఏ విధంగా స్పందిస్తారో వేచి చూడాల్సిందే. ఈ ఐదేళ్లలో మండలంలో జరిగిన ఉపాధి పనులు, జరిగిన అక్రమాలు, మొక్కుబడిగా జరుగుతున్న పనులు, సోషల్ ఆడిట్ నిష్పక్షపాతం గా జరుగుతుందా, సోషల్ ఆడిట్లో జరుగుతున్న మతలబులు, ప్రజలకు అందించేందుకు మనం దినపత్రిక ప్రతినిధి 20 రోజులు కష్టపడి పూర్తి ఆధారాలు సేకరించారు, వీటి ఆధారాలతో మరిన్ని వరుస కథనాలు ప్రజల ముందు పెట్టడం జరుగుతుంది.

## స్వర్ణ భారతి ఇండోర్ స్టేడియంలో వేసవి క్రీడా శిక్షణా శిబిరాలు ప్రారంభం




- ప్రపంచ స్థాయి క్రీడలకు విశాఖ వేదిక కావాలి.
- జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్.

**విశాఖపట్నం మే 24 మనం న్యూస్ :** గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) ఆధ్వర్యంలో నగరంలోని విద్యార్థినీ, విద్యార్థుల లో క్రీడా నైపుణ్యాలను పెంపొందించేందుకు ప్రతిష్టాత్మకంగా జీవీఎంసీ ఉచిత వేసవి క్రీడా శిక్షణా శిబిరాలు (సమ్మర్ క్యాంప్స్) నిర్వహించడం అభినందనీయమని, ఈ శిక్షణా శిబిరాలలో విద్యార్థిని విద్యార్థులు క్రీడ నైపుణ్యతను పెంపొందించుకొని ఒలింపిక్ స్థాయి క్రీడలకు విశాఖ క్రీడాకారులు సిద్ధం సిద్ధం కావాలని ,ప్రపంచ స్థాయి క్రీడలకు విశాఖ వేదిక కావాలని రాష్ట్ర ప్రభుత్వ విప్, విశాఖపట్నం పశ్చిమ ఎమ్మెల్యే పి.జి.వి.ఆర్. నాయుడు (గణబాబు) పేర్కొన్నారు. ఆదివారం స్వర్ణ భారతి ఇండోర్ స్టేడియంలో జీవీఎంసీ నిర్వహిస్తున్న వేసవి క్రీడా శిక్షణ శిబిరాలకు పశ్చిమ ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై సభ అధ్యక్షత వహించిన జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, జీవీఎంసీ అదనపు కమిషనర్ పి. నల్లనయ్య లతో కలిసి వేసవి క్రీడా శిక్షణా శిబిరాలను జ్యోతి ప్రజ్వలన చేసి క్రీడా శిక్షణ శిబిరాలను ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ విప్ , పశ్చిమ ఎమ్మెల్యే పి.జి.వి.ఆర్. నాయుడు (గణబాబు) మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసానికి క్రీడలను ఒక సాధనంగా మార్చుకోవాలని పిలుపునిచ్చారు. గత రెండు సంవత్సరాల నుండి వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు అని భార్య కారణాలవలు నిర్వహించడం జరగలేదని, ఈ సంవత్సరం జీవీఎంసీ ఎంతో బాధ్యతాయుతంగా ఈ వేసవి శిక్షణా శిబిరాలను నిర్వహిస్తున్నందుకు జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ కు అభినందనలు తెలిపారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న క్రీడా మైదానాలను సంపూర్ణంగా ఉపయోగించుకుని, నిపుణులైన కోచ్ల పర్యవేక్షణలో ఉచితంగా శిక్షణ ఇవ్వడం ద్వారా ఎంతోమంది ప్రతిభావంతులైన అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులు వెలుగులోకి వస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

## నేడు వంటాలమామిడిలో 'జన్ భాగీదారీ అభియాన్' ముగింపు వేడుకలు

- ఐటీడీఏ పీఓ ఆదిత్య వర్మ.

**ఏ ఎస్ ఆర్ జిల్లా పాడేరు, మే : 24,** అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ఐటీడీఏ పరిధిలో నిర్వహిస్తున్న ప్రతిష్టాత్మక 'జన్ భాగీదారీ అభియాన్' కార్యక్రమ ముగింపు వేడుకలు సోమవారం, మే 25న పాడేరు మండలం వంటాలమామిడి గ్రామ పంచాయతీ పరిధిలో ఘనంగా నిర్వహించనున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి ఆదిత్య వర్మ ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం మధ్యాహ్నం 02:00 గంటల నుండి వంటలమామిడిలో ప్రారంభం కానున్న ఈ మెగా క్యాంప్లో జిల్లా కలెక్టర్ జిల్లా మేజిస్ట్రేట్ నిషాంతి. టి , జిల్లా జాయింట్ కలెక్టర్ తిరుమాని శ్రీపూజ , ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి ఆదిత్య వర్మ లతో పాటు జిల్లా స్థాయి అధికారులు అందరూ పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు.

## ఎండ తీవ్రత నుంచి ఉపశమనం కోసం పోర్ట్ అథారిటీ ప్రత్యేక చర్యలు




- చల్లదనం కోసం బీచ్ రోడ్డులో వాటర్ ఫాగింగ్/ మిస్ట్ కానన్న ఏర్పాటు

**విశాఖపట్నం మే 24 మనం న్యూస్:** విశాఖపట్నంలో కొనసాగుతున్న తీవ్రమైన ఎండల నేపథ్యంలో, విశాఖ వాసులకు కొంత ఉపశమనం కలిగించేలా విశాఖపట్నం పోర్ట్ అథారిటీ ఆర్కే బీచ్ రోడ్ పరిధి మరియు రైల్వే స్టేషన్ రోడ్డులో వాటర్ ఫాగింగ్/మిస్ట్ కానన్ వాహనాన్ని ఏర్పాటు చేసింది. దీని ద్వారా నిరంతరం ఆయా ప్రాంతంలో నీటిని సన్నని జల్లు రూపంలో వెదజల్లడం ద్వారా కొంతమేరకు ఎండవేడిమి నుంచి ఉపశమనం కలుగుతుంది. ఈ ఫాగింగ్ కార్యక్రమం ప్రతిరోజూ ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు ఆర్కే బీచ్ నుంచి అప్పుఘర్ ప్రాంతం వరకు, రైల్వే స్టేషన్ రోడ్డు అలాగే ప్రజలు అధికంగా రాకపోకలు చేసే ఇతర ప్రాంతాల్లో నిర్వహించబడుతుంది. దీని ద్వారా తీవ్ర వేసవి ఉష్ణోగ్రతల నుంచి ప్రజలకు కొంత మేర ఉపశమనం కలుగుతుందని భావిస్తున్నారు.బీచ్ రోడ్డుకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పర్యాటకులు సందర్శకులు విశాఖపట్నం పోర్ట్ అథారిటీ చేపట్టిన ఈ కార్యక్రమాన్ని అభినందిస్తూ, ప్రస్తుత ఎండల తీవ్రత నుంచి ప్రజలకు కొంత ఉపశమనం లభిస్తుందని అభిప్రాయప దుతున్నారు.ఈ మిస్ట్ కానన్ను ఏర్పాటు చేయడం ద్వారా పరిసర ఉష్ణోగ్రతల నుంచి ఉపశమనం లభిస్తుంది, వాతావరణ పరిస్థితులు మెరుగుపడే వరకు ప్రజలు ఇబ్బందులు పడకుండా తాత్కాలికంగా ఈ ఏర్పాటు చేసినట్లు పోర్ట్ యాజమాన్యం తెలిపింది.

## జిల్లా, డివిజన్, మండల స్థాయిలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

- మండల కార్యాలయాల్లో తహసిల్దార్లు ఎంపీడీవోలు ఇతర మండల అధికారులు వినతులు స్వీకరిస్తారు
- ఆర్డీవో కార్యాలయాల్లో రెవెన్యూ డివిజనల్ అధికారి ఇతర డివిజనల్ అధికారులు పాల్గొని స్వీకరిస్తారు
- ఎండ తీవ్రత దృష్ట్యా అత్యవసరం అయితేనే ఫిర్యాదుదారులు జిల్లా కలెక్టరేట్ కు రావాలి
- జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్



**తిరుపతి మే 24 మనం న్యూస్:** ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం జిల్లా, డివిజన్, మండల స్థాయిలో నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల స్థాయిలో తహశీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల్లో, డివిజన్ స్థాయిలో ఆర్డీవో కార్యాలయాల్లో పి జీ ఆర్ ఎస్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. మండల కార్యాలయంలో తహశీల్దారులు, ఎంపీడీవోలు, ఇతర మండల అధికారులు, ఆర్డీవో కార్యాలయాల్లో రెవిన్యూ డివిజనల్ అధికారి, ఇతర డివిజనల్ అధికారులు పాల్గొని వినితలను స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. మండల, రెవెన్యూ డివిజన్ స్థాయిలో పరిష్కారమయ్యే సమస్యలకు సంబంధించి ప్రజలు తమ అర్జీలను మండల కార్యాలయాలు లేక రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో తమ వినతులను సమర్పించవచ్చని తెలిపారు. ఎండ తీవ్రత ఎక్కువ ఉన్న దృష్ట్యా అత్యవసరమైతే తప్ప అర్జీదారులు వినతులు సమర్పించడానికి వ్యయ ప్రయాసలకు ఓర్చి జిల్లా కలెక్టరేట్ కు రావద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మండల రెవెన్యూ డివిజన్ స్థాయిలో నిర్వహించే పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని స్వయంగా పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు. అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్కు కాల్ చేయవచ్చునన్నారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవడానికి డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) వెబ్సైట్ నందు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవచ్చున్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కలెక్టరేట్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో తమ వివరాలతో పాటు వారి సమస్యలకు సంబంధించి అర్జీలను అందజేయాలన్నారు. అర్జీదారులు గతంలో ఇచ్చిన అర్జీలకు సంబంధించిన స్లిప్పును తీసుకురావాలని సూచించారు. సమస్య పరిష్కారమైనప్పుడు ఫోన్ కి మెసేజ్ వస్తుందని, అర్జీదారులు వారి ఫోన్ ను చెక్ చేసుకోవాలన్నారు. నోటీసులు, ఎండార్స్మెంట్ ను వాట్సప్ లో పంపిస్తున్నామని, ఎండార్స్మెంట్ బై రిజిస్టర్ పోస్ట్ మీరు ఇస్తున్న అడ్రస్ కు పంపిస్తున్నామన్నారు. అర్జీ ఇచ్చేటప్పుడు దానిని కరెక్ట్ గా దానిని పూరించాలన్నారు. రిపీటెడ్ అర్జీదారులు పాత రసీదును తీసుకురావాలన్నారు. జిల్లా ప్రజలు పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## నగరంలో అద్భుతంగా 'హ్యాపీ సండే' కార్యక్రమాలు



- జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

**విశాఖపట్నం, మే 24:** రాష్ట్ర మునిసిపల్ పరిపాలన పట్టణాభివృద్ధి శాఖ ఆదేశాలు, మార్గదర్శకాలతో విశాఖ నగరంలో అన్ని జోన్ల పరిధిలో 'హ్యాపీ సండే' కార్యక్రమాలు ఆదివారం అద్భుతంగా నిర్వహించడమైనదని , హ్యాపీ సండే కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో ఉత్సాహంగా ప్రజలు ,నివాసిత సంక్షేమ సంఘాలు, విద్యార్థినీ విద్యార్థులు ,సీనియర్ సిటిజనులు, వాకర్స్ క్లబ్ అసోసియేషన్లు , స్వయం సహాయక సంఘ సభ్యులు , ఆర్పీలు పాల్గొని హ్యాపీ సండే కార్యక్రమాన్ని జయప్రదం చేశారని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదివారం పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఈ కార్యక్రమాల ద్వారా ప్రజల్లో ఆరోగ్యకరమైన జీవనశైలి, సామాజిక ఐక్యత మరియు కమ్యూనిటీ భాగస్వామ్యాన్ని పెంపొందించడం లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమాలకు అన్ని వర్గాల ప్రజల నుండి మంచి స్పందన లభిస్తున్నదని ఆయన పేర్కొన్నారు. ఉదయం 6:00 గంటల నుండి 9:00 గంటల వరకు పార్కులు, ఓపెన్ స్పేసులు, కమ్యూనిటీ హాల్స్, కళ్యాణ మండపాలు, క్రీడా ప్రాంగణాలు ,బహిరంగ ప్రదేశాలు వంటి ప్రదేశాలలో కార్యక్రమాలు నిర్వహిం చబ డ్డాయని ఈ సందర్భంగా క్రీడలు, యోగా, నృత్యం, పాటలు, మిమిక్రీ , వేసవి అవగాహన కార్యక్రమాలు , సాంస్కృతిక మరియు వినోదాత్మక కార్యక్రమాలు నిర్వహించి ఉత్సా హభరిత వాతావరణం కల్పించామన్నారు.

## ప్రశాంతంగా యూపీఎస్సీ సివిల్స్ ప్రిలిమినరీ పరీక్ష

- పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్



**విశాఖపట్నం, మే 24 :-** జిల్లాలో ఆదివారం నిర్వహించిన యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్ష-2026 ప్రశాంతంగా, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా విజయవంతంగా ముగిసింది. జిల్లాలో మొత్తం 17 పరీక్షా కేంద్రాల్లో రెండు సెషన్లలో పరీక్షలు నిర్వహించారు. మొత్తం 7,763 మంది అభ్యర్థులకు గాను ఉదయం సెషన్లో 4,755 మంది (61.25 శాతం) హాజరుకాగా, 3,008 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం సెషన్లో 4,696 మంది (60.49 శాతం) హాజరుకాగా, 3,067 మంది గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు. జిల్లా యంత్రాంగం ముందస్తుగా చేపట్టిన పకడ్బందీ ఏర్పాట్లు, కేంద్రాల వద్ద భద్రతా చర్యలు, అభ్యర్థులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనతో పరీక్షలు సజావుగా జరిగాయి. అన్ని కేంద్రాల్లో అధికారులు నిరంతర పర్యవేక్షణ నిర్వహించారు. ఇదిలా ఉండగా, పరీక్షల నిర్వహణ తీరును జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్, జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి పరిశీలించారు. ఆదివారం ఉదయం మద్దిలపాలెంలోని వి.ఎస్. కళాశాల, ఎం.వి.పి. పరిధిలోని గాయత్రి విద్యా కళాశాల పరీక్షా కేంద్రాలను సందర్శించి ఏర్పాట్లను తనిఖీ చేశారు. అధికారులతో మాట్లాడి అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పరీక్షలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా అన్ని చర్యలు తీసుకోవాలని చెప్పారు.

## ధాన్యం కొనుగోలు దిగుమతి కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్

**గజ్వేల్ మే 24 మనం న్యూస్ః** గజ్వేల్ పట్టణంలోనీ వ్యవసాయ మార్కెట్ కమిటీ లో ధాన్యం కొనుగోలు, దిగుమతి ప్రక్రియను జిల్లా కలెక్టర్ కె. హైమావతి ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు సజావుగా సాగుతుందని, ఏ ఎం సి లలో వరి తో పాటు మక్కలు కూడా కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. మక్కలు, వరి ఒకే సారి రావడం వలన హమాలీ, లారీల కొరత ఏర్పడిందని ఈ సమస్యలు అధిగమించడానికి బయట రాష్ట్రాల నుండి హమాలీ కాకుండా స్థానిక గ్రామాల్లో హమాలీలను సెంటర్ లలో ఉంచాం, లారీల కొరత తీర్చడానికి కలెక్టరేట్ లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి, ఎక్కువ ధాన్యం ఉన్న సెంటర్ లకు ప్రాధాన్యత కల్పిస్తూ గత కొన్ని రోజులుగా కొనుగోలు సజావుగా జరిగేలా అదికార యంత్రాంగం పని చేస్తుందని తెలిపారు. ధాన్యం నిలవచేయడానికి స్థల కొరత వలన ఏ ఎం సి లలో గోదాం మరియు షెడ్ లను ఉపయోగించి అందులో ధాన్యాన్ని దిగుమతి చేస్తున్నామని తెలిపారు. గోదాంలో దిగుమతి వలన ట్రాన్స్పోర్ట్, ధాన్యాన్ని వెంటనే లిఫ్ట్ చేస్తున్నామని తెలిపారు.ప్రభుత్వం రైతులు పండించిన పంట చివరి గింజ వరకు కొనుగోలు చేస్తుందని, కొనుగోలులో వేగం పెంచడంలో అధికార యంత్రాంగానికి సహకరించాలని జిల్లా రైతాంగానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ సిఐ రవికుమార్ బిజెపి నాయకులు గాడి పల్లి భాస్కర్, మనోహర్ యాదవ్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సుడిగాలి పర్యటన

- అభివృద్ధి పనుల సమీక్ష



**మధిర, మే 24(మనం న్యూస్):** నియోజకవర్గ కేంద్రమైన మధిర మున్సిపాలిటీ పరిధిలో కొనసాగుతున్న వివిధ అభివృద్ధి పనులను రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదివారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అధికారులతో కలిసి పట్టణంలోని పలు ప్రాంతాల్లో పర్యటించిన ఆయన, పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఈ పర్యటనలో భాగంగా తొలుత మధిర మార్కెట్ యార్డ్ను సందర్శించిన ఉపముఖ్యమంత్రి, గోదాములను పరిశీలించారు. నిల్వ సామర్థ్యం, నిర్మాణ ప్రమాణాల గురించి అధికారులతో చర్చించారు. వైరా నది రిటైనింగ్ వాల్ పనులు పరిశీలన మధిర -వైరా నదిపై నిర్మిస్తున్న రిటైనింగ్ వాల్ పనులను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పరిశీలన చేశారు. నది పరివాహక ప్రాంత ప్రజలకు రక్షణగా చేపట్టిన ఈ ప్రాజెక్టును ఆయన దగ్గరుండి పర్యవేక్షించారు. పనుల నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని స్పష్టం చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాల మేరకే నిర్మాణ సామాగ్రిని వాడాలని కాంట్రాక్టర్లకు, అధికారులకు సూచించారు. జూలై నెల ముగిసేలోపు రిటైనింగ్ వాల్కు సంబంధించిన పునాది పనులు పూర్తి కావాలని ఆయన స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు పట్టణంలోని 11వ వార్డులో జరుగుతున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను డిప్యూటీ సీఎం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైనేజీ పనుల వల్ల స్థానిక ప్రజలకు, రాకపోకలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. పనులు త్వరగా పూర్తి చేసి రోడ్లను పునరుద్ధరించాలని అధికారులను ఆదేశించారు.

### మోడల్ 'మహాప్రస్థానం' సందర్శన

అనంతరం మధిరలో అత్యున్నత సౌకర్యాలతో నిర్మిస్తున్న మోడల్ మహాప్రస్థానం (వైకుంఠధామం) పనులను భట్టి విక్రమార్క పరిశీలించారు. మధిర పట్టణాన్ని మోడల్ పట్టణంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర్, అడిషనల్ కలెక్టర్ శ్రీజ, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్, ఆంధ్రప్రదేశ్ గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మున్సిపల్ అధికారులు, ప్రజా ప్రతినిధులు మరియు వివిధ శాఖల ఉన్నతాధికారులు, స్థానిక కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

# కూటమిది మానవత్వం...వైసీపీ ది రాక్షసత్వం



● మంత్రి నిమ్మల

**పాలకొల్లు, మే 24,మనం ప్రతి నిధి :** రాష్ట్రంలో ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతూ ప్రాణాలను కూటమి ప్రభుత్వం నిలుపుతుండగా అధికారంలోకి వస్తే రఫా రఫా అంటూ తలలు నరికి ప్రాణాలు తీస్తామని వైసిపి చెబుతుందని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. మానవత్వం గల కూటమి ప్రభుత్వానికి, రాక్షసత్వం గల వైసీపీకి తేడా ప్రజలు బేరిజు వేసుకొని భవిష్యత్తులో వైసీపీకి స్థానం లేకుండా కనుమరుగు చేయాలనే ఆలోచనలో ప్రజలందరూ ఉన్నారన్నారు. పాలకొల్లులో తన క్యాంపు కార్యాలయంలో పాలకొల్లు నియోజకవర్గం లోని నిరుపేద, మధ్యతరగతి వర్గాలకు చెందిన 106 మందికి వైద్య సాయంగా రూ. 49. 40 లక్షల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఆయన కూటమి నాయకులతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల మాట్లాడుతూకూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 23 నెలలో వారం వారం వందలాదిమందికి వైద్య సాయంగా లక్షల రూపాయలు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల అందిస్తున్నామని , ఒక్క పాలకొల్లు నియోజకవర్గంలోనే 13 కోట్ల 60 లక్షల రూపాయలను పెద్ద ఎత్తున అందజేయడం జరిగిందన్నారు. ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యం చేయించుకుంటే ఆర్థిక భారం పడకుండా ఖర్చయిన సొమ్మును సీఎంఆర్ఎఫ్ సాయంగా తిరిగి అందిస్తున్నట్లు తెలిపారు. గత వైసిపి ఐదేళ్ల పాలనలో ముఖ్యమంత్రి సహాయ నిధి కింద ఏ ఒక్కరికైనా వైద్యసాయం అందిందా అంటూ ప్రశ్నించారు. రాష్ట్రంలో వైసిపి పార్టీ గొడ్డలి పార్టీగా రూపాంతరం చెంది ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

## టౌన్ హాల్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం



**పాలకొల్లు, మే 24,మనం ప్రతి నిధి** పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు పట్టణంలోని టౌన్ హల్ కమిటీ నూతన కార్యావర్గం ఆదివారం ఎన్నికల అధికారి పిల్లా బాలాజీ ప్రమాణ స్వీకారం చేయించారు.
నూతన అధ్యక్షుడిగా పోలిశెట్టి రాధాకృష్ణ, కార్యదర్శిగా పంజా నరసింహారావు, ట్రెజరర్ గా కంచర్ల మధు, ఉపాధ్యక్షుడిగా మామిడి చిన్న వెంకట శివయ్య, సంయుక్త కార్యదర్శిగా గుణ్ణం బాబ్జి, నలుగురు ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ ప్రమాణ స్వీకారం చేసారు.

# హెల్మెట్ ధరించండి ప్రాణాలు కాపాడుకోండి

● సిఐ మోహన్ కుమార్



**ముమ్మిడివరం,మే 24 మనం ప్రతినిధి:** ద్విచక్ర వాహనదారులూ.. మీ అవసరం మీకుంటాబానికి ఎంతైనా ఉంది హెల్మ్ ట్ దరించండి మీ కుటుంబం ఆశలను నెరవెర్చడానికి మీ వంతు ప్రయత్నం చేయడంటూ ముమ్మిడివరం పోలీసులు ద్విచక్ర వాహనదారులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఐ. పోలవరం మండలం ఎదుర్లంక వద్ద జాతీయ రహదారి పై హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలపై రాకపోకలు సాగిస్తున్న పలువురు ప్రయాణికులుకు, వారి కుటుంబ సభ్యులకు ఆదివారం సి. ఐ. మోహన్ కుమార్, ఎస్సై రవీంద్రబాబు లు హెల్మెట్ లేకపోవడంతో ఇటీ జరిగిన ప్రమాదాలలో అనేక మంది ప్రాణాలు కోల్పోవడం జరిగిందని వివరించారు.. దీనితో అనేక కుటుంబాలు చిన్నా భిన్నం అవుతున్నాయని, హెల్మెట్ లేకుండా వాహనాలు నడుపుతున్న యువకులకు వారి కుటుంబీకులచే హెల్మెట్ లు కొనిపించి దరింపచేశారు. హెల్మెట్ దరించకపోతే కేసులు నమోదు చేసి , జరిమానాలు విదించడం జరుగుతుందని హెచ్చరించారు.

## టెన్త్ టాపర్స్‌కి 'వూటుకూరి ట్రస్ట్' సత్కారం



**అమలాపురం మే 24 మనం న్యూస్:** డా. బి. ఆర్. అంబేద్కర్ కొనసీమజిల్లా, అమలాపురం రూరల్ బండారులంక గ్రామానికి చెంది, ఇటీవల విడుదలైన 10 వ తరగతి పరీక్ష ఫలితాల లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన దేవాంగ విద్యార్థినీ, విద్యార్థుల ను ఆదివారం సాయంత్రం వి.ఎస్.ఎమ్ కాన్ఫరెన్స్ హాల్లో శ్రీ వూటుకూరి వీరబ్రహ్మం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు.
ట్రస్ట్ చైర్మన్, రాష్ట్ర దేవాంగ సంక్షేమ సంఘ అధ్యక్షుడు వూటుకూరి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి అధ్యక్షత న జరిగిన ఈ సన్మాన కార్యక్రమంలో ఈ సంవత్సరం , 10 వ తరగతి పబ్లిక్ పరీక్షల లో 600 మార్కులకు గాను 598 మార్కులు 'ఆదిత్య'స్కూల్ నందు సాధించి జిల్లా ప్రథమ స్థానం లో నిలిచిన కుమారి పడవల శశి మేఘన ను పెద్దల సమక్షంలో ఘనంగా సత్కరించారు. అలాగే బండారులంక శ్రీ పేరి రామేశ్వర శర్మ, బాసిన గంగరాజు జిల్లా పరిషత్ హై స్కూల్ టాపర్ చింతపట్ల జ్యోతిశ్రీ,బళ్ల కేశవ నాగ మణికంఠ, మావూరి జాహ్నవి, గ్రామంలో ని విజ్ డమ్ స్కూల్ నుండి గుమ్మిడి నాగ దుర్గా వివేక్, బిళ్ళ కిరణ్ కళ్యాణ్, బాసిన కౌషిక్, కారుపర్తి లక్ష్మీ నాగ శ్రీనివాస్ లను శాలువా,పుష్పగుచ్చా లు , సత్కారా జ్ఞాపిక, అభినందన పత్రాలు అందించి, తల్లిదండ్రుల,గ్రామ పెద్దల సమక్షంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు వూటుకూరి సోమరాజు, శ్రీమతి నాగ సునీత,వూటుకూరి వీరబ్రహ్మం ( బాబీ), శ్రీమతి గీతిక,జాననాగేశ్వరి ,చింతా అత్తిలింగం, గుమ్మిడి రాజు, పిచ్చిక శ్యామ్, బళ్ల వెంకటేశ్వర రావు, ఇనుమర్తి లింగ మూర్తి, కార్టూనిస్ట్ మాడా రాము,కాలెపు నాగ శ్రీనివాస రావు, చింతా ఉమామహేశ్వరరావు,కొండా చిన్న, జాన సోమరాజు శ్రీమతి నాగేశ్వరి, చింతపట్ల గంగా సత్యానారాయణ తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# ఎంఎస్ఎంఈ పార్కుల్లో బీసీలకు ప్రాధాన్య


- బీసీలను వ్యాపార వేత్తలను చేయాలన్నదే సీఎం చంద్రబాబు లక్ష్యం
- ఆదరణ 3.0లో యాదవులకు ప్రాధాన్యం
- టీడీపీకి యాదవులు మూల స్తంభాలు
- పసుపు జెండా గెలుపులో ఆ సామాజిక వర్గానిదే కీలక పాత్ర
- వైసీపీ అడ్డుకున్నా యాదవులకు స్థలమిచ్చా... : మంత్రి సవిత
- యాదవ కళ్యాణ మండపం భూమిపూజ కార్యక్రమం లో పాల్గొన్న మంత్రులు సవిత కొలుసు పార్థసారథి, ఎంపీ పార్థ సారథి
- కల్యాణ మండపం నిర్మాణానికి సొంత నిధులు అందజేసిన మంత్రి సవిత రూ.5,00,116లు విరాళం



**గోరంట్ల మే24 మనం న్యూస్:** యాదవులు టీడీపీకి మూల స్తంభాలని, ఆ సామాజిక వర్గానికి చెందిన ఎందరో ఉద్దండ నేతలు పసుపు జెండా ఎగురవేయడంలో కీలక పాత్ర పోషించాలని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ ఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత కొనియాడారు. యాదవుల ఆర్థిక వృద్ధికి కూటమి ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందన్నారు. రాష్ట్రంలో ప్రతి నియోజక వర్గంలో ఏర్పాటు చేస్తున్న ఎంఎస్ఎంఈ పార్కుల్లో బీసీలకు ప్రాధాన్యమిస్తున్నామన్నారు. త్వరలో అమలు చేయబోయే ఆదరణ 3.0 పథకంలో యాదవులకు అధిక ప్రాధాన్యమివ్వనున్నట్లు వెల్లడించారు. శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల మండలంమల్లాపల్లి గ్రామ సమీపంలో 50 సెంట్ల స్థలంలో యాదవ కల్యాణ మండపం నిర్మాణానికి ఆదివారం జరిగిన భూమి పూజలో రాష్ట్ర సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, ఎంపీ బీకే పార్థసారథితో కలిసి మంత్రి సవిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ, బీసీల సంక్షేమమే లక్ష్యంగా టీడీపీని అన్న ఎన్టీఆర్ స్థాపించారన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు అన్నింటా బీసీలకు అగ్రతాంబూలం వేస్తున్నారన్నారు. బీసీల్లో కీలక సామాజిక వర్గమైన యాదవులు టీడీపీకి ఆది నుంచి మూల స్తంభాలుగా నిలిచారన్నారు. పొలిట్ బ్యూరో సభ్యులు, మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మంత్రులు కొలుసు పార్థసారథి, సత్యకుమార్ యాదవ్, బీద రవిచంద్రయాదవ్ వంటి ఎందరో నేతలు పసుపు జెండా గెలుపులో కీలక పాత్ర పోషించారన్నారు. అన్ని రకాల పదవుల కేటాయింపుల్లోనూ యాదవ సామాజిక వర్గానికి సీఎం చంద్రబాబునాయుడు అధిక ప్రాధాన్యమిస్తున్నారన్నారు. యాదవుల ఆర్థిక వృద్ధికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందన్నారు. త్వరలో అమలు చేయబోయే ఆదరణ 3.0 పథకంలో యాదవులకు ప్రత్యేక ప్రాధాన్యమిస్తున్నామన్నారు. బీసీలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దాలన్నది సీఎం చంద్రబాబు లక్ష్యమన్నారు. ఇందులో భాగంగా ఎంఎస్ఎంఈ పార్కుల్లో బీసీలకు అవకాశమిస్తున్నామని మంత్రి సవిత తెలిపారు.

## యువకుడికి ఆధార్ లేక వైద్యం అందని దుస్థితి

**పిఠాపురం మే 24(మనం న్యూస్):** పిఠాపురం పట్టణంలోని మిరపకాయల వీధికి చెందిన వేమగిరి సతీష్ అనే యువకుడు తీవ్ర కిడ్నీ సమస్యతో బాధపడుతూ ప్రస్తుతం అత్యంత దయనీయ పరిస్థితుల్లో జీవిస్తున్నాడు. రెక్కాడితే గాని డొక్కాడని ఈ కుటుంబానికి తల్లి లేకపోగా, తండ్రి వేమగిరి సింహాచలం కూడా ఊపిరితిత్తుల వ్యాధితో తీవ్ర అనారోగ్యానికి గురై ఉన్నారు.సతీష్కు ఆధార్ కార్డు సమస్య ఉండటంతో ప్రభుత్వ పథకాలు అందకపోవడమే కాకుండా, ఏ ఆసుపత్రికి వెళ్లినా సరైన వైద్యం అందని పరిస్థితి నెలకొంది. కుటుంబ ఆర్థిక పరిస్థితి బలహీనంగా ఉండటంతో వైద్య ఖర్చులు భరించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న సతీష్కు అవసరమైన వైద్య సహాయం, పెన్షన్ సదుపాయం, అలాగే ఆధార్ కార్డు సమస్య పరిష్కారం చేయాలని కుటుంబ సభ్యులు అధికారులను వేడుకుంటున్నారు. ప్రజల కష్టాలను తెలుసుకొని ఎన్నో పేద కుటుంబాలకు అండగా నిలుస్తున్న పవన్ కళ్యాణ్ తమ కుటుంబ పరిస్థితిని కూడా గుర్తించి సతీష్కు న్యాయం చేయాలని, వైద్య సహాయం అందించాలని, కిడ్నీ సంబంధిత పెన్షన్ మంజూరు చేయాలని కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతంగా విజ్ఞప్తి చేస్తున్నారు.


2710/01335/01094
14/08/2019 14:24:12

## కలెక్టర్ ఆదేశాలతో మజ్జిగ పంపిణీ

**మహాదేవపూర్ మే 24మనం న్యూస్:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం కాలేశ్వరంసరస్వతిఅంత్యపుష్కరాల సందర్భంగా కాళేశ్వరంలోనిస్వామిదర్శనానికిభారీగాతరలివస్తున్నభక్తులకుసౌకర్యాలుకల్పించేందుకుదేవాలయఅధికరులు ప్రత్యేకఏర్పాట్లుచేపట్టారు.
ముఖ్యంగాఎండతీవ్రతనుదృష్టిలోఉంచుకునిస్వామి దర్శనానికి దేవాలయంలో క్యూ లైన్లలో వేచి ఉన్న భక్తులకు మజ్జిగనుపంపిణీచేస్తున్నారు. భక్తులు క్యూ లైన్లలో వస్తున్నందునవారిఆరోగ్యాన్నిదృష్టిలో పెట్టుకునిజిల్లాకలెక్టర్రాహుల్ శర్మ ఆదేశాల మేరకుమజ్జిగపంపిణీకార్యక్రమాన్నినిర్వహిస్తున్నారు.
ఈ చర్యతో భక్తులు ఎండ ప్రభావంనుంచి ఉపశమనంపొందుతూ సులభంగా స్వామిదర్శనం చేసుకుంటున్నారు. దేవాలయ అధికారులు భక్తులఅవసరాలనుఎప్పటికప్పుడుపర్యవేక్షిస్తూ,అవసరమైనచర్యలుచేపట్టాలనిజిల్లాకలెక్టర్ ఆదేశించారు.

## అభివృద్ధికి ముందజంలో ఆమె నాయకత్వం



● రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వెన్నా శివ

**శంఖవరం మే 24 మనం ప్రతినిధి:** ప్రత్తిపాడు నియోజక వర్గం అభివృద్ధికి ముందజంలో ఆమె నాయకత్వం బలపడుతుందని రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వెన్నా శివ అన్నారు. మండలం లోని కత్తిపూడి గ్రామంలో ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా జన్మదిన వేడుకలు వైభవంగా రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వెన్నా శివ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ కేక్ కట్ చేసి ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వెన్నా శివ మాట్లాడుతూ, ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ,నియోజకవర్గ అభివృద్ధిని వేగవంతం చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం అందుబాటులో ఉంటూ, అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు నడిపిస్తున్న ఆమె నాయకత్వం ప్రజల్లో విశ్వాసాన్ని పెంచుతోందని ప్రశంసించారు. సేవాభావంతో కూడిన పాలనతో నియోజకవర్గాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్తున్నారని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో కత్తిపూడి సొసైటీ చైర్మన్ గాబు కృష్ణ మూర్తి, మాజీ ఎంపీటీసీ లు సాధనల లక్ష్మిబాబు, కంచిబోయిన శ్రీను, కేలంగి జన,గాబు శివ, కొయ్యా రమణ, నీటి సంఘం ప్రెసిడెంట్ దేశీలింకా వెంకటరమణ, నక్క శ్రీను, అమజాల రామకృష్ణ, బైపిన విజయ్, లారీ యూనియన్ ప్రెసిడెంట్ గౌతు కన్నారావు, గజ్జి సత్యనారాయణ, నాయుడు బుజ్జి, క్రరి బుజ్జి, చోడపునిది బాబ్జి, నాయుడు ఈశ్వరావు, నాయుడు సూరిబాబు,అలపు సత్తిబాబు, ఎద్దు లోవరాజు, మచ్చ రాజు, పెనుపోతుల అబ్బులు కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బీసీవై పార్టీలోకి భారీ చేరికలు

**పిఠాపురం(మే 24) మనం న్యూస్ :** పిఠాపురం నియోజకవర్గంలో భారత చైతన్య యువజన పార్టీ (బిసివై పార్టీ ) బలోపేతమే లక్ష్యంగా చేరికల పర్వం ఊపందుకుంది. కాకినాడ జిల్లా పద్మశాలి సంక్షేమ సంఘం ప్రముఖ నాయకులు బేత యేసు ప్రకాష్ తన అనుచరులతో కలిసి ఆదివారం బీసీవై లో పార్టీలో చేరారు. పిఠాపురం నియోజకవర్గ ఇన్చార్జ్ శీరం శ్రీను ఆధ్వర్యంలో బీసీవై పార్టీ జాతీయ అధ్యక్షులు బోడె రామచంద్ర యాదవ్ బేత యేసు ప్రకాష్ కి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీ జాతీయ అధ్యక్షులు రామచంద్ర యాదవ్ మాట్లాడుతూ బీసీల హక్కుల కోసం, యువత భవిష్యత్తు కోసం నిరంతరం పోరాడుతున్న బీసీవై పార్టీ సిద్ధాంతాలను నమ్మి విద్యావంతులు, సామాజిక సేవా తత్పరులు పార్టీలోకి రావడం శుభపరిణామన్నారు. రాబోయే రోజుల్లో పిఠాపురం నియోజకవర్గంలో పార్టీని



మరింత బలోపేతం చేస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో యు.కొత్తపల్లి మండలం బీసీవై పార్టీ కన్వీనర్ జి.వి.ఎస్.ఎన్ రాజు, గొల్లప్రోలు మండల కన్వీనర్ మూర్తుత్తే శివ, పిఠాపురం నియోజకవర్గ యూత్ కన్వీనర్ పీతల రాజా ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వీరితో పాటు పీతల చిన్న, ఉర్లంకల గంగాధర్, కుక్క పండు, గొర్ల కొండబాబు, మూర్తుర్తి గణేష్, పీతల నరేష్, మొరుగుతూ ముసలి, బండారు చిన్నారావు, ఉర్లంకల శ్రీను, బత్తులు రాజా తదితర బీసీవై పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## వర్చువల్ మహానాడును విజయవంతం చేయాలి



**కిర్లంపూడి మే 24:( మనం న్యూస్ ):** జగపతినగరంలోని తోట గోపాలకృష్ణ ఫంక్షన్ హాల్లో ఈ నెల 27, 28 తేదీల్లో నిర్వహించే వర్చువల్ మహానాడును విజయవంతం చేయాలని టీడీపీ క్లస్టర్ ఇన్చార్జ్ కుర్ల చినబాబు పిలుపునిచ్చారు. గ్రామపంచాయతీలో జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ మంత్రి నారా లోకేశ్, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఆదేశాల మేరకు 12 క్లస్టర్ల పరిధిలో ప్రత్యేక ఎల్ఈడి స్క్రీన్ల ద్వారా మహానాడు ప్రత్యక్ష ప్రసార కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

# ఈత సరదా విషాదం కాకుండా జాగ్రత్తపడాలి




- చిన్నచిన్న నిర్లక్ష్యాలు ప్రాణ నష్టానికి దారితీయవచ్చు
- తల్లిదండ్రులు పిల్లలను చెరువులు కాలువ,కుంటల వద్దకు వెళ్లకుండా చూసుకోవాలి
- జిల్లా ఎస్పీ నరసింహా

**సూర్యాపేట, మే 24 (మనం ప్రతినిధి):** వేసవికాలంలో పాఠశాలలు, కళాశాలలకు సెలవులు ఉండడంతో ఎంతో మంది పిల్లలు యువకులు ఎండ వేడి నుంచి సేద తీరటానికి, ఈత నేర్చుకోవడానికి బావుల వద్దకు, చెరువులు , కాలువల వద్దకు ఈతకు వెళ్లే అవకాశం ఉన్నందున ఇట్టి క్రమంలో ప్రమాదాలు జరిగి నీటిలో మునిగి ప్రాణ నష్టం జారిగే అవకాశం ఉన్నందున అందరూ ఇట్టి విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఈత సరదా విషాదంగా మారకూడదని జిల్లా ఎస్పీ నరసింహ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఈత రానివారు బావులు,చెరువుల వద్దకు ఒంటరిగా వెళ్లకూడదని ఈత నేర్చుకునే వారు వారి తల్లిదండ్రుల సమక్షంలో నేర్చుకోవాలని సూచించారు. ముఖ్యముగా తల్లిదండ్రులు తమ పిల్లలను చెరువుల వద్దకు కాలువల వద్దకు కుంటలు వద్దకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు.ఏదైనా అనుకోని సంఘటన జరిగినట్లయితే పిల్లల ప్రాణానికి ప్రమాదమని ఇట్టి విషయంలో తల్లిదండ్రులు తగు జాగ్రత్తలు తీసుకొని పిల్లల యొక్క కదలికలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని ఎస్పీ తల్లిదండ్రులకు సూచించారు.

**ప్రజల వద్దకే పోలీసు సేవలు ఎస్పీ**

ఒక ఫోన్ కాల్తో మీ వద్దకే పోలీసు సేవలు ప్రజలకు మరింతగా చేరువయ్యే లక్ష్యంతో సూర్యాపేట జిల్లా పోలీసులు ఆన్సైట్ ఎఫ్ఐఆర్ విధానం సమర్థవంతంగా అమలు చేస్తున్నామని జిల్లా ఎస్పీ కే నరసింహ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఫిర్యాదు దారులు పోలీస్ స్టేషన్కు రావాల్సిన అవసరం లేకుండా, సంఘటన జరిగిన ప్రదేశానికే వెళ్లి ఫిర్యాదులను స్వీకరించి ఎఫ్ఐఆర్ నమోదు చేసే ఈ విధానం ద్వారా బాధితులకు తక్షణ న్యాయం అందేలా చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ వెల్లడించారు. ప్రజలకు త్వరితగతిన, పారదర్శకంగా, నమ్మకమైన పోలీసు సేవలు అందించాలనే ఉద్దేశంతో జిల్లా పోలీస్ శాఖ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ 'ఆన్సైట్ ఎఫ్ఐఆర్' విధానాన్ని అమలు చేస్తోంది అన్నారు. బాధితులు పోలీస్ స్టేషన్కు రావడానికి ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితుల్లో, సంఘటన స్థలానికే వెళ్లి ఫిర్యాదు స్వీకరించి వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేయడం ద్వారా బాధితులకు తక్షణ న్యాయం అందించేందుకు ఈ విధానం ఎంతో ఉపయోగపడుతోంది అని స్పష్టం చేశారు.ప్రత్యేకించి మహిళపై అత్యాచారాలు, చిన్న పిల్లలపై జరిగే నేరాలు, రోడ్డు ప్రమాదాలు, దొంగతనాలు, చోరీలు, గొడవలు, మిస్సింగ్ కేసులు, లైంగిక వేధింపులు, బాల్యవివాహాలు, ర్యాగింగులు, వృద్ధులు, దివ్యాంగులు, గ్రామీణ ప్రాంత ప్రజలు, అత్యవసర పరిస్థితుల్లో ఉన్న బాధితులకు ఈ సేవ ఎంతో మేలు చేస్తుందని తెలిపారు. అనేక సందర్భాల్లో ప్రజలుఅత్యవసర సమయంలో పోలీస్ స్టేషన్కు వెళ్లలేని పరిస్థితుల్లో 100 డయల్ కు గాని లేదా సంబంధిత పోలీస్ అధికారికి నేరుగా ఫోన్ చేసి సమాచారం అందజేస్తే పోలీసు అధికారులు, సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి తక్షణ చర్యలు ప్రారంభిస్తారు.
అదేవిధంగా సమస్య ఎక్కడ జరిగినా ప్రజలకు పోలీసు సహాయం త్వరగా అందాలన్నదే మా లక్ష్యం. ఫిర్యాదు వచ్చిన వెంటనే పోలీసు సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని అవసరమైన చర్యలు తీసుకుంటారని తెలియజేశారు. దీనివల్ల సమయం ఆదా కావడంతో పాటు కేసుల దర్యాప్తు మరింత వేగంగా, సమర్థవంతంగా జరుగుతుందని, జిల్లా పోలీసులు ప్రజలతో స్నేహపూర్వక సంబంధాలు కొనసాగిస్తూ, ప్రజల్లో భద్రతా భావన పెంపొందించే దిశగా కృషి చేస్తున్నారు. ప్రజలు ఎలాంటి భయం లేకుండా తమ సమస్యలను పోలీసుల దృష్టికి తీసుకొని కావాలని పిలుపునిచ్చారు.

# కాంగ్రెస్ పార్టీ హత్య రాజకీయాలను ప్రోత్సహించదు




**సూర్యాపేట టౌన్, మే 24 (మనం న్యూస్):** సూర్యాపేట మండలం యర్కారం గ్రామ మాజీ సర్పంచ్ భర్త చింతలపాటి మధు హత్య పై మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ పై చేసిన వ్యాఖ్యలు నిరాధారమైనవని, కాంగ్రెస్ పార్టీ ఏనాడూ హత్య రాజకీయాలను ప్రోత్సహించదని డిసిసి అధ్యక్షుడు గుడిపాటి నర్సయ్య పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దెయ్యాలు వేదాలు వల్లించినట్లు జగదీష్ రెడ్డి మాటలు ఉన్నాయని, ఆయనే మేజిస్ట్రేట్ లా, ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ లా కుట్ర పూరితంగా కాంగ్రెస్ పార్టీ పై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. పది సంవత్సరాల సూర్యాపేట నియోజకవర్గంలో ఏనాడు మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి నాయకత్వంలో కార్యకర్తలు, నాయకులు ప్రజా తీర్పును స్వాగతించామని, రౌడీ రాజకీయాలను ఎవరు ప్రోత్సహించారో ప్రజలకు తెలుసునన్నారు. రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నాయకత్వం, సారథ్యంలో ఎంతో శాంతియుతంగా జిల్లా ప్రజలు జీవిస్తున్నారని, మధు హత్య పై పోలీసులు పూర్తి స్థాయిలో విచారణ దర్యాప్తు చేపట్టాలని మేము డిమాండ్ చేస్తున్నామని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీకి మధు హత్య కు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే గుంట్లకండ్ల జగదీష్ రెడ్డి కక్ష సాధింపుచేయాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ పార్టీ పై నిరాధారమైన ఆరోపణలు చేయడం సరైంది కాదన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కోశాధికారి కక్కిరేణి శ్రీనివాస్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరి కుంట్ల వేణుగోపాల్, పీసీసీ ఎస్సీ సెల్ వైస్ చైర్మన్ చింతమల్ల రమేష్, జిల్లా కాంగ్రెస్ నాయకులు అబ్దుల్ రహీం, పట్టణ అధ్యక్షులు అంజద్ అలీ, జిల్లా కార్యదర్శి అక్కినపల్లి జానయ్య, యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎలిమినేటి అభినయ్, నాయకులు అన్నమయ్య రాము, మద్దెబోయిన శ్రీనివాస్ యాదవ్, పడిదల రవి, బొప్పని శ్రీకాంత్ పాల్గొన్నారు.









# వైభవ్ సూర్యవంశీ వరల్డ్ రికార్డు

ఐపీఎల్-2026లో వాంఖడే వేదికగా ముంబై ఇండియన్స్ తో కీలక మ్యాచ్ లో రాజస్తాన్ రాయల్స్ యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ నిరాశపరిచాడు. 6 బంతుల్లో కేవలం 4 పరుగులు మాత్రమే చేసి పెవిలియన్ కు చేరాడు. అయితే ఈ మ్యాచ్ లో వైభవ్ త్వరగా అవుట్ అయినప్పటికి ఓ వరల్ రికార్డును తన పేరిట లిఖించుకున్నాడు.

ఒక టీ20 సిరీస్ లేదా టోర్నమెంట్ లో అత్యధిక పరుగులు చేసిన పిన్న వయష్కుడిగా 15 ఏళ్ల వైభవ్ నిలిచాడు. ఈ ఏడాది ఐపీఎల్ సీజన్ లో సూర్యవంశీ ఇప్పటివరకు 14 మ్యాచ్లు ఆడి 583 పరుగులు చేశాడు. 4 పరుగులు వ్యక్తిగత స్కోర్ వద్ద వైభవ్ ఈ ఫీట్ సాధించాడు.

ఇంతకుముందు ఈ రికార్డు ఆర్సీబీ స్టార్ దేవ్ దత్త్ పడిక్కల్ పేరిట ఉండేది. 2019/20 సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో పడిక్కల్ కర్ణాటక తరఫున 580 పరుగులు చేశాడు. పడిక్కల్ 19 ఏళ్ల వయస్సులో ఈ ఘనత సాధించాడు. తాజాగా ఇన్నింగ్స్ తో పడిక్కల్ ఆల్ టైమ్ రికార్డును వైభవ్ బ్రేక్ చేశాడు. ఇక ఈ డూ ఆర్ డై మ్యాచ్ లో టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన రాజస్తాన్ రాయల్స్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 205 పరుగుల భారీ స్కోరు సాధించింది. యశస్వి జైస్వాల్ (27), ధ్రువ్ జురెల్ (38), దసున్ శనక (28), జోఫ్రా ఆర్చర్ (32) పరుగులతో రాణించారు. అనంతరం లక్ష్య చేధనలో ముంబై పోరాడుతోంది.



# చరిత్ర సృష్టించిన అర్షదీప్ సింగ్

ఐపీఎల్ 2026లో పంజాబ్ కింగ్స్ పేసర్ అర్షదీప్ సింగ్ ఓ అనవసర రికార్డు విషయంలో చరిత్ర సృష్టించాడు. లక్నో సూపర్ జెయింట్స్ తో జరిగిన కీలక మ్యాచ్ లో మూడు ఓవర్లలో 52 పరుగులు సమర్పించుకోవడంతో ఈ సీజన్ లో అతను మొత్తంగా ఇచ్చిన పరుగుల సంఖ్య 541కు చేరింది. దీంతో వరుసగా మూడు ఐపీఎల్ సీజన్లలో 500కు పైగా పరుగులు సమర్పించుకున్న తొలి బౌలర్ గా చరిత్రలో నిలిచాడు. డెత్ ఓవర్ల స్పెషలిస్టా పేరున్న అర్షదీప్ పై పంజాబ్ కింగ్స్ ఎప్పటిలాగే భారీ అంచనాలు పెట్టుకుంది. కానీ, అతను వరుసగా మూడు సీజన్ల పాటు నిరాశపరిచాడు. వికెట్లు తీస్తున్నా పరుగులు ధారాళంగా సమర్పించుకున్నాడు. కీలక సమయాల్లో ఒత్తిడికి లోనై వైడ్లు, నో బాల్స్ తో విసుగు తెప్పిస్తున్నాడు. ముఖ్యంగా యార్కర్లు, బౌన్సర్లు వేయడంలో చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు.

లక్నో మ్యాచ్ లో అయితే అతడి బౌలింగ్ ను ప్రత్యర్థి బ్యాటర్లు పూర్తిగా టార్గెట్ చేశారు. ఈ మ్యాచ్ తో అర్షదీప్ మరో చెత్త రికార్డును కూడా తన పేరిట లిఖించుకున్నాడు. పంజాబ్ కింగ్స్ తరఫున అత్యధికసార్లు ఒక మ్యాచ్ లో 50కి పైగా పరుగులు ఇచ్చిన బౌలర్ గా అప్రతిష్టను మూటగట్టుకున్నాడు. ఇప్పటివరకు అతడు ఏడు సార్లు ఈ పరిస్థితిని ఎదుర్కొన్నాడు. అతడి తర్వాత సామ్ కర్రన్ (4), కగిసో రబాడా, మహ్మద్ షమీ, జేవియర్ బార్లెట్ (తలో 3 సార్లు) 50కి పైగా పరుగులు సమర్పించుకున్నారు. అర్షదీప్ పేలవ ఫామ్ ప్రస్తుతం పంజాబ్ ను తీవ్రంగా కలవరపెడుతోంది. ఒకవేళ పంజాబ్ ప్లే ఆఫ్స్ కు అర్హత సాధిస్తే.. ఎలిమినేటర్ మ్యాచ్ లో అతడి పరిస్థితి ఏంటని అంతా చర్చించుకుంటున్నారు.

మరోవైపు అర్షదీప్ పై సోషల్మీడియాలో కూడా తీవ్ర విమర్శలు వస్తున్నాయి. ఆటపై దృష్టి పెట్టాల్సిందిపోయి సోషల్మీడియా, స్నాప్ చాట్ వీడియోలతో ఎక్కువ సమయం గడుపుతున్నాడంటూ కొందరు అభిమానులు మండిపడుతున్నారు. ఇటీవల తిలక్ వర్మతో చేసిన వీడియో, అభిమానితో జరిగిన ఆన్ లైన్ వాగ్వాదం వివాదాస్పదమయ్యాయి.

# వినేశ్‌కు గ్రీన్సిగ్నల్


సీనియర్ రెజ్లర్ వినేశ్ ఫొగాట్ ఆసియా క్రీడల సెలక్షన్ ట్రయల్స్ లో పాల్గొనేందుకు దిల్లీ హైకోర్టు అనుమతిస్తూ ఆదేశాలు జారీ చేసింది. వినేశ్ లాంటి పేరున్న అథ్లెట్ను పోటీలకు దూరంగా ఉంచాలనుకోవడాన్ని దిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీకే ఉపాధ్యాయ, జస్టిస్ తేజస్ కారియాలతో కూడిన ధర్మాసనం తప్పుపట్టింది. ఆమెలాంటి మహిళా అథ్లెట్లను మాతృత్వం కారణంగా పోటీలకు మినహాయించకూడదని తెలిపింది. ఈ నెల 30, 31న జరగనున్న ఆసియా గేమ్స్ ఎంపిక పోటీల దృశ్యాల్ని రికార్డ్ చేయాలనీ కోర్టు ఆదేశించింది. ఈ ప్రక్రియకు భారత క్రీడాప్రాధికార సంస్థ (సాయ్) నుంచి, భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) నుంచి చెరొక పరిశీలకుడు హాజరు కావాలని చెప్పింది. ఆసియా క్రీడల ట్రయల్స్ నిబంధనలను డబ్ల్యూఎఫ్ఐ ఆఖరి నిమిషంలో సవరించడంపై వినేశ్ కోర్టులో సవాల్ చేసిన సంగతి తెలిసిందే.



# పవన్‌తో ఒక్క సినిమా.. అప్పుడు బ్యానర్ ఆపేస్తా

పవర్ స్టార్ అలాగే ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి ఉన్న వీరాభిమానుల్లో నిర్మాత బండ్ల గణేష్ కూడా ఒకరు. తనకి తీన్ మార్ వంటి వైఫల్యం తర్వాత ఇచ్చిన గబ్బర్ సింగ్ బండ్ల గణేష్ జీవితాన్ని మార్చేసింది. అలాంటి తన హీరోతో మరో సినిమా చెయ్యాలని తాను మాత్రమే కాకుండా అభిమానులు కూడా ఎప్పుడు నుంచో ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

అయితే పవన్ తో మరో సినిమా విషయంలో నిర్మాత బండ్ల గణేష్ కొన్ని షాకింగ్ హాట్ కామెంట్స్ చేయడం ఇప్పుడు వైరల్ గా మారింది. తన బ్యానర్ ని పవన్ కళ్యాణ్ ఒక్క సినిమా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు ఆడియెన్స్ అంతా ఒక్కసారిగా ఉలిక్కిపడేలాంటిది చేసి అప్పుడు బ్యానర్ ని ఆపాలని కోరుకుంటున్నట్టు లేటెస్ట్ పాడ్ కాస్ట్ లో చెప్పడం ఇప్పుడు సోషల్




మీడియాలో వైరల్ గా మారింది. మరి ఇలాంటి ఊహించని సినిమా పడాలి అంటే అందుకు కాలం కూడా బాగా కలిసి రావాల్సిందే..

# విజయ్‌తో ప్రీతి స్పెషల్ సాంగ్?

విజయ్ దేవరకొండ హీరోగా దర్శకుడు రవి కిరణ్ కోలా తెరకెక్కిస్తున్న సినిమా 'రౌడీ జనార్దన'. ఈ సినిమాలో ఓ ఐటెం సాంగ్ ఉండబోతుందని.. ఈ సాంగ్ లో విజయ్ దేవరకొండతో కలిసి డాన్స్ చేయడానికి ప్రీతి ముకుందన్ ను తీసుకోబోతున్నారని తెలుస్తోంది. మంచు విష్ణు 'కన్నప్ప' చిత్రంతో తెలుగులోకి ఎంట్రీ ఇచ్చింది ప్రీతి ముకుందన్. మరి ఇప్పుడు విజయ్ దేవరకొండ సరసన ప్రీతి ముకుందన్ స్పెషల్ సాంగ్ చేస్తే ఎలా ఉంటుందో చూడాలి. అన్నట్టు ఈ సినిమాలో వచ్చే ఫ్లాష్ బ్యాక్ లో విజయ్ దేవరకొండ ఫుల్ యాక్షన్ మోడ్ లో కనిపిస్తాడట.

పైగా విజయ్ దేవరకొండ యాక్షన్ సీన్స్ సినిమా మొత్తంలోనే మెయిన్ హైలైట్ గా ఉంటాయట. స్టార్ ప్రొడ్యూసర్ దిల్ రాజు నిర్మిస్తున్న ఈ సినిమాలో సీనియర్ హీరో రాజశేఖర్ కూడా నటిస్తున్న సంగతి తెలిసిందే. అన్నట్టు రాజశేఖర్ పాత్ర అండ్ ఆయన లుక్ మునుపెన్నడూ చూడని రీతిలో ఉంటుందట. కాగా ఈ సినిమా కథ గ్రామీణ నేపథ్యంలో సాగనుంది. ఈ సినిమాలో విజయ్ కు జోడీగా కీర్తి సురేశ్ నటించనుంది. మొత్తానికి ఈ సినిమా పై భారీ అంచనాలు ఉన్నాయి. మరి ఈ సినిమా ఏ రేంజ్ లో ఉంటుందో చూడాలి.





# ఎడ్యుకేషన్ సిస్టమ్‌పై పూరి మ్యూజింగ్స్

మార్కులకే ప్రాధాన్యమిస్తూ విద్యార్థులను కాంపిటేషన్ మోడ్ లో ఉంచడం ఏమాత్రం మంచిది కాదని ప్రముఖ దర్శకుడు పూరి జగన్నాథ్ పేర్కొన్నారు. పాఠశాల, కళాశాలల్లో సబ్జెక్టుల కన్నా ముందు జీవితం గురించి నేర్పాలని అభిప్రాయపడ్డారు. 'ఫ్యూచర్ ఎడ్యుకేషన్' పేరిట 'పూరి మ్యూజింగ్స్' లో విద్యావ్యవస్థపై మాట్లాడారు.

''నేటి మోడ్రన్ స్కూళ్లు పిల్లలకు అపారమైన జ్ఞానాన్ని అందిస్తున్నాయి. అయితే ఆ నాలెడ్జ్ విద్యార్థులను బలమైన వ్యక్తులుగా (మానసికంగా) తయారు చేసేందుకు ఉపయోగపడదు. ఇంటి పనులు ఎలా చేసుకోవాలన్నది ఎల్కేజీ నుంచే నేర్పాలి. శుభ్రత గురించి చెప్పాలి. ఐదేళ్లకే సమయపాలన, నిజాయతీ అంటే ఏంటో వివరించాలి. ప్రతి విద్యార్థికీ క్రమశిక్షణను నూరిపోయాలి. కుకింగ్ క్లాసెస్ కూడా ఉండాలి. వ్యాయామం, ఆటలు తప్పనిసరి చేయాలి. డిజిటల్ డిసిప్లిన్ గురించి చెప్పాలి.

ఇప్పటి స్కూళ్లన్నీ పరీక్షలు, మార్కులు, కంఠస్తం చేయడంపై దృష్టి పెడుతున్నాయి. ఫిజిక్స్, కెమిస్ట్రీ కన్నా ముందు సెల్ఫ్ కంట్రోల్, టైమ్ మేనేజ్ మెంట్, ఎమోషనల్ బ్యాలెన్స్ లాంటి వాటిపై పాఠాలుండాలి. ఇవే వారికి జీవితంలో ఉపయోగపడతాయి. వారానికోసారి విద్యార్థులతో మెడిటేషన్ చేయించాలి. వయసుపెరిగేకొద్దీ.. ఒత్తిడిని ఎలా అధిగమించాలి? కోపాన్ని ఎలా కంట్రోల్ చేయాలి? అన్నవి చెప్పాలి. కమ్యూనికేషన్ ప్రాధాన్యాన్ని వివరిస్తూ.. కనీసం మూడు భాషలు మాట్లాడేలా చూడాలి. మెంటల్ హెల్త్ పై అవగాహన కలిగించేలా ట్రైనింగ్ ప్రోగ్రామ్స్ నిర్వహించాలి. అన్నింటికన్నా ముఖ్యంగా ప్రకృతిని ఎలా కాపాడుకోవాలన్నది చెప్పాలి. వీటి తర్వాతే మిగిలిన సబ్జెక్టులుండాలి.

జీవితంలో కష్టం ఎదురైతే పాఠశాలలో చెప్పిన మోటివేషన్ క్లాస్ గుర్తురావాలి. అందుకే పిల్లల్ని మోటివేట్ చేసే టీచర్లు కావాలి. ఈరోజుల్లో ఏ డిగ్రీ అయినా అది బేసిక్ ఎడ్యుకేషన్ మాత్రమే. దానితో జీవితం మారిపోదు. దానికోసం చిన్నప్పటి నుంచీ పుస్తకాలను భుజాన మోయించాల్సిన అవసరం లేదు. మార్కుల కోసం వారిని కాంపిటీషన్ మోడ్ లో పెట్టడం మంచిది కాదు. దీని వల్ల చిన్నప్పుడే ఆందోళనకు లోనవుతున్నారు. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో లెక్కల ప్రకారం.. మన దేశంలో ఏటా 13,000 నుంచి 15,000 మంది విద్యార్థులు సూసైడ్ చేసుకుంటున్నారు. అకడమిక్ ఒత్తిళ్లు, ఫెయిల్యూర్ కి భయపడటం, కుటుంబం పెట్టుకున్న అంచనాలు, డిప్రెషన్ లాంటివి ఇందుకు కారణం. ఇన్ని వేల మంది ఆత్మహత్య చేసుకుంటున్నారంటే వారి మానసిక పరిస్థితిని అర్థం చేసుకోండి.

మన ఎడ్యుకేషన్ సిస్టమ్ మారాలి. పిల్లలు పర్సనల్ గా స్ట్రాంగ్ కావాలి. పోలీసు అధికారులను స్కూళ్లు, కాలేజీలకు ఆహ్వానించి విద్యార్థులకు సివిక్ సెన్స్ నేర్పించాలి. చదువుకన్నా సంస్కారం ముఖ్యం. అందుకే సంస్కారం, మనోస్థైర్యం నేర్పే ఎడ్యుకేషన్ రావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా'' అని అన్నారు.

# స్ఫూర్తి రగిలించేలా 'పెద్ది' పోరాటం: రామ్ చరణ్

'పెద్ది' తన మనసుకు ఎంతో దగ్గరైన చిత్రమన్నారు కథానాయకుడు రామ్ చరణ్. ఇది తన ఫిల్మ్ లైబ్రరీలో నంబర్ వన్ గా నిలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. రామ్ చరణ్ టైటిల్ పాత్రలో నటించిన ఈ పాన్ ఇండియా చిత్రాన్ని బుచ్చిబాబు సానా తెరకెక్కించిన సంగతి తెలిసిందే. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వెంకట సతీశ్ కిలారు నిర్మించారు. జాన్వీ కపూర్ కథానాయిక. శివ రాజ్ కుమార్, జగపతిబాబు, దివ్యేందు శర్మ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా జూన్ 4న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే శనివారం రాత్రి భోపాల్ లో 'పెద్ది కీ ఆవాజ్' పేరుతో ప్రచార వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఏఆర్ రెహమాన్ లైవ్ కాన్సర్ట్ ఆహుతుల్ని ఉర్రూతలూగించింది. దీనిలో భాగంగా చరణ్ కోరిక మేరకు ఇంకా విడుదల కాని ఈ చిత్ర థీమ్ గీతాన్ని రెహమాన్ లైవ్ లో వినిపించారు.

అనంతరం రామ్ చరణ్ మాట్లాడుతూ.. ''ఇది కేవలం క్రీడా నేపథ్య చిత్రమే కాదు.. తన గుర్తింపు కోసం పోరాడే ఓ వ్యక్తి కథ. ఆ పోరాటం కచ్చితంగా అందరి మనసుల్ని దోచుకుంటుంది. ప్రతిఒక్కర్నీ ఆలోచింపజేస్తుంది.. స్ఫూర్తిని రగిలిస్తుంది. ఈ సినిమాని మళ్లీ మళ్లీ చూడాలనిపించేలా చేస్తుంది. దీన్ని కచ్చితంగా మీ పిల్లలతో కలిసి చూడండి. వాళ్లలో స్ఫూర్తిని నింపుతుంది'' అన్నారు.ఈ కార్యక్రమంలో మధ్యప్రదేశ్ రాష్ట్ర మంత్రులు విశ్వాస్ సారంగ్, రాకేశ్ శుక్లా, ఎంపీ రవికిషన్, సినీతారలు జాన్వీ కపూర్, దివ్యేందు శర్మ, నిర్మాత సతీశ్ కిలారు తదితరులు పాల్గొన్నారు.



**ఈవెంట్‌లో తడబడిన రామ్ చరణ్.. క్రికెటర్ కు క్షమాపణలు**

ప్రముఖ నటుడు రామ్ చరణ్ హీరోగా తెరకెక్కిన 'పెద్ది' మూవీ ఈవెంట్ లో శనివారం సాయంత్రం భోపాల్ లో ఘనంగా జరిగిన సంగతి తెలిసిందే. అయితే, వేదికపై క్రికెటర్ల గురించి ఒక్క మాటలో చెప్పాలంటూ హోస్ట్ ర్యాపిడ్ ఫైర్ నిర్వహించారు. ఈ క్రమంలో చరణ్ కాస్త తడబడ్డారు. జస్ ప్రీత్ బుమ్రా కు తాను అభిమానిని అని చెప్పిన చరణ్.. ఆయన్ను ఫుట్ బాల్ ప్లేయర్ గా పేర్కొన్నారు. సంబంధిత క్లిప్పింగ్ సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టింది. దీనిపై స్పందిస్తూ రామ్ చరణ్ క్షమాపణలు చెప్పారు.

''నేను కొన్నిసార్లు పేర్లను మర్చిపోతుంటా. జనసందోహం, అక్కడ హంగామా మధ్య అనుకోకుండా పొరపాటు జరిగింది. జస్ ప్రీత్ బుమ్రాకు క్షమాపణలు. ఆయన్ను నేను గౌరవిస్తాను. ఆయన ఆటకు నేను పెద్ద ఫ్యాన్. బ్యాటర్లు వెనకడుగు వేసేలా మీ నిలకడైన ఆటతీరు భారతీయులంతా గర్వపడేలా చేస్తోంది'' అని కొనియాడారు.

**బిహార్ అంటూ..**

ఈవెంట్ నిర్వహించిన ప్రాంతం విషయంలోనూ చరణ్ పొరపడ్డారు. భోపాల్ కు బదులు బిహార్ అని ప్రస్తావించారు. అయితే, తన పొరపాటును వెంటనే గ్రహించారు.

WANTED REPORTERS
మనం
జనం కోసం అక్షర యజ్ఞం..
రెండు తెలుగు రాష్ట్రాల్లో తనకంటూ ఓ ప్రత్యేకతను సంతరించుకొని ప్రజల గొంతుకై కొనసాగుతున్న మనం తెలుగు దిన పత్రికలో పనిచేసేందుకు విలేకరులు కావలెను. స్థానిక సమస్యలపై అవగాహన కలిగి తెలుగు భాషపై పట్టున్నవారు సంప్రదించగలరు..
కావలసిన జిల్లాలు
శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం(మన్యం), పోలవరం, మార్కాపురం, ప్రకాశం, నెల్లూరు జిల్లా కేంద్రాల్లో పనిచేసేందుకు
విలేకరులు కావలెను
ఆసక్తి కలవారు సంప్రదించాల్సిన నెంబర్
93912 85007

మనం ముద్ర

సోమవారం 25 మే 2026





వీక్షణం

భారతదేశంలో ప్రతి డిగ్రీ ఉష్ణోగ్రత పెరుగుదల, సంవత్సరాల తరబడి సాధించిన పంట ఉత్పాదకత వృద్ధిని తుడిచివేస్తుంది. ప్రధాన ఆహార పంటల దిగుబడులపై తీవ్ర ప్రభావం ఉంటుంది. రైతుల ఆదాయం తగ్గి, ఆహార ధరలు పెరుగుతాయి. ఇప్పటికే భారతదేశంలో అత్యధికంగా వినియోగించే ప్రధాన ఆహారమైన బియ్యం, స్వల్పకాలంలో 9 శాతం క్షీణతను చవిచూసింది. దీని దీర్ఘకాలిక ప్రభావం అధికంగా ఉంది.

# ఒక్క డిగ్రీ సెల్సియస్ పెరుగుదలతో విలయమే!

ఒక్క డిగ్రీ సెల్సియస్ ఉష్ణోగ్రత పెరుగుదల అన్ని పంటలలో జాతీయ సగటు దిగుబడిని సుమారు 8 శాతం తగ్గిస్తుందని ఒక కొత్త విశ్లేషణలో తేలింది. ప్రపంచంలో రెండవ అతిపెద్ద వ్యవసాయ ఉత్పత్తిదారు అయిన దేశంలో, పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, అస్తవ్యస్తమైన వర్షపాతం ఎన్నో ఏళ్ల వ్యవసాయ పురోగతిని ఎలా తుడిచిపెడుతున్నాయో ఇది స్పష్టం చేస్తుంది. 'భారతదేశంలో వాతావరణ మార్పులు,పంట దిగుబడులు' అనే పేరుతో జరిపిన అధ్యయనం కోసం 1966 నుండి 2016 వరకు సేకరించిన డేటా ఆధారంగా, అధిక వేడి, అధిక వర్షపాతం వల్ల కలిగే ఆకస్మిక మార్పులు రెండూ వ్యవసాయ ఉత్పాదకతపై దీర్ఘకాలిక ప్రభావాలను చూపుతాయి. కొన్ని పంటలు జాతీయ సగటు కంటే చాలా ఎక్కువ నష్టాలను చవిచూస్తున్నాయి. ఉష్ణోగ్రత ఒక్క డిగ్రీ సెల్సియస్ పెరిగితే సజ్జల దిగుబడి 19 శాతం వరకు తగ్గగా, మొక్కజొన్న దిగుబడి 16 శాతానికి పైగా పడిపోయిందని డేటా వెల్లడించింది. అత్యంత తీవ్రంగా ప్రభావితమైన కొన్ని జిల్లాల్లో దిగుబడులు 39 శాతం వరకు పడిపోవచ్చని కూడా పేర్కొంది.

భారతదేశంలోని సెంటర్ ఫర్ స్టడీ ఆఫ్ సైన్స్, టెక్నాలజీ అండ్ పాలసీ, సెంటర్ ఫర్ సోషల్ అండ్ ఎకనామిక్ ప్రోగ్రెస్, ఆస్ట్రేలియాలోని మోనాష్ విశ్వవిద్యాలయం పరిశోధకులు చేసిన ఈ విశ్లేషణ, భారతదేశానికి సంబంధించి ఈ తరహా విశ్లేషణలలో అతిపెద్ద వాటిలో ఒకటి. ఇది సుమారు 12.6 మిలియన్ల రోజువారీ వాతావరణ పరిశీలనల ఆధారంగా, ఐదు దశాబ్దాలుగా 563 జిల్లాలలో (2017లో 663 జిల్లాలలో) 10 ప్రధాన పంటల దిగుబడులను పర్యవేక్షించింది. అధ్యయనం చేసిన 10 పంటలు వరి, గోధుమ, జొన్న, మొక్కజొన్న, సజ్జలు, శనగలు, కందులు, వేరుశనగ, చెరకు, ప్రత్తి. ఇవి భారతదేశ మొత్తం స్థూల సాగు విస్తీర్ణంలో మూడింట రెండు వంతులు, భారతదేశ పంటల రంగం ద్వారా జరిగే మొత్తం విలువ జోడింపులో సుమారు ఐదింట రెండు వంతుల వాటాను కలిగి ఉన్నాయి.

## రెట్టింపు దెబ్బ


ఈ అధ్యయనం తన విశ్లేషణను రెండు నిర్దిష్ట వాతావరణ పరిస్థితులపై కేంద్రీకరించింది, వర్షపాతంలో 20 శాతం తగ్గుదల, ఉష్ణోగ్రతలో ఒక్క డిగ్రీ సెల్సియస్ పెరుగుదల. ఈ రెండింటి ప్రభావాలు దాదాపు ఒకే పరిమాణంలో ఉంటాయి. 20 శాతం వర్షపాత లోటు అన్ని పంటలలో జాతీయ సగటు దిగుబడులను 8.2 శాతం తగ్గిస్తుంది, అయితే ఒక్క డిగ్రీ సెల్సియస్ ఉష్ణోగ్రత పెరుగుదల పంట దిగుబడిలో 7.8 శాతం తగ్గుదలకు దారితీస్తుంది. ఈ రెండు ఉపద్రవాలలో ఏదీ ఏ ప్రధాన పంట వర్గాన్ని వదిలిపెట్టడం లేదు. వర్షపాతం దృష్ట్యా, 10 పంటలలో ఐదు పంటలు జాతీయ సగటు కంటే అధిక నష్టాలను చవిచూశాయి: జొన్న (14.1 శాతం), ప్రత్తి (11.4 శాతం), వరి (11.2 శాతం), సజ్జలు (10.6 శాతం), వేరుశనగ (9 శాతం). ఉష్ణోగ్రత దృష్ట్యా, చెరకు (9.4 శాతం), మొక్కజొన్న (16.2 శాతం), కంది (9.3 శాతం), సజ్జలు (19.1 శాతం), జొన్న (9.4 శాతం) పంటలు అత్యధిక భారాన్ని మోస్తున్నాయి. సానుకూల లేదా ప్రతికూల ఉష్ణోగ్రత వ్యత్యాసాల తాలూకు గణనీయమైన ప్రభావాలు ఎల్లప్పుడూ దిగుబడిని తగ్గిస్తాయని ఆధారాలు సూచిస్తున్నాయి. 'సాధారణం కంటే ఎక్కువ లేదా తక్కువ ఉష్ణోగ్రతల వల్ల పంట దిగుబడులపై గణనీయమైన సానుకూల ప్రభావం ఉన్నట్లు మాకు ఏ సందర్భంలోనూ ఆధారాలు లభించలేదు,' అని అధ్యయనకర్తలు తెలిపారు. అధికంగా వేడెక్కడం, వర్షపాతం తగ్గడమన్నది దిగుబడులపై ప్రతికూల ప్రభావాల్ని చూపుతాయి. వర్షపాతంలో 20% తగ్గుదల, ఉష్ణోగ్రతలో ఒక్క డిగ్రీసెల్సియస్ పెరుగుదల కారణంగా జిల్లాల వారీగా అన్ని పంటల దీర్ఘకాలిక దిగుబడులపై ప్రభావం పడుతోంది.

## స్వల్పకాలిక బాధ, దీర్ఘకాలిక నష్టం

ఈ అధ్యయనంలో వెల్లడైన అత్యంత ముఖ్యమైన విషయాలలో ఒకటి ఏమిటంటే, వాతావరణ మార్పుల తక్షణ ప్రభావం వాస్తవంలో కొంత భాగాన్ని మాత్రమే చెబుతుంది. మొత్తం 10 పంటలకు, ఆ మార్పులు సంభవించిన సంవత్సరంలో కనిపించే దిగుబడి నష్టాల కంటే దీర్ఘకాలిక దిగుబడి నష్టాలు గణనీయంగా ఎక్కువగా ఉన్నాయి, అనేక పంటల విషయంలో, ఈ వ్యత్యాసం చాలా పెద్దది. వరి, గోధుమ, శనగ, కంది, చెరకు, ప్రత్తి పంటలకు, స్వల్పకాలిక గణాంకాల కంటే దీర్ఘకాలిక ప్రభావం 35 నుండి 66 శాతం మధ్య ఎక్కువగా ఉంది. నష్టం కూడా వేగంగా పేరుకుపోతుంది. అన్ని పంటలకు, మొత్తం దీర్ఘకాలిక నష్టంలో 80 శాతానికి పైగా ఒక ఆఘాతం సంభవించిన రెండు సంవత్సరాలలోపే, 90 శాతానికి పైగా మూడు సంవత్సరాలలోపే సంభవిస్తుంది. ఐదవ సంవత్సరం వచ్చేసరికి, దాదాపు మొత్తం దీర్ఘకాలిక ప్రభావం మొదలైపోతుంది, దీనివల్ల తదుపరి వాతావరణ సంఘటన వచ్చేలోపు కోలుకోవడానికి చాలా తక్కువ సమయం మిగిలి ఉంటుంది. అధ్యయనం చేసిన దాదాపు ప్రతి పంట విషయంలోనూ స్వల్పకాలంలో కూడా వాతావరణ పరిస్థితులలో విస్తృతమైన, గణనీయమైన నష్టం వాటిల్లిందని గణాంకాలు వెల్లడించాయి. వర్షపాతంలో ఒక ప్రామాణిక విచలనం లోటు, అధ్యయనం చేసిన 10 పంటలలో చెరకు మినహా తొమ్మిదింటి దిగుబడిపై గణనీయమైన ప్రతికూల ప్రభావాలను చూపింది. స్వల్పకాలిక నష్టాలు గోధుమలకు 4 శాతం నుండి జొన్న, సజ్జలకు 14 శాతం వరకు ఉన్నాయి. భారతదేశంలో అత్యధికంగా వినియోగించే ప్రధాన ఆహారమైన వరి దిగుబడి స్వల్పకాలంలో 9 శాతం క్షీణించగా, ప్రధాన వాణిజ్య పంట అయిన వేరుశనగ దిగుబడి 10 శాతం తగ్గింది. ఉష్ణోగ్రత కూడా ఇదే విధమైన పరిస్థితికి అద్దం పడుతోంది. సాధారణం కంటే వేడిగా ఉన్న పరిస్థితులు నెలకొన్నపుడు 10 పంటలలో ఎనిమిదింటికి - వరి, గోధుమ, జొన్న, మొక్కజొన్న, సజ్జ, శనగ, కంది, చెరకు - స్వల్పకాలిక దిగుబడి నష్టాలను కలిగించాయి. ఈ ప్రభావాలు గోధుమపై 2 శాతం నుండి సజ్జపై 10 శాతం వరకు ఉన్నాయి. అయితే, సాధారణం కంటే చల్లగా ఉన్న పరిస్థితులు కూడా ఎటువంటి ఉపశమనాన్ని అందించలేదు.

## దిగుబడి వృద్ధికి విఘాతం

ఇంకా, గత 25 సంవత్సరాల చారిత్రక దిగుబడి వృద్ధి రేట్లను కొలమానంగా ఉపయోగించి, ఉష్ణోగ్రతలో ఒక్క డిగ్రీ సెల్సియస్ పెరుగుదల అనేది వరి, గోధుమలు రెండింటిలోనూ సుమారు నాలుగు సంవత్సరాల సంచిత ఉత్పాదకత లాభాలను తుడిచిపెట్టడానికి సమానమని పరిశోధకులు లెక్కించారు. మొక్కజొన్న, సజ్జల విషయంలో, ఈ నష్టం ఆరు సంవత్సరాల పెరుగుదలకు, చెరకు విషయంలో ఎనిమిది సంవత్సరాలకు సమానమైంది. ఈ ప్రభావాల తీవ్రత ప్రాథమికంగా వందల మిలియన్ల మంది ప్రజలకు వ్యవసాయ ఆదాయాలలో వాస్తవ తగ్గింపులను, ఆహార ధరలపై పెరుగుతున్న ఒత్తిడిని సూచిస్తుంది. గత పరిశోధనల ప్రకారం, జనాభా పెరుగుదల, అధిక పోషక విలువలు గల ఆహారపు అలవాట్ల వల్ల పెరుగుతున్న ఆహార డిమాండ్‌ను తీర్చడానికి, పంట ఉత్పత్తి 56 శాతం పెరగాల్సి ఉంటుంది. దేశంలో వ్యవసాయం చేయడానికి కొత్త భూమి దాదాపుగా కనుమరుగైనందున, ఉత్పత్తిని పెంచడంలో ఉన్న ప్రధాన సవాలు పంట దిగుబడులను పెంచడమే. భారతదేశ జాతీయ సగటు వార్షిక దిగుబడి వృద్ధి కందికి 0.4 శాతం, శనగ, చెరకుకు 0.9 శాతం నుండి ప్రత్తికి 2.9 శాతం వరకు మారుతూ ఉంటుంది; వరి, గోధుమల సగటు దిగుబడి వృద్ధి వరుసగా 2.1 శాతం, 2.3 శాతంగా ఉంది. యాభై సంవత్సరాల కాలంలో ఈ వృద్ధి రేట్లు అనేక పంటల దిగుబడులలో భారీ పెరుగుదలకు దారితీశాయని ఆ అధ్యయనం వివరించింది. నిరంతర అధిక ద్రవ్యోల్బణం కొనుగోలు శక్తిని క్షీణింపజేస్తుంది, తక్కువ ఆదాయ కుటుంబాలపై అసమానంగా ప్రభావం చూపుతుంది, ద్రవ్యోల్బణ అంచనాలను అస్థిరపరుస్తుంది, ద్రవ్య విధానాన్ని క్లిష్టతరం చేస్తుంది,' అని పరిశోధకులు నివేదికలో హెచ్చరించారు.



- పసుపులేటి గీత
(అసిస్టెంట్ ఎడిటర్)

---

- 563 భారతీయ జిల్లాలపై 51 సంవత్సరాల పాటు జరిపిన విశ్లేషణలో, కేవలం ఒక్క డిగ్రీ సెల్సియస్ ఉష్ణోగ్రత పెరుగుదల జాతీయ సగటు పంట దిగుబడులను సుమారు 8% మేర తగ్గిస్తుందని వెల్లడైంది.
- ఇది సంవత్సరాల తరబడి సాధించిన ఉత్పాదకత వృద్ధిని తుడిచివేస్తుంది.
- వేడి, వర్షపాతం వల్ల కలిగే ఆకస్మిక మార్పులు వరి, గోధుమ, మొక్కజొన్న, సజ్జలు వంటి కీలక పంటలను తీవ్రంగా దెబ్బతీశాయి.
- కొన్ని జిల్లాల్లో 39% వరకు దిగుబడి నష్టం వాటిల్లింది.

కిటికీ

# పొంచి ఉన్న ఆకలి ముప్పు!

ప్రపంచ ఉష్ణోగ్రతలు పెరిగేకొద్దీ ఆహార అభద్రతకు గురయ్యే ప్రమాదం ఉన్న పెద్ద ఆర్థిక వ్యవస్థలలో భారతదేశం ఒకటి. పెరుగుతున్న వేడిమి ఆహార వ్యవస్థల లభ్యత, అందుబాటు, స్థిరత్వానికి ఎలా ముప్పు కలిగిస్తుందో ప్రపంచ సూచిక స్పష్టం చేస్తోంది. ప్రపంచ ఉష్ణోగ్రతలు పెరిగేకొద్దీ ఆహార అభద్రత తీవ్రతరం అయ్యే ప్రమాదం ఉన్న పెద్ద ఆర్థిక వ్యవస్థలలో భారతదేశం కూడా ఒకటని ఒక కొత్త అధ్యయనం వెల్లడించింది. అధికంగా వేడెక్కే పరిస్థితులలో తగినంత పౌష్టికాహారం లభించడమన్నది క్రమంగా తగ్గుతుందని అంచనాలు స్పష్టం చేస్తున్నాయి. ప్రపంచ ఉష్ణోగ్రతలు పెరగడంతో దేశం ఆహార భద్రతలో గణనీయమైన క్షీణతను ఎదుర్కోబోతోందని ఇంటర్నేషనల్ ఇన్స్టిట్యూట్ ఫర్ ఎన్విరాన్మెంట్ అండ్ డెవలప్మెంట్ (IIED) వారి కొత్త అధ్యయనం హెచ్చరిస్తోంది. కొత్తగా రూపొందించిన ఆహార భద్రతా సూచికలో భారతదేశం స్థానం అత్యంత ఆందోళనకరమైన వాటిలో ఒకటిగా ఉందని ఈ నివేదిక పేర్కొంది. దీని బేస్లైన్ స్కోరు 5.31, ప్రపంచ సగటు 6.74 కంటే చాలా తక్కువగా ఉంది, బ్రెజిల్ (6.72), మెక్సికో (6.36) ఇండోనేషియా (5.87) వంటి దేశాల కంటే వెనుకబడి ఉంది. అయితే, అసహజ వాతావరణ మార్పుల ప్రభావం (గ్లోబల్ వార్మింగ్) పెరిగితే పరిస్థితి మరింత దిగజారుతుంది. గ్లోబల్ వార్మింగ్ 1.5 డిగ్రీల సెల్సియస్ (ఓఇ) పెరిగితే భారతదేశ స్కోరు 4.96కు, 2ఓఇ పెరిగితే మరో 4.52కు పడిపోతుందని అంచనా.


## పెరుగుతున్న ప్రపంచ అంతరం

పదేపదే సంభవించే వాతావరణ మార్పుల వల్ల కలిగే ఉత్పాతాల తర్వాత, ప్రపంచవ్యాప్తంగా ప్రజలు నాణ్యమైన ఆహారాన్ని కొనలేకపోవడం లేదా కనీసం జీవించడానికి సరిపడా ఆహారాన్ని కూడా పొందలేకపోవడం వంటి పరిస్థితులను ఎలా ఎదుర్కొంటున్నారో ఈ అధ్యయనం కొలిచింది. ఈ సూచిక 162 దేశాలలో ఆహార భద్రతను నాలుగు మూలస్తంభాల ఆధారంగా అంచనా వేసింది: తగినంత ఆహారం లభ్యత; అది సరసమైన ధరలో ఉందా లేదా అనే దానితో సహా, కుటుంబాలకు దాని అందుబాటు; దాని పోషక విలువ, ఆ పోషకాలను గ్రహించడానికి ప్రజలు తగినంత ఆరోగ్యంగా ఉన్నారా లేదా అనే దానిని వినియోగం అంటారు; ఆహార సరఫరా వ్యవస్థల సుస్థిరత లేదా స్థితిస్థాపకత. ఉష్ణోగ్రతల పెరుగుదల వల్ల ధనిక, పేద దేశాల మధ్య ఆహార భద్రతలో ఇప్పటికే ఉన్న గణనీయమైన అంతరం మరింత పెరుగుతుందని, ముఖ్యంగా సహారా ఉప-ప్రాంత ఆఫ్రికా, దక్షిణాసియాలో అత్యంత తీవ్రమైన క్షీణత ఉంటుందని విశ్లేషణలో వెల్లడైంది. ప్రపంచవ్యాప్తంగా, సుమారు 4.56 బిలియన్ల ప్రజలు, అంటే మానవాళిలో దాదాపు 59 శాతం మంది, ఇప్పటికే 6.74 సగటు స్కోరు కంటే తక్కువ స్కోరు ఉన్న దేశాలలో నివసిస్తున్నారు. 2డిగ్రీ సెల్సియస్ ఉష్ణోగ్రత పెరుగుదల వల్ల, అదనంగా 291 మిలియన్ల మంది ప్రజలు ఆ పరిమితి కంటే దిగువకు పడిపోవచ్చు, దీనివల్ల తగినంత పోషకాహారాన్ని పొందడానికి ఇబ్బంది పడే ప్రజల సంఖ్య మరింత పెరుగుతుంది. ఇదిలా ఉండగా, ప్రపంచ జనాభాలో 41 శాతం మంది, అంటే 3.19 బిలియన్ల ప్రజలు, ప్రస్తుతం ప్రపంచ సగటు కంటే ఎక్కువ స్కోరు సాధించిన దేశాలలో నివసిస్తున్నారు. ఐస్లాండ్ 9.26 స్కోరుతో అగ్రస్థానంలో నిలవగా, ఆ తర్వాత డెన్మార్క్ 9.17, ఆస్ట్రియా 9.15, ఐర్లాండ్ 9.13, బెల్జియం 9.07 స్కోరు సాధించాయి. అత్యల్ప స్కోర్లను ఆఫ్ఘనిస్తాన్ 3.31, మడగాస్కర్ 3.15, హైతీ 2.57, డెమోక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో 2.51, సోమాలియా 1.29 సాధించాయి. ఆహార ప్రాప్యత, వినియోగంలో సగటున ఈ దేశాలు అధిక స్కోరు సాధించగా, లభ్యత, సుస్థిరతలో తక్కువ స్కోరు సాధించాయి.

## ప్రమాదాలు - పరిమితులు

'వాతావరణ మార్పులకు అతి తక్కువ బాధ్యత వహించే అత్యంత పేద దేశాలే దాని తీవ్రమైన ప్రభావాలను ఎదుర్కొంటాయని ఈ పరిశోధన మరోసారి స్పష్టం చేస్తోంది' అని IIEDకి సంబంధించిన వాతావరణ స్థితిస్థాపకత, ఆర్థిక, నష్ట నిర్వహణ విభాగాల డైరెక్టర్ రితు భరద్వాజ్ అన్నారు. మనం ఏమి చేసినా, వాతావరణ మార్పులు కనీసం స్వల్పకాలంలోనైనా ఆహార భద్రతను మరింత దిగజార్చే అవకాశం ఉంది, కానీ లభ్యతలో లేదా పోషక విలువలో విపత్కర క్షీణతలు అనివార్యం కాదు.' వాతావరణ మార్పుల వల్ల వ్యవసాయం, దిగుమతులు, సరఫరా గొలుసులకు కలిగే అంతరాయాల ప్రభావాల నుండి సంపన్న దేశాలు కూడా తప్పించుకోలేవు. ఎ7 దేశాలలో ఏదీ ప్రపంచవ్యాప్తంగా మొదటి ఐదు స్థానాలలో లేదు (జపాన్ డేటా అందుబాటులో లేదు), ఉష్ణోగ్రత పెరుగుదల దృష్ట్యా ఈ దేశాలన్నీ ఆహార భద్రతలో క్షీణతను ఎదుర్కొంటాయని అంచనాలు చెబుతున్నాయి. అమెరికాలో అత్యంత తీవ్రమైన క్షీణత ఉంటుందని అంచనా వేయగా, బ్రిటన్‌లో తులనాత్మకంగా తక్కువ క్షీణత ఉంటుందని అంచనా. ప్రాథమిక స్కోరు 7.62గా ఉన్న చైనా, 2డిగ్రీ సెల్సియస్ ఉష్ణోగ్రత పెరుగుదల వల్ల తన ఆహార భద్రత 7.06కి పడిపోతుందని కూడా అంచనా వేస్తున్నారు.

- కల్కి



Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises D.No.New:3-88, Old : 3-22, Chandra Theatre, Gosala, Penamaluru Mandal, Krishna District,(AP),Pin -521151,
And Published at H.No.23-3-46, 1st Floor, Katamaraju vari Veedhi, Amaravathi Road, Naidupet Guntur(District) AP-522002. EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.APTEL/2016/73939.